





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


జాతీయ ఎమర్జెన్సీ నేపథ్యం, పర్యవసానాలు

అంబేద్కర్ ఆశించింది 'అధికార' జోక్యం లేని న్యాయవ్యవస్థనే

విమానాశ్రయ ప్రతినిధులతో.. పార్లమెంటరీ కమిటీ భేటీ

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 219 | బుధవారం | 09-07-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# సకాలంలో యూరియా ఇవ్వండి

- తెలంగాణకు కేటాయించిన కోటా సరఫరా చేయండి
- దేశీయంగా ఉత్పత్తి అయిన కోటా పెంచండి
- జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ సిటీ అభివృద్ధికి సహకరించండి
- వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సాయం
- హైదరాబాద్ – బెంగళూరు ఎరో డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రులు నడ్డా, పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో పర్యటించారు. రాష్ట్రానికి సంబంధించిన అవసరాలను కేంద్ర మంత్రులకు విన్నవించారు. అందులో భాగంగా తెలంగాణకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం కలిశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకుగానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా తరువాయి 2లో



# నేడు సార్వత్రిక సమ్మె

## కార్మిక సంఘాల సమాయత్తం

- రోడ్లపైకి రానున్న 25 కోట్ల మందికిపైగా కార్మికులు, కర్షకులు
- సంపూర్ణ మద్దతిచ్చిన రైతు సంఘాలు, వామపక్షాలు




**న్యూఢిల్లీ:** కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా బుధవారం సార్వత్రిక సమ్మె జరగనుంది. ఇందుకు 10 కేంద్ర కార్మిక సంఘాలు సమాయత్తమయ్యాయి. మోదీ సర్కారుకు తమ సత్తా చూపించాలని, వినాశకర విధానాలు అవలంభిస్తామంటే ప్రజలు ఒప్పుకోరన్న సందేశాన్ని ఇవ్వాలన్న కృతనిశ్చయంతో కార్మిక సంఘాలు ఉన్నాయి. సార్వత్రిక సమ్మె విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సమ్మెలో 25 కోట్ల మందికిపైగా కార్మికులు పాల్గొననున్నారు. బ్యాంకింగ్, పోస్టల్, మైనింగ్, నిర్మాణ రంగంతోపాటు రవాణా సంస్థల సేవలు స్తంభించనున్నాయి. కార్మికులు, రైతులకు అనుబంధ సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వామపక్ష పార్టీలు సమ్మె జయప్రదానికి కృషి చేశాయి. సమ్మెలో రైతులతోపాటు గ్రామీణ కార్మికులు పాల్గొంటారని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై కదం తొక్కనున్నట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారు విధానాలతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని, ఆరోగ్యం, విద్య, పౌర సేవలు తగ్గాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ, వారి స్థానంలో యువతకు ఉద్యోగ అవకాశాలు రావడంలేదని విమర్శించారు. పదేళ్లుగా మోదీ సర్కారు కార్మిక సదస్సులు నిర్వహించకపోవడాన్ని అమర్‌జిత్ కౌర్ తప్పుపట్టారు. పబ్లిక్ సెక్యూరిటీ బిల్లులను పక్కన పెట్టేయడం వంటి కారణాలతో సార్వత్రిక సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. రైతుల సమస్యలను సైతం మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అమర్‌జిత్ కౌర్ అన్నారు. సార్వత్రిక సమ్మెతో అన్ని రంగాల సేవలు స్తంభిస్తాయని హింద్ మజ్దూర్ సభ నాయకుడు హర్భజన్ సింగ్ సిద్దూ అన్నారు. కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు గతేడాది తమ యూనియన్లు 17 డిమాండ్ల పత్రాన్ని సమర్పిస్తే, ఇప్పటి వరకు వాటికి పరిష్కారం చూపలేదన్నారు. కార్మికులపై మోదీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో దీంతో తేలిపోయిందని వ్యాఖ్యానించారు. సమ్మె మద్దతు ప్రకటిస్తూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఎస్ఇడబ్ల్యూఏ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంయుక్త ప్రకటన చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఔట్ సోర్సింగ్ తరువాయి 2లో

**స్వార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**
**అన్ని వర్గాల ప్రజలకు కూనంనేని పిలుపు**



## సవాలు విసిరి ఢిల్లీకి వెళ్తారా?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ విమర్శలు
- సిఎం సవాల్‌ను స్వీకరించి హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చా
- చర్చకు మంత్రులెవరొచ్చినా సిద్ధమేనని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులు, నిరుద్యోగ అంశాలపై చర్చకు సిద్ధమని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరి, ఇప్పుడు ఢిల్లీకి వెళ్లిపోయారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. సిఎం సవాలును తాను స్వీకరించి చర్చించేందుకు సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు వచ్చానని, సిఎం ఢిల్లీలో ఉన్నందున ఎవరైనా రాష్ట్ర మంత్రులు తరువాయి 2లో

## కెసిఆర్‌కు సవాల్ విసిరితే..

# కెటిఆర్ వచ్చాడు!

- ఎక్కడపడితే అక్కడ కాదు..
- లెక్కలు తీసుకొని అసెంబ్లీకి రండి చర్చిద్దాం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు, కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్

సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రావాలని సవాల్ చేశారని,బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లెక్కలు తీసుకొని అసెంబ్లీకి వస్తే రైతులు, నిరుద్యోగులతో ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిపై చేసిన విమర్శలను భట్టి, పొన్నం ప్రభాకర్‌తో పాటు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తీవ్రంగా ఖండించారు. మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఒక సభలో భట్టి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఒకరికి సవాల్ విసిరితే మరొకరు బయటకు వచ్చారు అని ఎద్దేవా చేశారు. రూ. లక్ష రుణమాఫీ విషయంలో మాజీ సిఎం కెసిఆర్ రెండుసార్లు మోసం చేశారని మండిపడ్డారు. తొలిసారి రుణమాఫీ పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు పదేళ్లలో రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరి బేసిన్ జలాలపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాళేశ్వరం నిర్మించి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, అసత్యాలు మానకపోతే.. తరువాయి 2లో

## భద్రాద్రి రామాలయం ఇఒ రమాదేవిపై

# భూ ఆక్రమణదారుల దాడి

- స్పృహ కోల్పోవడంతో హుటాహుటిన భద్రాచలం తరలింపు
- ''మీది తెలంగాణ.. మాది ఆంధ్రా'' అంటూ ఆలయ సిబ్బందితో భూ ఆక్రమణదారులు వాగ్వాదం
- ఎపి పురుషోత్తం పట్టణంలో ఉన్న భూముల వద్ద ఘర్షణ వాతావరణం



ప్రజాపక్షం/భద్రాచలం

మీది తెలంగాణ, మాది ఆంధ్రా. మీరు మా రాష్ట్రంలోనికి రావద్దు' అంటూ భద్రాద్రి రామాలయం సిబ్బందిని భూముల ఆక్రమణ దారులు హెచ్చరికను జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నం రామాలయం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం భద్రాచలం ఆలయ సిబ్బందితో కలిసి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవి అక్కడికి వెళ్లారు. అక్రమ నిర్మాణాలు ఆపాలని, కోర్టు తీర్పు ఉందని, ఆ తీర్పును గౌరవించాలని చెప్పినప్పటికీ ఆక్రమణదారులు ఖాతరు చేయకుండా ఆమెతో వాగ్వివాదానికి దిగారు. దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చూస్తుండగానే ఆక్రమణదారులు ఇవో, సిబ్బందిపై తరువాయి 2లో

# పాలస్తీనావాసులను గాజా నుండి తరలించాలి

- వైట్‌హౌస్ విందులో ట్రంప్–నెతన్యాహూ ఉద్ఘాటన
- వచ్చేవారం ఇరాన్‌తో చర్చలు, గాజా ఒప్పందం



**వాషింగ్టన్ :** పాలస్తీనా ప్రజలను గాజా స్ట్రిప్ నుండి తరలించాలన్న పూర్వపు ఆలోచనలను డోనాల్డ్ ట్రంప్–బెంజిమన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి హింసకు తెరపడుతుందన్న ఆశలమధ్య మంగళవారంనాడు నాయకులిద్దరూ వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ఇరాన్‌పై యుద్ధం తర్వాత మొదటిసారి వారిద్దరి మధ్య విందు సమావేశం జరిగింది. గడచిన ఆరునెలలకాలంలో వైట్‌హౌస్‌ను మూడుసార్లు సందర్శించిన నాయకుడు నెతన్యాహూతో కలిసి ట్రంప్ ఈసారి అధికారికంగా ఎలాంటి పత్రికా గోష్ఠీ ఏర్పాటు చేయలేదు. ఐనప్పటికీ విందు ప్రారంభానికి ముందుగా బ్లూ రూమ్‌కు పాత్రికేయులను ఆహ్వానించారు. ఇరాన్‌లో తమ విజయం మధ్యప్రాచ్యంలో కొత్త శకానికి నాంది పలుకుతుందని నాయకులు ఇద్దరూ తరువాయి 2లో

## సిటీ సివిల్ కోర్టుకు

# బాంబు బెదిరింపు

- జింఖానా క్లబ్‌లోనూ 4 ఆర్‌డిఎక్స్ బాంబులు పేలుతాయంటూ ఇమేజ్‌లు
- అప్రమత్తమైన పోలీసులు
- బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు
- ఉత్తదే అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్



''సిటీ సివిల్ కోర్టులో ఆర్‌డిఎక్స్ బాంబులు పెట్టాము..ఈ బాంబులు పేలిన 20 నిముషాలలో జింఖానా క్లబ్‌లో కూడా నాలుగు ఆర్‌డిఎక్స్ బాంబులు పేలబోతున్నాయి'' అంటూ ఓ అగంతకుడు సిటీ సివిల్ కోర్టుతో పాటు జింఖానా క్లబ్‌కు ఇమెయిల్ పంపించాడు. బుధవారం ఉదయం 3 గంటలకు వచ్చిన ఈమెయిల్ అంశాన్ని పోలీసులకు చేరవేశారు. దీంతో పోలీసులు ఆగమేఘాలపై అక్కడికి చేరుకుని బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. బాంబులు తరువాయి 12లో


## హాట్‌టాపిక్‌గా...

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకమే
- టిక్కెట్ కోసం తీవ్ర పోటీ


(మల్లం వెంకటేశ్)

బిఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో అందరి కళ్లూ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పడ్డాయి. గతంలో ఏ ఉప ఎన్నికకూ లేనంత ఆసక్తి నెలకొంది. ఆరునెలలోపు ఉప ఎన్నిక జరగనున్న ఈ నియోజకవర్గాన్ని అన్ని పార్టీలూ సవాల్‌గా తీసుకున్నాయి. జూబ్లీహిల్స్‌లో పోటీ చేసేందుకు అన్ని పార్టీలలో ఆశావహులు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. ఇప్పటికే పలువురు ఆశావహులు తమకే టికెట్ కేటాయించాలని బయోడేటాలు పట్టుకొని పార్టీ అధిష్ఠానం, పెద్ద నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



**బల్దియా ఎన్నికలకు సెమీ ఫైనల్స్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు అక్టోబర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నాయి. రాబోయే డిసెంబర్ జనవరి మధ్య జిహెచ్‌ఎంసి పాలకమండలి ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## గుండెపోటుతో వైద్యుడు హఠాన్మరణం

**అక్రా :** పశ్చిమ ఆఫ్రికాదేశం ఘనాలోని ఒక ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యుడు డాక్టర్ క్వామే అదూ అఫోరీ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. 47 ఏళ్ళ వయసుగల ఎమర్జెన్సీ ఫిజీషియన్ విధినిర్వహణలో ఉన్నప్పటికీ ఆసుపత్రి వైద్యం అతడిని కాపాడలేకపోయింది. ఘనాలో రెండవ అతిపెద్ద ఆసుపత్రి కుమాసీలోని కోంఫో అనోక్యేలో ఈ ఘటన జరిగింది. ఎంతో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంగల పరికరాలు ఉన్నప్పటికీ ఆయనను అవేవీ కాపాడలేదు. గుండెకు రక్తం సరఫరాచేసే రక్తనాళం పూడుకుపోవడంతో ఆయన హఠాన్మరణానికి గురయ్యారు. వైద్యులు వెంటనే అతడి రక్తనాళాణ్ణి తెరచి చికిత్సకు యత్నించినప్పటికీ మధ్య మధ్యలో అంతరాయాలవల్ల ఆయన మరణించారు. తన జీవితంలో అనేకమందిని కాపాడిన చరిత్రగల వైద్యుడుగా పేరుపొందిన అఫోరీ మృతికి ఆసుపత్రి సిబ్బంది, రోగులు తీవ్ర సంతాపం తెలియజేశారు.

## ఉగ్రవాద జాబితాలోంచి హెచ్‌టిఎస్ తొలగింపు



**వాషింగ్టన్ :** సిరియాలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించి ప్రస్తుతం ప్రభుత్వంలో విలీనమై అతర్థానమైన హెచ్‌టిఎస్ (హయత్ తహ్రీర్ అల్–షామ్) సంస్థను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల జాబితా నుండి ట్రంప్ తొలగించారు. సిరియాపై ఆంక్షలను ఎత్తివేసి అంతర్యుద్ధంవల్ల నాశనమైన ఆ దేశ పునర్నిర్మాణానికి సహాయం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ట్రంప్ ప్రభుత్వం ఆ తాజా నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌తో శాంతికి, ఘర్షణలు ఆపేయడానికి వీలుగా 1974 నాటి ఒప్పందాన్ని అమలు చేసేందుకు గడచిన శుక్రవారంనాడు సిరియా సమ్మతించిన పూర్వరంగంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. హయత్ తహ్రీర్ అల్–షామ్ అనే సున్నీ ఇస్లామిస్ట్ రాజకీయసంస్థ, పారామిలిటరీ విభాగం గల సిరియా అంతర్యుద్ధ సమయంలో ఎంతో కీలకపాత్ర వహించింది. అనేక సాయుధ గ్రూపుల విలీనము ద్వారా 2017 జనవరిలో ఈ హెచ్‌టిఎస్ ఆవిర్భవించింది. అస్సాద్ కుటుంబ పాలనను అంతమొందించి 'సిరియా రివల్యూషన్' సాధించేందుకు హెచ్‌టిఎస్ ఆవిర్భవించింది. అందుకు అనుగుణంగా గత ఏడాది డిసెంబరు ఎనిమిదో తేదీన అల్ అసద్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలింది. ఆయన రష్యాకు పారిపోయాడు. అప్పటినుంచి హెచ్‌టిఎస్ రథసారథిగా ఉన్న అహ్మద్ అల్ షరా అమెరికా అండదండలతో సిరియా దేశాధ్యక్షుడయ్యారు. మహ్మద్ అల్–బషీర్ ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇక హెచ్‌టిఎస్ లక్ష్యం పూర్తి కావడంతో దానిని అందులోని సంస్థలను సిరియా సైన్యంలో, ఇతర ప్రభుత్వ విభాగాలలో విలీనం చేసి హెచ్‌టిఎస్ ఉనికిని రద్దు చేశారు. దీంతో ఇప్పుడు అమెరికాకు సిరియా మిత్రదేశంగా మారింది.

## వాణిజ్య ఒప్పందానికి చేరువలో భారత్–అమెరికా

### ట్రంప్ ప్రకటన




**న్యూయార్క్ :** భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి చేరువలో ఉన్నాయని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. "ఇప్పుడు మేం బ్రిటన్‌తో ఒక ఒప్పందం చేసుకున్నాం, చైనాతో ఒప్పందం చేసుకున్నాం, భారత్‌తో కూడా ఒప్పందం చేసుకునే ప్రక్రియ దగ్గరపడింది. ఇతరులను కూడా కలుసుకుని చర్చిస్తున్నాం, అందరితో చర్చిస్తాం, ఒప్పందం చేసుకుంటాం, కేవలం లేఖలు పంపడం లాంఛనం మాత్రమే, మీరు గనుక ఆటలాడాలనుకుంటే ఈమేరకు చెల్లింపులు చేయాల్సి ఉంటుందంటే" అని ట్రంప్ మంగళవారనాడు ప్రకటించారు. ఏ దేశం ఎంత టారిఫ్ పన్నులు చేస్తే అమెరికా కూడా వారివద్ద అంతే టారిఫ్ పన్నులు చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఇతరదేశాలు అనుసరిస్తున్న టారిఫ్ విధానంవల్ల అమెరికా వాణిజ్యలోటు విపరీతంగా పెరిగిపోతోందని, తమతో వ్యాపారం చేసే అన్నిదేశాలు బాగా లాభపడుతున్నాయని ట్రంప్ అన్నారు. అదేవిధంగా ట్రంప్ మరోసారి భారత్–పాకిస్తాన్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారు. యుద్ధం ఆపకపోతే రెండు దేశాలతో వాణిజ్యం చేసేదిలేదని తేల్చి చెప్పామన్నారు.

**ఆగస్టు 1వరకు గడువు పెంపు భారత్‌కు ఊరట**

ట్రంప్ యంత్రాంగం ముందుగా సంకేతాలిచ్చినవిధంగానే టారిఫ్‌ల అమలు గడువు తేదీని అమెరికా ఈనెలాఖరు వరకు పొడిగించింది. దీంతో భారత్‌కు ఊరట లభించింది. రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ట్రంప్‌కు లొంగిపోయే పద్ధతులలో హడావుడి ఒప్పందాలు చేసుకోవద్దని దేశంలో కూడా ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. వివిధ శాఖల సీనియర్ అధికారుల నుండి అమెరికాకు ఇంకా భారత్ సమాచారాన్ని అందజేయాల్సి ఉన్న తరుణంలో భారత్‌కు ఈ గడువుతేదీ పొడిగింపు ఊరటనిచ్చింది. భారత్ కొద్దిరోజులుగా ద్వైపాక్షిక ఒప్పందంపై ముమ్మరంగా చర్చలు చేస్తున్న తరుణంలో సోమవారం నుండి ట్రంప్ టారిఫ్ లేఖల పంపిణీ ప్రారంభించారు. బంగ్లాదేశ్, బోస్నియా, హెర్జిగోవీనా, కంబోడియా, కజఖ్‌స్థాన్, లావోస్, సెర్బియా, ట్యునీషియా, ఇండోనేసియా, జపాన్, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, మలేసియా, థాయ్‌లాండ్ దేశాలు టారిఫ్ లేఖలు అందుకున్నాయి. చాలా దేశాలు ఇంకా గడువు కోరుతున్నాయి. పైగా ఒప్పందాలు చేసుకునేందుకు ముందుకు వచ్చిన దేశాలకు తగిన సమయం లేకపోవడంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## దోహాలో ఇజ్రాయెల్–హమాస్

### రెండోరోజూ చర్చలు విఫలం

**దోహా :** మధ్యవర్తుల ప్రమేయంతో దోహాలో ప్రారంభమైన ఇజ్రాయెల్–హమాస్ చర్చలు మంగళవారం రెండో రోజున కూడా ఎలాంటి పురోగతి సాధించలేదు. గడచిన శుక్రవారం ట్రంప్ చేసిన ప్రకటనతో గాజాలో యుద్ధ విరమణకు ఎంతో ఉత్సాహం చూపిస్తున్న హమాస్ ఈసారి ఎలాగైనా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం సాధించాలన్న పట్టుదలతో ఉంది. ఐనప్పటికీ హమాస్ కొన్ని షరతులు విధిస్తుండగా, ఇజ్రాయెల్ కూడా తనదైనశైలిలో పాత షరతులను పునరుద్ఘాటిస్తున్నది. ఈసారి గతంకంటే భిన్నమైన వాతావరణం ఉందని, చర్చల్లో ఒప్పందం జరుగుతుందని మధ్యవర్తిదేశాలు ఖతార్, ఈజిప్టు కూడా ఆశాభావంతో ఉన్నాయి. అంతకుమించిన స్థాయిలో ట్రంప్ కూడా ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగుల ద్వారా ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించారు. ఇది హమాస్‌కు "ఆలసించిన ఆశాభంగం.., ఇదే చివరి మేలైన అవకాశం..." అంటూ పోస్టింగుల మోత మోగించారు. ఒప్పందం కుదిరినా కుదరకపోయినా గానీ ఇజ్రాయెల్ సైన్యం గాజాను వదిలివెళ్ళిపోవాలని హమాస్ కోరుతున్నది. 60 రోజుల కాల్పుల విరమణకు, సజీవంగా ఉన్న 10 మంది బందీల విడుదలకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ సీనియర్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అదేవిధంగా మరో 18 మృతదేహాలను కూడా స్వాధీనం చేస్తామని వారు ప్రకటించారు. కానీ పాలస్తీనాలో హమాస్ పరిపాలన ఉండకూడదని నెతన్యాహూ పట్టుదలతో ఉన్నారు.

**ఐదుగురు ఐడిఎఫ్ సైనికులు మృతి**

ఉత్తర గాజాలో జరిగిన దాడుల్లో ఐదుగురు ఇజ్రాయెలీ సైనికులు మరణించారు. మరో 14 మంది గాయపడ్డారు. అదేవిధంగా ఐడిఎఫ్ దాడుల్లో 18 మంది పాలస్తీనియన్లు మరణించారు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి మాట్లాడేందుకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అమెరికాలో పర్యటిస్తున్న సమయంలోనే, గాజాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. ఉత్తరగాజా బైట్ హనౌన్ ప్రాంతంలో సైనిక చర్యలకు దిగిన ఐడిఎఫ్ సైనికులపై కాల్పుల్లో ఐదుగురు మరణించారు. సరిగ్గా నెలరోజుల క్రితం కూడా ఐడిఎఫ్ బృందం ప్రయాణిస్తున్న వాహనానికి ఉగ్రవాదులు బాంబులు తగిలించడంతో అవి పేలి ఏడుగురు ఇజ్రాయెలీ సైనికులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ సైన్యానికి ఎదురైన అతిపెద్ద విఘాతం ఇదే.

## నేడు సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

విధానాలు, ఒప్పందీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల పోరాడుతున్న విషయాన్ని గుర్తుచేశాయి. కార్మిక ఉద్యమాలను నీరుగార్చే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్ చేశాయి. పని గంటలు పెంచడం, కార్మిక హక్కులను హరించడం, సమ్మె హక్కును అణచివేయడం, యజమానుల ద్వారా కార్మిక చట్టాల ఉల్లంఘలను నేరం కాకుండా చూడటం కోసం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నీరుగార్చిందని దుయ్యబట్టాయి. ప్రజలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్ అనుకూల విధానాల అమలు కోసం కసరత్తు చేస్తూ, సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మోదీ ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు విమర్శించాయి. ఇటువంటి అన్ని చర్యలను నిలదీసేందుకు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా అమలు చేసే విధానాలపై ఒత్తిడి తెచ్చేందుకు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్ని రంగాల వారికి ముఖ్యంగా యువజనులు, విద్యార్థులకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

**సమ్మెను జయప్రదం చేయండి : కూనంనేని పిలుపు**

కేంద్ర ప్రభుత్వకార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యల పిలుపు మేరకు బుధవారం జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయడం ద్వారాకేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం కార్మికులకు సంబంధించిన సమ్మె కాదని, నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత,ద్రవ్యోల్బణం, కనీస వేతనం, పెన్షన్ తదితర సామాన్యుల సమస్యలపై జరుగుతున్న పోరాటమని ఆయన అన్నారు. అనేక సమస్యలతో కూడిన 17 డిమాండ్లతో జాతీయ సమ్మె జరుగుతున్నదని, సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. సమ్మెలో సిపిఐ శ్రేణులు ప్రత్యక్ష భాగస్వాములు అవుతున్నారని, ప్రజలంతా తమ సంఘీభావాన్ని ప్రకటించాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య ప్రదేశాలలో 10 గంటల పనిదినాన్ని అనుమతించేందుకు జారీ చేసిన జిఒ282ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు.

## ఢిల్లీకి వెళ్తారా?

(మొదటి పేజీ తరువాయి)

చర్చకు వచ్చినా తాను సిద్ధమేనని స్పష్టం చేశారు. రైతు, నిరుద్యోగ సమస్యలపై చర్చించేందుకు కెటిఆర్ నేతృత్వంలోని బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు తెలంగాణ భవన్ నుంచి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్ వద్ద సిఎం కోసం ఒక ప్రత్యేక కుర్చీని కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న 600 మంది రైతులకు బిఆర్‌ఎస్ నాయకులు ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. కాగా సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉండడంతో కొద్ది సేపు వేచి చూసిన తర్వాత కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం రాదనే సంగతి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరోసారి తెలిసిందన్నారు. బూతులు తప్ప రైతుల గురించి సిఎంకు బేసిక్ నాలెడ్జ్ లేదని,18 నెలల అసమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల మంది అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజక వర్గంలోనే 670 మంది రైతులకు రైతు భరోసా రాలేదని, వారిపేర్లు, అడ్రసులు, ఫోన్ నంబర్లను తీసుకొచ్చానని వివరించారు. రుణమాఫీ కానీ లక్షల మంది అధికారిక జాబితా కూడా తమ వద్ద ఉన్నదని, అలాగే రేవంత్ రెడ్డి సిఎం అయిన తర్వాత వ్యవసాయం చేయలేక ఆత్మహత్యలు చేసుకున్న 670 మంది రైతుల వివరాలు, వడ్ల బోనస్ రాని రైతుల జాబితా కూడా తమ వద్ద ఉన్నదని కెటిఆర్ వివరిచంఆరు. తమ కంటే సిఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉంటారని, ఆయన ఢిల్లీలో ఉన్నందున, ఎవరైన మంత్రులు చర్చకు వస్తే, తమ వద్ద ఉన్న వివరాలు ఇచ్చేవాడినిన కెటిఆర వివరించారు. ఏ అంశంపైనైనా,ఎప్పుడైనా, ఎక్కడైనా తాము చర్చకు సిద్ధమన్నారు. ఒకవేళ చర్చకు రాకపోతే కెసిఆర్‌కు కి క్షమాపణ చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డిని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## కెటిఆర్ చర్చకు వస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్‌ఎస్ కు డిపాజిట్లు రావు అని అన్నారు. నోరుంది కదా అని కెటిఆర్ ఏది పడితే అది మాట్లాడమేనా? అని భట్టి ప్రశ్నించారు.

**ప్రతిపక్ష హోదాలో కెటిఆర్ వస్తే సమాధానమిస్తాం : పొన్నం**

గాంధీభవన్‌లో మంగళవారం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నుంచి ఎవరు చర్చకు వచ్చినా సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే చర్చ అనేది ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో చేస్తారని, కెసిఆర్‌తో లెటర్ రాయించుకుని ప్రతిపక్ష నేత హోదా తీసుకుని కెటిఆర్ చర్చకు రావాలని అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని, ఎవరేమిటో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందో, బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందో అంతా చర్చిద్దామని మంత్రి అన్నారు. ప్రతి అంశంపై అసెంబ్లీలో చర్చిస్తే అంత రికార్డ్ అవుతుందని, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు, కెటిఆర్‌కు చేతనైతే అసెంబ్లీలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

**విదేశాల్లో తిరుగుతున్న కెటిఆర్‌కు సిఎం షెడ్యూల్‌పై అవగాహన లేదు :జగ్గారెడ్డి**

జగ్గారెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఎరువులు, నిధులు, నీళ్ల పంచాయతీ కోసం, తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ఢిల్లీకి వెళితే కెసిఆర్ కుటుంబం లిక్కర్ దందా కోసం ఢిల్లీ వెళ్లిందన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ ఇటీవలి కాలంలో తెలంగాణలో ఉండడం లేదని, నెలకోసారి విదేశాల్లో ఉంటున్నారని, విదేశాల్లో తిరిగే కెటిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి షెడ్యూల్ ఏమిటి, ఏమి చేస్తున్నారనే విషయాలపై కెటిఆర్‌కు అవగాహన లేదన్నారు. పదేళ్లు మంత్రిగా చేసిన కెటిఆర్, సిఎంగా ఉన్న కెసిఆర్‌కు ముఖ్యమంత్రులు ఢిల్లీకి ఎందుకు పోతారనే ఇంగిత జ్ఞానం లేదా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లకు 18 నెలలు అధికారంలో లేకపోయే సరికి నీళ్లలో చేప ఒడ్డున పడ్డట్టు గిలగిల కొట్టుకుంటున్నారని, అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు.

**అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేని బిఆర్‌ఎస్ నేతలు : ఎంఎల్‌సి అద్దంకి దయాకర్**

బిఆర్‌ఎస్ నేతలకు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదని, అందుకే రోడ్లపై చర్చలకు డిమాండ్ చేస్తున్నారని, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బజారున పడి పిచ్చి కుక్కలా వ్యవహరిస్తున్నారని ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి పేరు చెబితే బిఆర్‌ఎస్ నాయకులు వణికిపోతున్నారన్నారు. అసెంబ్లీకి కెసిఆర్ ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. కెటిఆర్ తన స్థాయికి దిగజారి నీచ, నికృష్ట స్థాయిలో మాట్లాడుతున్నారని, లక్ష కోట్లు దోచుకున్న దొంగలు, అవినీతి సంపాదనతో ఎగిరెగిరి పడుతున్నారని.

**కెటిఆర్ మరో కొత్త డ్రామాకు తెరలేపారు : బీర్ల అయిలయ్య**

తెలంగాణ రాష్ట్రంలో కెటిఆర్ మరో కొత్త డ్రామాకు తెరలేపారని, రైతులు, నిరుద్యోగులు, బనకచర్ల అంశాలపై చర్చకు అసెంబ్లీకి రావాలని కెసిఆర్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరితే సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు రావాలని కెటిఆర్ సవాల్ విసరడం ఏమిటి అర్థం కావడంలేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కెసిఆర్, హరీష్‌రావు అప్పనంగా ఆంధ్రకు నీళ్లు పంపించారని అన్నారు. రాయలసీమకుపోయి రొయ్యల పులుసు తిని తెలంగాణను ఎండబెట్టి రాయలసీమకు నీళ్లు ఇవ్వడానికి ఒప్పుకుంది కెసిఆర్ అన్నారు. మరోసారి సిఎం రేవంత్ రెడ్డిపై చిల్లర మల్లర మాటలు మాట్లాడితే తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్ నేతలను ఉరికించి కొడతారని ఆయన హెచ్చరించారు.

## ఇఒలపై దాడి చేస్తే ఊరుకోం : మంత్రి సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. దేవుడి భూములు రక్షించే ఈవోలపై దాడి చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని కొండా సురేఖ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా... రూల్స్‌కు విరుద్ధంగా ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పిడి యాక్టు పెడుతాం.... ఈ విషయంలో గతంలోనూ తాము స్పష్టం చేశానని గుర్తు చేశారు.భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఎపి)లో కబ్జాకి గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై దాడి చేయడం సహేతుకం కాదన్న పేర్కొన్నారు. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం.... ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని... సమస్యను పరిష్కారం చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.పురుషోత్తపట్నం దాడికి సంబంధించి భద్రాచలం ఈవో రమాదేవితో మంత్రి కొండాసురేఖ ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈవో రమాదేవి స్థానిక ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. డిపార్టుమెంటు నుంచి అండగా ఉంటామని... వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలని రమాదేవికి మంత్రి సురేఖ సూచించారు.

## భూ ఆక్రమణదారుల దాడి

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. ఆక్రమణదారులు ఇవో రమాదేవిపై దాడిచేశారు. దీంతో ఆమె స్పృహకోల్పోవడంతో హుటాహుటిన భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఏపిఒ భవాని రామకృష్ణ కొందరు సిబ్బందితో కలిసి సోమవారం ఘటనా స్థలానికి చేరుకున్న విషయం విధఇతమే. నిర్మాణాన్ని ఆపేందుకు ప్రయత్నం చేయగా అక్కడ వివాదం చోటు చేసుకుంది. దీంతో రంగ ప్రవేశం చేసిన ఆంధ్రా పోలీసులు, రెవెన్యూ అధికారుల ముందే అక్కడికి వెళ్లిన అధికారులపై ధౌర్జన్యానికి పాల్పడమే కాకుండా ఇది ఆంధ్రా, మీది తెలంగాణ ఇక్కడి నుండి తక్షణమే వెళ్లిపోవాలని, లేదంటే ఊరుకునేదే లేదని బెదిరింపులకు పాల్పడంతో విధిలేని పరిస్థితులు అక్కడికి వెళ్లిన సిబ్బంది వెనక్కు మళ్లిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పు ఉన్నా పురుషోత్తపట్నంలోని భూములను రామాలయం అప్పగించాలని తెలంగాణ, ఆంధ్రా హైకోర్టులు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ అంధ్రాకు చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరించడం లేదని రామాలయం ఉద్యోగులు అంటున్నారు. రామాలయం భూములను కాపాడుకునేందుకు వెళ్లిన వాలిపై కూడా విచక్షణారహితంగా వ్యవహిస్తుంటే అంతా ప్రేక్షక పాత్ర పోషించారని, హై కోర్టు తీర్పును కూడా గౌరవించకుండా దాడులకు పాల్పడటం హేయమైన చర్యను పలువురు అంటున్నారు.

**విభజన తెచ్చిన తంటా :** సుమారు 918 ఎకరాల రామాలయం భూములు రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలో విలీనం అయ్యాయి. దీంతో రాముడు ఇటువైపు, మాన్యం అటువైపు ఉండిపోయింది. రామలయాన్ని అభివృద్ధి చేసేందుకు సెంటు భూమి కూడా లేకపోవడంతో గత ప్రభుత్వం చేతులెత్తేసింది. కోర్టు తీర్పుతో భూములను స్వాదీనం చేసుకుని అభివృద్ధి పనులు చేసి రామాలయాన్ని తీర్చిదిద్ది సుందరభద్రాద్రిగా మారుద్దామననే సంకల్పంతో ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతోంది. ప్రభుత్వం చొరవ చూపాలి దశాబ్దాల కాలంగా ఈ రగడ సాగుతూనే ఉంది. గత కొంతకాలం క్రితం కూడా ఇఒ రామాదేవి భూముల రక్షణ కోసం అక్కడికి వెళ్లినప్పుడు దాదాపూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిలాల్లో ఉన్న ముగ్గురు మంత్రులు దీనిపై సమగ్ర చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి సమక్ష్యంలో ఓ కమిటీని వేసి ఏపి ప్రభుత్వానికి విషయాన్ని క్షుణ్ణంగా వివరించే సమస్య పరిష్కారానికి కృషిచేయాలని, ఈ విషయాన్ని ఇలానే వదిలేస్తే ఎప్పటికీ రావణకాష్టంలా రగులుతూనే ఉంటుందని రామభక్తులు అంటున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

బల్దియా ఎన్నికలకు జూబ్లీహిల్స్ సెమీ ఫైనల్ కానుంది. జిహెచ్‌ఎంసిలో పాగా వేయాలంటే ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని అన్ని పార్టీలు వ్యూహాలు ప్రతి వ్యూహాలు రచిస్తున్నాయి. ఖాళీ అయింది బిఆర్‌ఎస్ స్థానం కాబట్టి తిరిగి నిలబెట్టుకోవాలని ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేయాలనే వ్యూహంతో బిఆర్‌ఎస్ పావులు కదుపుతోంది. ఇక కాంగ్రెస్‌కు గతంలో సికిందరాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే గెలుపు ద్వారా ప్రజలు తమవైపే ఉన్నారని నిరూపించుకునేందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మంచి అవకాశంగా మారనుంది. దీంతో కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికలకూ సాంకేతంగా మారనుంది. బిజెపి సైతం ఇక్కడ విజయం ద్వారా భవిష్యత్ తమ పార్టీదేనని చెప్పాలనుకుంటోంది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సైతం ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో ఆయన ఇటీవల తరచుగా జూబ్లీహిల్స్‌లో పర్యటిస్తున్నారు. ఎన్నికల్లో ఎంఐఎం నిర్ణయం కీలకంగా మారనుంది. ఎంఐఎం పోటీ చేసినా, చేయకపోయినా గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉంటుంది. దీంతో ఎంఐఎం అధికార కాంగ్రెస్‌కు మద్దతు ఉంటుందా? లేక అభ్యర్థిని పోటీ పెడుతుందా? అనే విషయం ఉత్కంఠతగా మారింది.

**బిఆర్‌ఎస్‌లో ఎవరికో టికెట్..** బిఆర్‌ఎస్ నుంచి బరిలో దిపిందేకు గోపీనాథ్ భార్య అనిత, ఆయన సోదరుడు వజ్రనాథ్ పేర్లు వినిపిస్తున్నాయి. వారు ఇప్పటికే బస్తీల్లో ప్రజలను కలుస్తున్నారు. పిజెఆర్ తనయుడు, గతంలో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన విష్ణువర్ధన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సారి ఎలాగైనా బిఆర్‌ఎస్ టిక్కెట్ సాధించి గెలవాలనుకుంటున్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన రావుల శ్రీధర్‌రెడ్డి గతంలో, అంతకు ముందు ఇదే నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆయన కూడా గులాబీ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నారు.

**కాంగ్రెస్‌లో పెరిగిన ఆశావాహులు :** అధికార కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహుల పోటీపడుతున్నారు. అధికార పార్టీ కావడం, నగరం నుంచి ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడం, గెలిస్తే మంత్రిపదవి ఖాయమన్న నమ్మకంతో పలువురు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేసిన వెటరన్ క్రికెటర్ అజహారుద్దీన్ తన టిక్కెట్ తిరిగి తనకే దక్కుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గం నుంచి గణనీయమైన ఓట్లు పొందిన ఫిరోజ్‌ఖాన్ సైతం టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, గతంలో తన తండ్రి పిజెఆర్ నియోజకవర్గం కావడంతో తనకు గెలిచే అవకాశాలుంటాయని, టిక్కెట్ కోరుతున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తాను ఇక జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో పోటీచేయనని ఇప్పటికే ప్రకటించారు. ఉపఎన్నిక ద్వారా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని, అందుకు తన తండ్రి కె.కేశవ్ రావు ద్వారా టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బిసిల జాబితాలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ మురళీ గౌడ్ టిక్కెట్ ఆశిస్తున్నారు. మురళీగౌడ్, ఆయన కొడుకు సంజయ్ గౌడ్ ఇద్దరూ చెరొకసారి కార్పొరేటర్లుగా పనిచేశారు. సుదీర్ఘకాలం నియోజకవర్గంలో ఉండటంతో పాటు తాము స్థానికంగా కార్పొరేటర్‌గా పనిచేసినందున ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు. 2014లో ఎంఐఎం నుంచి పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలిచిన నవీన్‌యాదవ్, గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సైతం పార్టీ తనకేమైనా అవకాశం ఇస్తే పోటీ చేస్తానని చెబుతున్నారు.

**బిజెపిలో పెరిగిన పోటీ..** గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నుంచే పోటీ చేసిన లంకెల దీపక్‌రెడ్డితో పాటు ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పారిశ్రామికవేత్త కీర్తి రెడ్డి, ఎన్.వి. సురేశ్‌లతో సహా పలువురు నేతలు జూబ్లీహిల్స్ టికెట్ కోసం జోరుగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో చార్మినార్ నుంచి పోటీచేసిన మాధవీలత సైతం రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి నగరంలో రాజకీయ రంగప్రవేశం చేయాలనుకుంటున్నట్లు ప్రచా రం సాగుతోంది. గతంలో కూకట్‌పల్లి నుంచి పోటీచేసిన నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినిని పోటీలో దింపుతారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి అసలు పోటీలో ఉంటుందా? బిజెపికి మద్దతుగా ఉంటుందా? అనే విషయం తెలాల్సి ఉంది.

## గాజా నుండి తరలించాలి

(మొదటి పేజీ తరువాయి)

మీడియా వద్ద ఆశాభావం వ్యక్తం చేశారు. "మధ్యప్రాచ్యంలో పరిస్థితులన్నీ క్రమంగా సర్దుమణుగుతున్నాయనే అనుకుంటున్నా, వారు (ఇజ్రాయెల్) మమ్మల్ని గౌరవిస్తున్నారు, మేం వారిని గౌరవిస్తున్నాం" అని ట్రంప్ చెప్పారు. ఇరాన్ తమతో సంప్రదింపులు పునఃప్రారంభించాలని కోరుకుంటోందనీ, కానీ వారు ఇప్పటివరకూ ఆ విషయాన్ని ధృవీకరించలేదని అన్నారు. అమెరికాతో మళ్ళీ చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ గతవారంలో ప్రకటించింది.

గాజా నుండి వెళ్ళిపోయేందుకు ఇష్టపడే పాలస్తీనా ప్రజలను స్వీకరించేందుకు కొన్ని దేశాలు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయని, అందుకు సంబంధించిన ప్రక్రియ పురోగతిలో ఉందన్న విషయాలను వారు ప్రస్తావించారు. పాలస్తీనాలో యుద్ధాన్ని విరమించినప్పటికీ అక్కడి ప్రజలను వేరే చోటకు తరలించాలని ట్రంప్–నెతన్యాహూ దృఢనిశ్చయంతో ఉన్నారని ఈ విందు సమావేశంలో మరోసారి తేటతెల్లమైంది. గాజాస్ట్రిప్‌ను ఒక రియల్ ఎస్టేట్ ప్రాతిపదికపై ప్రపంచంలోనే అత్యంత సుందరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న ట్రంప్ ఆలోచనలనే ఆ ఇద్దరూ పునరుద్ఘాటించారు. పాలస్తీనాలో హమాస్ ప్రభుత్వాధికారాన్ని కొనసాగించేందుకు వీలుగా కాల్పుల విరమణ ఒప్పందానికి నెతన్యాహూ సిద్ధంగా లేరని ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. కానీ వైట్‌హౌస్ అధికారులు మాత్రం సత్వర కాల్పుల విరమణకు ఒత్తిడి తెస్తున్నారు. గాజాలోకి సహాయాన్ని భారీగా తరలించేందుకు ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నారు.

ట్రంప్–నెతన్యాహూలిద్దరూ భార్యా సమేతంగా ఉన్నతస్థాయి సహాయకులు, ఇతర ముఖ్యులతో ఎదురెదురుగా చెరోవరుసలో కూర్చుని రాత్రి విందు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక దూత విట్‌కాఫ్ ఇరాన్–పాలస్తీనా విషయాలను ప్రస్తావించారు. గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కూడా వచ్చేవారమే జరుగుతుందని విట్‌కాఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చేవారం ఇరాన్‌తో అణుఒప్పందంపై చర్చలు జరిగే అవకాశం ఉందని విట్‌కాఫ్ చెప్పారు. కానీ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మొన్న ఒక ఇంటర్వ్యూలో, ఇజ్రాయెల్–అమెరికా చేసిన అక్రమ యుద్ధం సృష్టించిన విధ్వంసం నుండి ఆ నష్టం నుండి తమదేశం ఇంకా తేరుకోలేదన్నారు. కాగా నిర్ణీత ప్రకారం నెతన్యాహూ అమెరికా కాంగ్రెస్ స్పీకర్ మైక్ జాన్సన్‌తో కూడా సమావేశమవుతారు.

**నోబెల్‌కు ట్రంప్‌పేరు నెతన్యాహూ సిఫార్సు**

అమెరికా కాలమానం ప్రకారం సోమవారంరాత్రి వైట్‌హౌస్‌లో విందు భోజన సమావేశం సందర్భంగా ప్రశంసలు హోరెత్తాయి. ఇరాన్‌పై 12 రోజులపాటు (జూన్ 13–24) యుద్ధం చేసిన నాయకులిద్దరూ విజయం సాధించినందుకు పరస్పరం ఒకరిపై మరొకరు ప్రశంసలు కురిపించుకున్నారు. ట్రంప్ పేరును నోబెల్ బహుమతి–2026 కి సిఫార్సు చేస్తున్నట్లు నెతన్యాహూ ప్రకటించారు. ఈ మేరకు నార్వేజియన్ నోబెల్ బహుమతి ఎంపికల కమిటీకి ఇజ్రాయెల్ ప్రభుత్వం రాసిన లేఖ ప్రతిని ఈ విందు కార్యక్రమంలో ట్రంప్‌కు ఆయన అందజేశారు. ట్రంప్ సతీమణి మెలానియా, నెతన్యాహూ సతీమణి సారా ఇద్దరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సకాలంలో యూరియా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సిఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్యభవన్‌లో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసిడిఐటి) ఆమోదించిన రూ.596 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర సదుపాయాల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం అభ్యర్థించారు.



హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందని, ఈ నేపథ్యంలో హైదరాబాద్‌బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరోడిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గోయల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్క్‌ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎ.పి.జితేందర్ రెడ్డి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భర్తను గొడ్డలితో చంపిన ఇద్దరు భార్యలు

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** తెలంగాణలో మరో ఘోరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇద్దరి భార్యల చేతిలో ఓ భర్త అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే, జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం ఏనబావి గ్రామ శివారు పిట్టలోనిగూడెంలో కాల్య కనకయ్య (30) నివాసం ఉంటున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. తరచూ తాగొచ్చి ఇద్దరి భార్యలతో గొడవ పడుతుండేవాడు. మే 18న సొంత అక్కను హత్య చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కనకయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, కనకయ్య అప్పుడప్పుడు గ్రామానికి వస్తూ, భార్యలను, గ్రామస్తులను బెదిరిస్తూ ఉండేవాడు. సోమవారం రాత్రి ఇంటికి చేరుకుని గొడ్డలి పట్టుకుని భార్యను బెదిరించాడు. అదే సమయంలో విసిగిపోయిన ఆ ఇద్దరు అదే గొడ్డలితో భర్తను హత్యచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుడమి గర్భం నుంచి నల్ల బంగారాన్ని వెలికితీసే

## శ్రమజీవుల యదార్థ జీవితాలే వెలుగుల వెనక

### వేల్పుల నారాయణ రచించిన కథాసంపుటి ఆవిష్కరణలో వక్తల ప్రశంస



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పుడమి గర్భం నుంచి నల్ల బంగారాన్ని వెలికితీసి సమాజంలో వెలుగు నింపుతున్న శ్రమజీవుల యదార్థ జీవితాలే ''వెలుగుల వెనక'' కథా సంపుటి అని పలువురు వక్తలు ప్రశంసించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ రచించిన వెలుగుల వెనుక కథాసంపుటి పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. అరసం అధ్యక్షులు పల్లేరు వీర స్వామి అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి సత్యనారాయణ వెలుగుల వెనుక కథా సంపుటిని ఆవిష్కరించగా, ప్రముఖ కథా రచయిత విమర్శకులు కె.పి.అశోక్ కుమార్ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేన శంకర్, ప్రముఖ రచయిత, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్. ఏటుకూరి ప్రసాద్, నవ చేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్,అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, సమన్వయకర్త కెవిఎల్, ప్రముఖ నవలా రచయిత కాలువ మల్లయ్య, తెలంగాణ బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు, పుస్తక రచయిత వేల్పుల నారాయణ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎస్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ నిమగ్నత, నిబద్ధత, నిబిడిత సంగమం ప్రముఖ రచయిత వేల్పుల నారాయణ రాసిన 'వెలుగుల వెనుక' అగ్రశ్రేణి కార్మిక సాహిత్య కథా సంపుటి అని అన్నారు. కేవలం తెలుగు సాహిత్యంలోనే కాదు. భారతీయ సాహిత్యంలోనే కొత్త చేర్పు ఈ పుస్తకమని, ఇది హిందీ, ఆంగ్లం భాషల్లోకి అనువాదం చెందితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని తెలిపారు. ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ పుస్తక రచయిత వేల్పుల నారాయణ వెనుక అభ్యుదయ రచయిత సంఘం ఉద్యమం ఉంది. ఆ ఉద్యమానికి భౌతిక వాదమనే పునాది ఉందని, ఆ పునాది మీదనే రచయిత శ్రమజీవుల జీవితాల కథకే అక్షర రూపం ఇచ్చారన్నారు. వేల్పుల కథల్లో చాల కథల్లో కార్మికుల వ్యక్తిగత, సమాజానికి జీవితాల్లో ఉంటే అతి సున్నితమైన భావాల్లో కూడ దోపిడీ ఎలా జరుగుతోందో కళ్లకు కట్టారన్నారు. కథకు ఉండాల్సిన క్లుప్తత, స్పష్టత, తాత్వికత, సుందరత, వాస్తవికత, అన్నింటికి మించి నిబిడిత అన్ని వేల్పుల కథల్లో ఉన్నాయని తెలిపారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడు తూ సింగరేణి కార్మికుల బతుకులకు ప్రతి రూప మే 'వెలుగుల వెనుక' కథా సంపుటి అని అన్నారు. ఎంతో మేధోశక్తి, లోతైన విశ్లేషణతో రచయిత సమాజాన్ని మేల్కొల్పే రీతిలో వేల్పుల చురకలు అనే కవిత్వాన్ని రాయడం అభినందనీయమన్నారు. కాలువ మల్లయ్య మాట్లాడుతూ కార్మికులపై అనేక కథలు వచ్చాయని, కాని వేల్పుల స్వీయ అనుభవాల ఆధారంగా రాసిన వెలుగుల వెనుక కథాల్లో చాల బలం ఉందని ప్రశంసించారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పుస్తక రచయిత నిరంత కృషీవలుడని, ఎప్పుడు ఏదో ఒకటి రాస్తునే ఉంటాడన్నారు. మధుకర్ మాట్లాడుతూ 'వెలుగుల వెనుక' అనే కథా సంపుటి సింగరేణి కార్మికు ల జీవితాలకు అక్షర రూపంలో వెలువడిన ఓ డ్యాక్యుమెంటరీ అని అన్నారు.

ఈ కార్యక్రమానికి అరసం సమన్వయ కర్త కెవిఎల్ స్వాగతం పలుకగా, అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో నవ చేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణరెడ్డి, పలువురు కవులు,

## ఎసిబికి చిక్కిన డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ సుధ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ ఎం.సుధ ఓ కంపెనీ జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జిఎస్‌టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు సుధ రూ.8వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. నాంపల్లిలోని తన కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.8000లు తీసుకుం టూ ఎసిబికి పట్టుబడిన సుధను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియ ల్ రిమాండ్ విధించారు. దీంతో ఆమెను చంచల్‌గూడలోని మహిళా జైలుకు తరలించారు.



## కృష్ణా–గోదావరి జలాలపై కెసిఆర్ చర్చకు రావాలి

కాళేశ్వరం కట్టి కనీసం పది ఎకరాలకు కూడా నీళ్ళు ఇవ్వలేదు

రైతుల సంక్షేమం కోసం రూ.70వేలకోట్లు ఖర్చు చేశాం

మహబూబాబాద్ సోమ్లతండ బహిరంగ సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పది సంవత్సరాల్లో లక్ష నుంచి రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టి పట్టుమని పది ఎకరాలకు కూడా నీళ్ళు ఇవ్వనివారు కాళేశ్వరం వాస్తవాలు బయటికి వస్తున్నాయని వాటిని కప్పిపుచ్చుకునేందుకు బిఆర్‌ఎస్ నేతలు అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన డిప్యూటి సిఎం సోమ్లతండాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాటాడుతూ తప్పుడు మాటలు బంద్ చేయాలని, గత పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చినా బిఆర్‌ఎస్‌కు బుద్ధి రావడంలేదని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభు త్వం ఇంటింటికీ చేరవేస్తుకుంటూ ముందుకు పోతుందని, టిఆర్‌ఎస్ నేతలు అనవసరంగా ఎక్కువగా ఊహించుకుని సిఎం రేవంత్‌రెడ్డిపై అవాకు లు చవాకులు పేల్చవద్దని డిప్యూటి సిఎం హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి గురించి ఏది పడితే అది మాట్లాడుతున్నారని, ఆయనకు బేసిన్‌ల గురించి తెలియదని బిఆర్‌ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఆయనకు బేసిన్ల గురించి తెలియకపోతే కృష్ణా, గోదావరి బేసిన్ల నీళ్ళను ఈ రాష్ట్ర అవసరాలకే వాడాలని ఇటీవల ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో అందరికీ వివరించిన విషయాన్ని డిప్యూటి సిఎం గుర్తు చేశారు. రాష్ట్రం ఏమైనా పర్వాలేదని కృష్ణా, గోదావరి జలాలు వాడుకోండని పెద్ద మనిషి కెసిఆర్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటన చేసినవిషయాన్ని వీడియాలతో సహా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్ లో చూపించారని తెలిపారు. కృష్ణా గోదావరికి బేసిన్ ప్రాజెక్టుల్లో నీళ్ళ గురించి లెక్కలతో సహా చర్చించడానికి సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో చర్చించడానికి సిద్ధంగా ఉందని, పెద్ద మనిషి కెసిఆర్ చర్చకు రావాలని సవాల్ విసురుతున్నామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. లక్ష కోట్ల పైబడి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఖర్చుపెట్టిందని సిఎం ప్రకటిస్తే వాస్తవాలను బిఆర్ ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదని, నిజంగా వారికి రాష్ట్ర ప్రజలపట్ల బాధ్యత, నిబద్దత ఉంటే శాసనసభకు రండి లెక్కలు తీసుకుని రండి చర్చిద్దాం, ఎవరిది నిజమో అన్ని సిఎం రేవంత్ రెడ్డి పెద్ద మనిషి కెసిఆర్‌కు సవాల్ విసిరితే కెసిఆర్ సవాల్ స్వీకరించకుండా ఇంకొక ఆయన బయలు దేరారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పింది వీరికి అర్థమవుతోందా అని భట్టి ఎద్దేవా చేశారు. ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ ఎంటే ఎట్లా? సిఎం సవాల్‌ను స్వీకరించాలనుకుంటే శాసనసభకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బిఆర్‌ఎస్ నాయకత్వం మొత్తానికి తాను సవాల్ విసురుతున్నట్లు డిప్యూటి సిఎం తెలిపారు. కరెంట్ కోతలు, ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతున్నాయని, నోరు ఉంది కదా అని బిఆర్‌ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో తలెత్తుకు బతకాలని అటవీ హక్కుల చట్టం క్రింద పంపిణీ చేసిన భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లమల డిక్లరేషన్ పేరుతో ప్రారంభించారని భట్టి తెలిపారు. పోడు రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింకర్లు, డ్రిప్ లు, అవకాడో, వెదురు వంటి మొక్కలు ఉచితంగా అందించేందుకు ప్రజాప్రభుత్వం రూ.12,600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిద్దేందుకు డ్వాక్రా మహిళలకు ప్రతిసంవత్సరం రూ.20వేల కోట్లు వడ్డీలేని రుణాలు అందించాల ని నిర్ణయించి మొదటి సంవత్సరం లో రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈనెల 12నుంచి 18వరకూ రాష్ట్రంలోని అన్నినియోజకవర్గాల్లో వడ్డీ లేని రుణా లు పెద్ద ఎత్తున పంపిణీ చేయబోతున్నట్లు, మహిళలందరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రజా ప్రభు త్వం కంకణం కట్టుకుందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. పేద విద్యార్థులకు విలువల తో కూడిన విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాలకు రూ.200కోట్లు కేటాయించి 25ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభ లో రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచంద్రునాయక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గిరిజన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నేరాల నివారణలో

## తెలంగాణ పోలీసుల పనితీరు భేష్

తెలంగాణ పోలీసు అధికారులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసుల పనితీరు తమకు అత్యంత సంతృప్తి నిచిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల ప్రతినిధుల బృందం అభిప్రాయపడింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో బుధవారం తెలంగాణ పోలీ సు ఉన్నతాధికారులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారు ల బృందం సమీక్షా సమావేశం నిర్వహించింది.

సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఇంత పెద్ద స్థాయిలో కేంద్రం సమీక్ష నిర్వహించడం ఇదే మొట్టమొదటిసారి. ఈ సమావేశం తెలంగాణలో భద్రతా పరిస్థితులపై సమీక్ష చేయడం, కేంద్రరాష్ట్ర సమన్వయాన్ని పెంపొందించడం, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త సాంకేతికతలతో నేరాల నివారణ కోసం కేంద్రం నుండి మద్దతు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు జెకెఎల్ ప్రశాంత్ లోఖండె సీతారాం, జాయింట్ సెక్రటరీ పౌశ్యమి బాసు, సిఐసి సెక్రటరీ నిరంజన్‌కుమార్ బన్‌సోద్, బిపిఆర్ అదనపు డిజి రవి జోసెఫ్ లోక్కు, ఎన్‌సిఆర్‌బి జాయింట్ డైరెక్టర్ సంజయ్ మాథూర్, ఎన్ఐసి డిజి శశికాంత్ శర్మ, ఐటి డిఎస్ రాజేంద్ర సింగ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజి మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, యాంటి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శ్యాండిల్యా, సిఐడి అదనపు డిజి చారు సిన్హా , ఫోరెన్సిక్ చీఫ్ శిఖాగోయల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య భద్రతా విషయంపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ లో నేరాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలను డిజిపి కేంద్ర అధికారులకు వివరించారు. ఫోరెన్సిక్, నార్కోటిక్స్, సైబర్, విభాగాల పని తీరు పై ప్రెజెంటేషన్ల ద్వారా డిజిపి జితేందర్ వివరించారు. గత 6 నెలల్లో జరిగిన ప్రధాన నేరాలపై సమీక్షించారు.

కమ్యూనల్ టెన్షన్, పొలిటికల్ వైరుధ్యం వల్ల ఏర్పడే సమస్యలు, భారీ సభలు, పబ్లిక్ మోమెంట్స్‌కి సంబంధించి భద్రతా ఏర్పాట్లు ఎలా ఉంటున్నాయన్నదిపై చర్చించారు. సైబర్ క్రైమ్, డిజిటల్ మానిటరింగ్, ఆన్‌లైన్ ఫ్రాడ్లు, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తిపై చర్యలు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఎఐ ఆధారిత సైబర్ ల్యాబ్‌ల అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. సైబర్ సెక్యూరిటీ స్క్వాడ్‌ల కోసం కేంద్ర మద్దతు ఇస్తుందని కేంద్ర అధికారులు హామీ ఇచ్చారు. తెలంగాణ డ్రగ్ స్మగ్లింగ్ హాట్‌స్పాట్‌గా మారుతు న్న పరిస్థితిపై చర్చ సాగింది. ఎన్‌డిపిఎస్ యాక్ట్ అమలులో లోపాలు, ఇంటెలిజెన్స్ సమన్వయం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇక డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి సత్వర స్పందన చర్యలు, జిల్లా స్థాయిలో ఫైర్ సిబ్బంది, వాహనాల అభివృద్ధిపై కేంద్రం సహకారంపై కూడా చర్చించారు. కేసుల పరిష్కార వేగం పెంచేందుకు డిఎన్‌ఎ ల్యాబ్‌లు, మోడరన్ టూల్స్ పెంచుకోవాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. జైళ్ల శాఖ అభివృద్ధి, ఓవర్ క్రౌడింగ్, సురక్షిత పర్యావరణం లేకపోవడం వంటి అంశాలు, కేంద్ర సహకారంతో ఆధునిక జైలు నిర్మాణాలపై చర్చించారు.



## ప్రభుత్వ వైద్య కళాశాలలకు తొలిసారి రెగ్యులర్ పరిపాలనాధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారులను నియమించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపల్స్‌గా, టీచింగ్ హాస్పిటల్స్‌కు సూపరింటెండెంట్స్‌గా నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీచేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చివరిదశకు వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఎడిఎంఇల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారికి కూడా ప్రభుత్వం త్వరలోనే పోస్టింగులను ఇవ్వనుంది.

పదోన్నతులు కల్పించడంతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడిల సమస్య తీరనున్నదని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించేందుకు ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది.

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డిఎంఇ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, పదోన్నతుల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులు కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

## జలపాతాలు, చెరువుల వద్ద 'వెడ్డింగ్ డెస్టినేషన్'

* మూడు ప్రాంతాలను గుర్తించిన పర్యాటక శాఖ
* త్వరలోనే కేంద్రానికి డిపిఆర్‌లు

(బి. వాసుదేవరాజు)



రాష్ట్రంలోని జలపాతాలు, డ్యామ్‌లు, చెరువుల పరిసర ప్రాంతాలు ఇక నుంచి వివాహ వేడుకలు, ఇతర శుభ కార్యక్రమాలకు వేదిక లు కానున్నాయి. జలపాతాలు, డ్యామ్‌లను, చెరువులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు దీటుగా 'వెడ్డింగ్ డెస్టినేషన్' విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ సన్నద్ధమవుతోంది. మధ్యతరగతి కుటుంబాలకు 'వెడ్డింగ్‌డెస్టినేషన్'ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పర్యాటక శాఖకు ఆదాయాన్ని సమకూర్చేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకు రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాలను గుర్తించింది. ఇందులో యాదగిరిగుట్టలోని బస్వాపూర్ చెరువు, కొల్లాపూర్‌లోని నార్లాపూర్, నాగార్జునసాగర్ డ్యామ్‌ను వెడ్డింగ్ డెస్టినేషన్‌లకు వేదికగా చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మూడు ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయాలి? వివాహ వేడుకలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా వీడియో, ఫోటోలు అందంగా వచ్చేలా ప్రదేశాల అలంకరణ, ఒక వేడుక నిర్వహించేందుకు పెద్ద, చిన్న హాల్స్, కొన్ని గదులు, సిట్టింగ్ ఏర్పాట్లు ఇలా వివాహానికి సంబంధించి అన్ని సదుపాయాలు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)ను రూపొందించినట్లు సమాచారం. డిపిఆర్‌ను ఖరారు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి పంపించి తద్వారా ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదంరాగానే పనులను చేపట్టేందుకు పర్యాటక శాఖ సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 'వెడ్డింగ్ డెస్టినేషన్' ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని పర్యాటక శాఖ భావిస్తుంది.

### 'వెడ్డింగ్ డెస్టినేషన్'కు ఆదరణ

ప్రస్తుతం వెడ్డింగ్ డెస్టినేషన్‌కు సుదూర ప్రాంతాలలో పర్యాటక ప్రాంతాలకు అత్యధిక ఆదరణ ఉన్నది. మధ్యతరగతి ప్రజలు కూడా వెడ్డింగ్ డెస్టినేషన్‌కు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తున్నారు. దీంతో వెడ్డింగ్ ఈవెంట్ ఆర్గనైజ ర్లు లక్షల్లో చార్జీలను వసూలు చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు పలు నగరాలకు దూరంగా కనీసం ఒక ఎకరం, అంతకంటే ఎక్కువగా ఉన్న భూములలో వివాహ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఒక స్విమ్మింగ్, వెడ్డింగ్ మినీ, పెద్ద హాల్స్, ఎసి గదులు, అందులో ఎల్ఇడి తెరలు, ఎల్ఇడిల ను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఫోటో లు తీసేందుకు వీలుగా పరిసరాలను అందంగా అలంకరించడం, గార్డెన్స్, ఫౌంటేన్స్, పిల్లలు ఆడుకునేందు కు వీలుగా సదుపాయాలను అందుబాటులో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వివిధ వెడ్డింగ్ ఈవెంట్ మేనేజర్లు వేడుకలకు హాజరయ్యే సభ్యుల సంఖ్య ఆధారంగా ప్యాకేజీలను డిజైన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'వెడ్డింగ్ డెస్టినేషన్' విధానాన్ని పర్యాటక శాఖ కూడా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు జలపాతాలను, చెరువులను, డ్యామ్‌లను 'డెస్టినేషన్ వెడ్డింగ్' గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది.

### 40 శాతం తక్కువ ధర: టిజిటిడిసి వల్లూరి క్రాంతి

పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వెడ్డింగ్ డెస్టినేషన్ ఒక మైలు రాయి. వెడ్డింగ్ డెస్టినేషన్ అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా ఫీజులు ఉంటాయి. ప్రైయివేట్ నిర్వాహకులు వసూలు చేసే ఫీజు ల కంటే టిజిటిడిసి ఆధ్వర్యంలో నిర్వహించే వెడ్డింగ్ డెస్టినేషన్ బుక్ చేసుకునే వినియోగదారులకు సుమార్ 40 శాతం ఫీజు తగ్గుతుంది.

వెడ్డింగ్ డెస్టినేషన్‌లో కార్యక్రమం నిర్వహించుకోటానికి మూడు రోజుల పూర్తి సమయం ఇస్తారు. కేంద్ర ప్రభుత్వం గనుక వెడ్డింగ్ డెస్టినేషన్‌కు పూర్తి నిధులు సమకూర్చకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రైయివేటు భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రత్నాయ ఏర్పాట్లపై కూడా కసరత్తు జరుగుతుంది.

## చేనేత పురస్కార గ్రహీతలకు మంత్రి తుమ్మల అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ చేనేత పురస్కారం–2024కి ఎంపికైన చేనేత కార్మికులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 19మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా, అందులో తెలంగాణ నుంచి ఇద్దరికి ఈ పురస్కారాలు దక్కడం గర్వకారణమన్నారు. యాదాద్రి–భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో రూ.8కోట్ల టర్నోవర్ చేయడానికిగాను, సహజ సిద్ధ రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తేలియా రుమాల్ డిజైన్‌తో పట్టుచీరను నేసిన గూడ పవన్‌కు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికై చేనేతరంగంలో ఆదర్శంగా నిలిచారని అభినందించారు..


**సర్టిఫికెట్లు పోయినవి**

నేను, **తమ్మిశెట్టి సులోచన,** D/o. **తమ్మిశెట్టి వెంకటయ్య,** R/o. ప్లాట్ నెం. 642, బి.ఎన్.రెడ్డి నగర్, చర్లపల్లి, మేడ్చల్ జిల్లా. నా యొక్క **ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ)** ఒరిజినల్ సర్టిఫికెట్లు నెం. 111430/A1, హెచ్‌సిఎల్ చౌరస్తా నుండి చర్లపల్లికి బస్సులో ప్రయాణం చేస్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిచో సెల్ నెం. **9182850224** ను సంప్రదించగలరు.

ఇట్లు
**తమ్మిశెట్టి సులోచన**
**తండ్రి తమిశెట్టి వెంకటయ్య,**
బిఎన్‌రెడ్డి నగర్, చర్లపల్లి.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.14, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.

RFQ. No. 08/EE/C14/GHMC/KZ/2025-26 ప్రకటన తేది: 07.07.2025

''జిహెచ్ఎంసి, సర్కిల్-14, 51-గోషామహల్ వార్డులోని మహారాణాప్రతాప్ కమ్యూనిటీ హాల్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ (G+1) నిర్మాణం కోసం సర్వే దర్యాప్తు కోసం కన్సల్టెన్సీ సర్వీసెస్ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక తయారీ (G+1 అంతస్తుల డిజైన్ నిర్మాణం)'' కోసం కొటేషన్ల కోసం అభ్యర్థన. **టెండర్ ప్రకటన / బిడ్ పిలుపు తేది:** 08.07.2025న మ.03.00గం.లకు, **బిడ్ దాఖలుకు గడువు తేది మరియు సమయం:** 11.07.2025న మ.03.00గం.ల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో (tender.telangana.gov.in), **ప్రీ క్వాలిఫికేషన్ ☐సాంకేతిక బిడ్ల ప్రారంభం:** 11.07.2025న మ.03.30గం.లకు, కాబట్టి అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న కాలంలో అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్లను సమర్పించవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-14, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 4732-PP/CL/ADVT/1/2025-26, Date: 08-07-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము**
మార్కెట్ రోడ్, కరీంనగర్ పట్టణము.

ప్రకటన తేది: 02.07.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దేవాదాయశాఖ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము, మార్కెట్ రోడ్, కరీంనగర్ పట్టణము యందు **తేది: 01-08-2025 నుండి 31-07-2028 వరకు** అనగా (3) సం॥రాల కాలంపాటు కళ్యాణ మండపము హాలు పొడవు 55 ఫీట్లు, వెడల్పు 40 ఫీట్లు వెడల్పు గల హాలు నెలసరి కిరాయి క్రింద కిరాయికి ఇచ్చుటకు గాను సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము **తేది: 10-07-2025 రోజున ఉదయం 11:00 గం॥లకు** సదరు ఆలయ కార్యాలయము నందు నిర్వహించబడును. ఇట్టి వేలములో పాల్గొనువారు **రూ. 200/-లు** చెల్లించి షెడ్యూలు టెండర్ ఫారం **ఖరీదు చేసి రూ. 1,00,000/- లు** ధరావత్తు చెల్లించవలెను. సీల్డు టెండర్ వేసిన వారు మాత్రమే పాటకు అర్హులు. వేలం పాటకు (3) రోజుల ముందు నుండి టెండర్ ఫారములు ఆలయ కార్యాలయము నందు విక్రయించబడును. వేలం పాట షరతులు ఇతర వివరములకు ఆలయ కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 4735-PP/CL/ADVT/1/2025-26, Date: 08-07-2025 సం/- కార్యనిర్వహణాధికారి

ప్రజాపక్షం
బుధవారం, 09 జులై

## వాణిజ్య చర్చలపై ఎందుకీ గోప్యత?

భారత్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అమెరికా వాణిజ్య శాఖాధికారులు ఢిల్లీ వచ్చి చర్చలు జరిపి వెళ్లారు. మన అధికారుల బృందం పక్షం రోజుల క్రితం వాషింగ్టన్ వెళ్ళింది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గతవారం అమెరికా వెళ్లి చర్చల్లో పాల్గొన్నారు. వాణిజ్య ఒప్పందాలపై ప్రపంచ దేశాలకు ట్రంప్ పెట్టిన గడువు మరో రోజులో ముగుస్తుండగా తాజాగా నెలాఖరు వరకు పొడిగించారు. ఒప్పందానికై చర్చలకు రాని ఓ డజను దేశాలకు ట్రంప్ నోటీసులు కూడా పంపుతున్నారు.

తమ దిగుమతులపై సుంకాల విధింపును ఏకపక్షంగా భారీగా పెంచుతూ, (రెసిప్రోకల్ టారిఫ్‌లు వాటి పేరు) మళ్లీ కొంత తగ్గిస్తూ, ఒప్పందాలకు గడువు ప్రకటిస్తూ, అప్పటివరకు పెంచిన సుంకాల అమలును నిలుపుదల చేస్తూ ట్రంప్ ఇతర దేశాలను బెదిరించి లొంగదీసుకునే నీచపు ఎత్తుగడలతో, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలకు విరుద్ధమైన వ్యవహార శైలితో అంతర్జాతీయ వాణిజ్యాన్ని అనిశ్చితిలో, గందరగోళంలో పడేశాడు. ఒకవైపు సుంకాల పెంపుదల, రెండోవైపున అక్రమ వలస దారులను వెనక్కు పంపడాన్ని ఆయుధాలుగా ఉపయోగించి ఏ కెనడా, మెక్సికోలను దాసోహం చేసుకోవాలనుకున్నాడో అది సాధ్యం కాలేదు. అవి ఎదురు తిరిగాయి. ముందుగా బ్రిటన్, ఆ తర్వాత యూరప్ దేశాలు ఒప్పందాలకు వచ్చాయి. కొరకరాని కొయ్యగా తయారైన చైనాపై భారీగా పెంచిన సుంకాలను గణనీయంగా తగ్గించి ట్రంప్ ఒప్పందం చేసుకున్నాడు.

అయితే అధ్యక్షుడు ట్రంప్‌ను తన మంచి మిత్రునిగా మన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకుంటున్నప్పటికీ, ట్రంప్‌ది మాత్రం ఎక్కడైనా బావేగాని వంగతోట వద్ద మాత్రం కాదనే వైఖరే. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా పెంచిన 25 శాతం సుంకాలు కొనసాగుతుండగా, ఇతర అనేక రంగాలతో పాటు ప్రధానంగా భారత వ్యవసాయ మార్కెట్‌ను కొల్లగొట్టేందుకు ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్లు అభిజ్ఞ వర్గాల భోగట్టా. జన్యు మార్పిడి పంటలకు భారత్ మార్కెట్‌ను తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు మన దేశం గట్టిగా ‘నో’ చెప్పిందట. వ్యవసాయ రంగంతో పాటు దానికి అనుబంధమైన పాడి ఉత్పత్తుల మార్కెట్‌లో స్థానాన్ని అమెరికా కోరుతున్నది. వీటిని అనుమతిస్తే గ్రామీణ భారతం అల్లకల్లోలమవుతుంది. వాణిజ్య ఒప్పందం దగ్గరలో ఉందని ట్రంప్ పదేపదే అంటున్నాడంటే భారత్ తలొగ్గిందా? ఏమో. ట్రంప్‌ని కాదనే ధైర్యం ఉండాలి కదా? చిత్రమేమంటే, ఏ సమాచారమైన అమెరికా వైపు నుంచే వస్తున్నది గాని మోదీ ప్రభుత్వం నోరు మెదపటం లేదు. ఏమిటీ గోప్యం, ఎందుకీ మౌనం?

మేము యునైటెడ్ కింగ్‌డంతో ఒప్పందం చేసుకున్నాం, చైనాతో ఒప్పందం చేసుకున్నాం, భారత్‌తో ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం అని ట్రంప్ వైట్‌హౌస్‌లో నిన్న మళ్లీ ప్రకటించాడు. ఆగస్టు 1 నుంచి హెచ్చు సుంకాలు విధించే దేశాల్లో బంగ్లాదేశ్, థాయిలాండ్, దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి. ఈలోపు వాణిజ్య ఒప్పందాలకు రాకపోతే నెత్తిమీద మొట్టికాయ వేస్తాడన్నమాట!

ఇదిలా ఉండగా, బ్రిక్స్ మీద తాజాగా విరుచుకుపడ్డాడు ట్రంప్. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నదని, దానితో చేరే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని ప్రకటించాడు. బ్రెజిల్, భారత్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాలు వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బ్రిక్స్‌లో మరో 10 దేశాలు చేరాయి. పేద దేశాల పక్షాన ప్రత్యామ్నాయ ఆర్థిక పురోగతికి అవి కృషి చేస్తున్నాయి. అమెరికాకు, డాలర్‌కు వ్యతిరేకమైన ఏ చర్యనూ సహించేటట్లు లేదు. కాబట్టి వర్తమాన ప్రపంచం అప్రమత్తం కావాలి. భారత్ ప్రభుత్వం కూడా రెండు పడవలపై కాళ్లు కాకుండా వర్ధమాన ప్రపంచం పట్ల దృఢమైన వైఖరి తీసుకోవాలి.

# జాతీయ ఎమర్జెన్సీ నేపథ్యం, పర్యవసానాలు



ఎస్.బాబు
(టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు)

భారత దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్ళు అని మీడియాలో కథనాలు, బిజెపి పార్టీ ఎమర్జెన్సీపై విమర్శలు చూసిన తరువాత నేను కొంతమంది కాలేజీ స్టూడెంట్స్, ఉద్యోగులు, మిత్రులు మరియు సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్స్‌తో ఇంటరాక్ట్ అయి 1975లో జాతీయ ఎమర్జెన్సీ ఎందుకు విధించారని అడిగితే చాలామంది వద్ద సమాధానం లేదు. కాని ఎమర్జెన్సీలో ఏం జరిగిందనే విషయాలు సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్స్ మాత్రమే చెప్పగలిగారు. అందుకే ఈ ఆర్టికల్ వ్రాయాలని అనిపించింది. అంత మాత్రం చేత నేనేం కాంగ్రెస్ అభిమానిని కాను. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ఉపయోగించి దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ ఏ పరిస్థితిలో విధిస్తారు అంటే 1.యుద్ధం 2.బాహ్య తిరుగుబాటు 3.అంతర్గత తిరుగుబాటు. ఈ కారణాల వల్ల జాతీయ ఎమర్జెన్సీ విధిస్తారు. 1962లో చైనాతో యుద్ధం కారణంగా దేశంలో మొట్టమొదటిసారి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎమర్జెన్సీ 26 అక్టోబర్ 1962లో విధించి 10 జనవరి 1968 వరకు కొనసాగిన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. పాకిస్తాన్‌తో బాహ్య తిరుగుబాటు కారణంగా 1971లో జరిగిన యుద్ధం వలన ఆనాటి రాష్ట్రపతి వి.వి.గిరి దేశంలో రెండో ఎమర్జెన్సీ విధించారు. కాని ఈ రెండు ఎమర్జెన్సీల ప్రభావం ఆనాడు ప్రజల మీద పడలేదు. మూడవసారి ఎమర్జెన్సీ 25 జూన్ 1975న దేశంలో అంతర్గత తిరుగుబాటు కారణంగా ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఇచ్చిన లేఖతో నాటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ దేశంలో ఎమర్జెన్సీ విధించారు. ఆ మచ్చ నేటికీ కాంగ్రెస్ పార్టీని వెంటాడుతూనే ఉంది. ఈ ఎమర్జెన్సీ గురించి కూడా దేశంలో మూడొంతుల మందికి తెలియదు. అసలు ఎమర్జెన్సీ విధించటానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటో సూక్ష్మంగా చూద్దాం.

1962, 1965లో చైనా మరియు పాకిస్తాన్‌తో యుద్ధాలు జరిగిన తరువాత భారతదేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిం ది. అందువలన ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టాలనే ఉద్దేశం మరియు రైతులకు వ్యవసాయ లోన్లు కల్పించాలనే సంకల్పంతో ప్రధాని ఇందిరా గాంధి 1969లో బ్యాంకుల జాతీయాకరణకి శ్రీకారం చుట్టి ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ ఆర్డినెన్స్‌ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అందువలన 1969 బ్యాంకుల జాతీయీకరణ చట్టాన్ని చేసి అమలు చేశారు. టాటా, బిర్లాల డబ్బంతా ప్రైవేట్ బ్యాంకులలో ఉండటం వలన ఆ బ్యాంకులని జాతీయం చేయడంతో వారు ఇందిరా గాంధీని వ్యతిరేకించారు. ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ కూడా బ్యాంకుల జాతీయీకరణను వ్యతిరేకించారు. అందువలన ఆ ఆర్థిక శాఖను ఇందిరా గాంధీ తీసుకోవడంతో మొరార్జీ దేశాయ్ ఆ పదవికి రాజీనామా చేసి ఒక సిండికేటును ఏర్పాటు చేసుకున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి పురుడు పోసుకుంది.

భారతదేశ స్వతంత్రానంతరం 550 స్వదేశీ సంస్థానాలు యూనియన్‌లో విలీనం అయ్యాయి. ఈ విలీనం సందర్భంగా ఆ సంస్థాలకు చెందిన రాజవంశాల వారికి ప్రభుత్వం ప్రతినెల కొంత మొత్తాలలో రాజభరణం అందించేది. అటువంటి రాజభరణాలను 26వ రాజ్యాంగ సవరణ ద్వారా శ్రీమతి ఇందిరాగాంధీ 1970లో రద్దు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ రాజభరణాల రద్దును కూడా సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఈ కారణంగా ఆ సంస్థానాధీశులు ఇందిరాగాంధీపై గుర్రుగా ఉండేవారు. ఒకప్రక్కన పారిశ్రామికవేత్తలు, మరోపక్కన సంస్థానాధీశులు, ఇంకోప్రక్కన పార్టీలో అసమ్మతి, జ్యుడిషియరీ చీకటి బోనులో సింహం లాగా ఆమెను కబళించటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సమయంలో 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగి బంగ్లాదేశ్ అనే కొత్త దేశం ఏర్పడింది. ఈ యుద్ధం అనంతరం ఆర్థిక వ్యవస్థపై బాగా ఒత్తిడి పెరిగింది. అంతర్గతంగా విద్యార్థులు, కార్మికులు, ప్రతిపక్ష నాయకులు సమస్యలపై పోరుబాట పట్టారు. రాజకీయ నాయకుల మాటల ఖజానా నుంచి ఆమెపై విమర్శనాస్త్రాలు క్షిపణుల్లా దూసుకొచ్చాయి. జార్జి ఫెర్నాండెజ్ కార్మిక శ్రేణుల ప్రళయ ఘోషను వినిపిస్తూ వచ్చా రు. ఆమెను సమస్యల సుడిగుండంలో నెట్టి ప్రత్యర్థులు అష్ట దిగ్బంధనం చేశారు. రాజకీయ సంక్షోభంతో పాటు అంతర్గత తిరుగుబాటుల కారణంగా ఆమెపై వ్యతిరేకత అగ్నికెరటాలై ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ తిరుగుబాటు కెరటాలు సునామీలా చుట్టుముట్టాయి. స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్మా గాంధీ సమకాలీనులు అయిన జయప్రకాష్ నారాయణ్ ప్రజల సమస్యలను ‘సంపూర్ణ విప్లవం’ పేరుతో బీహార్‌లో ఉద్యమం తీవ్రతరం చేశారు. మరోపక్క గుజరాత్ రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులు మెస్ ఛార్జీలు పెంచాలని ఉద్యమించారు. మామూలుగా సాగుతున్న ఈ పోరాటం జయప్రకాష్ నారాయణ్ జోక్యంతో తీవ్రరూపం దాల్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కేంద్రం గుజరాత్, బిహార్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. మరోపక్క కార్మిక నాయకులు జార్జి ఫెర్నాండెజ్ కార్మిక ఉద్యమాలను తారాస్థాయికి తీసుకెళ్ళారు. జయప్రకాష్ నారాయణ్ సంపూర్ణ విప్లవం పేరిట ‘‘పార్లమెంట్‌కు జనతా మార్చ్’’ పిలుపుతో కాంగ్రె స్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. ఆయనిచ్చిన పిలుపు కారణంగా ఇందిరాగాంధీ ఉక్కిరిబిక్కిరి అయిం ది. ఈ సమయంలోనే రైల్వే మంత్రి లలిత్ నారాయణ్ మిశ్రా బాంబు దాడిలో హత్య చేయబడడంతో శాంతి భద్రతల సమస్య ఏర్పడింది. గుజరాత్‌లో విద్యార్థుల ఉద్యమం తరువాత 1974లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాకపోవడంతో ఆమె తీవ్రమైన మనస్తాపానికి గురైంది.

దేశ పరిస్థితులు ఇలా ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నియోజకవర్గంలో తన ప్రత్యర్థి అయిన రాజ్ నారాయణ్ ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ 14 ఎలిగేషన్స్‌తో అలహాబాద్ హైకోర్టులో కేస్ వేశారు. ఆ కేసులో 12 ఎలిగేషన్స్‌ను కొట్టివేస్తూ కేవలం 2 ఎలిగేషన్స్ 1.ప్రభుత్వ అధికారి అయిన యశ్‌పాల్ కపూర్ ఉద్యోగానికి రాజీనామా చేసినా అది ఆమోదింపబడకముందే ఆయన ఇందిరాగాంధీ తరఫున ఎన్నికల్లో పాల్గొనడం. 2.ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ వేదికపై ప్రసంగించిన సందర్భంగా ఆ వేదికకు అయిన ఖర్చు మరియు విద్యుత్తు ఛార్జీలు ఉత్తర్‌ప్రదేశ్ గవర్నమెంట్ చెల్లించడంపై తీర్పునిస్తూ ఆమె ఎన్నిక చెల్లదని, 6 సంవత్సరాల పాటు ఎన్నికలలో పాల్గొనకూడదని తీర్పునిచ్చింది. దీనిపై ఇందిరాగాంధీ సుప్రీంకోర్టులో రిట్ అప్పీల్ వేశారు. ఈ రిట్ అప్పీల్ స్వీకరించిన సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టిచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూనే ఆమె ప్రధానమంత్రిగా కొనసాగవచ్చునని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పు రాగానే ఇందిరాగాంధీ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్‌తో పాటు మితవాద ప్రతిపక్ష నాయకులందరూ పట్టు పట్టారు. ఇప్పటినుండి ఇందిరాగాంధీని బయటకు లాగుదాం. రాజీనామా చేసేంతవరకు ఇంటినుండి ఆమెని బయటికి రానివ్వం. గృహనిర్బంధం చేస్తాం. సుప్రీంకోర్టిచ్చిన తీర్పును లెక్క చెయ్యం. ఆమె రాజీనామా చేయాల్సిందే అని జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, జార్జి ఫెర్నాండెజ్, రామ్ నారాయణ్‌తో పాటు జనసంఘ్ పార్టీ కలిసి ఆమెను కార్నర్ చేశారు.

సమస్యలన్నీ చుట్టుముట్టడంతో 25–06–1975న రాష్ట్రపతికి నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆమె లేఖ వ్రాశారు. ఆ ప్రకారంగా రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ 25 జూన్ అర్ధరాత్రి నుండి నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. దాంతో దేశంలో 21 నెలల పాటు రాష్ట్రపతి పాలన అనంతరం ఇందిరా గాంధీయే ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఏకపార్టీ పాలనకు తెర పడిం ది. కాంగ్రెస్ పార్టీకి 154 స్థానాలు కాంగ్రెస్(ఐ) స్వతంత్ర పార్టీ సోషలిస్టు పార్టీ, జన సంఘ్‌లతో ఏర్పడిన జనతా పార్టీకి 295 స్థానా లు వచ్చాయి. కొత్తతరం నాయకులతో జనతాపార్టీ నుండి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా పదవి చేపట్టారు. ఉత్తర భారత దేశంలో ఎమర్జెన్సీ అత్యాచారాల కారణంగా కాంగ్రెస్ పార్టీ కి వీచిన వ్యతిరేక పవనాలు దక్షిణ భారత దేశంలో లేవు. అంటే ఆ చీకటి రాత్రులు ఇక్కడ లేవా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 ఎంపి స్థానాలకు 41 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఎమ ర్జెన్సీ ప్రభావం ఏమైనట్లు? జనతా పార్టీ ప్రభుత్వం అంతర్గత వైరుధ్యాలతో రెండేళ్లలో కూలిపోయింది.


1980లో మధ్యంతర ఎన్నికల్లో దేశ ప్రజలు ఇందిరాగాంధీకి మళ్లీ పట్టం కట్టారు. దేశంలో ఎమర్జెన్సీని ఓ బ్లాక్ డేగా ప్రస్తుతం బిజెపి వారు చూపుతున్నా, ఆనాడు కాం గ్రెస్‌కు 34.5 శాతం ఓట్లు వచ్చాయి. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీకి 36.6 శాతం ఓట్లు వచ్చాయి. ఆ విధం గా చూస్తే బిజెపిది కూడా చీకటి పాలనే అనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకేనేమో దేశంలో ప్రస్తుతం బిజెపి పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది అని అంటున్నారు. ఎందుకంటే ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితులకు, దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులకు పెద్ద తేడా ఏమీ లేదు.



# ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం

భారతదేశ ఆర్థిక ప్రయాణం వేగంగా విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతున్నది, ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్నవీ నిశ్చయమే. కానీ ఈ అభివృద్ధి కథనాన్ని నిలబెట్టే ఒక ప్రధాన ప్రశ్న ఇంకా ఎదురుగానే ఉంది. దేశంలో ఉద్యోగాలు ఎక్కడ? మరియు అవి ఎంత స్థిరమైనవి? కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం ఈ ప్రశ్నకు సమాధానంగా కొత్త మార్గాన్ని సూచిస్తుంది. జూలై 1, 2025న కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఈ పథకం, ఆగస్టు 1, 2025 నుంచి ప్రారంభమవుతుంది.
ఈ పథకం ప్రధానంగా రెండు సంవత్సరాల్లోగా 3.5 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మొత్తం ఖర్చు రూ.99,446 కోట్లు. గతంలో ఉన్న ఉపాధి పథకాల వలె కేవలం జీతాల సహాయానికి మాత్రమే కాకుండా, దీని గమ్యం దీర్ఘకాలిక ఉపాధిని కల్పించడం, ఉద్యోగాల అధికారీకరణను ప్రోత్సహించడం, ఉద్యోగులతో పాటు సంస్థలకూ ప్రత్యక్ష ప్రయోజనాలు కల్పించడం. ఉద్యోగాల కల్పన మాత్రమే కాదు, ఈపీఎఫ్ఓ సంస్థలతో అనుసంధానించడంవల్ల ఈ ఉద్యోగాలకు సామాజిక భద్రతా పదును కూడా ఏర్పడుతుంది.

ఈ పథకం రెండు భాగాలుగా నిర్మితమైంది. మొదటిది భాగం ఎ–మొట్టమొదటి ఉద్యోగాన్ని సంపాదించే యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగిస్తుంది. నెలకు ఒక లక్ష రూపాయల లోపు జీతం పొందే వారు అర్హులు. ఆరు నెలల నిరంతర సేవ చేసిన తర్వాత ఒక నెల ఈపీఎఫ్ జీతానికి సమానంగా (గరిష్ఠంగా రూ. 15,000) ప్రోత్సాహకంగా డబ్బు వారి ఖాతాలోకి వస్తుంది. ఏడాది పూర్తి చేసాక మరో విడత డబ్బు అందుతుంది. అయితే అది ఆర్థిక విజ్ఞాన శిక్షణ పూర్తి చేసిన తరువాత మాత్రమే. ప్రోత్సాహకం నేరుగా వ్యక్తుల పాన్ ఆధారిత ఖాతాలోకి డీబీటీ ద్వారా జమ అవుతుంది. ఈ విధంగా, పొదుపు అలవాటు, ఆర్థిక స్థిరత్వం రెండింటినీ పెంపొందించే యత్నం ఇది.



భాగం బి ద్వారా సంస్థలకు ప్రోత్సాహక భత్యం అందుతుంది. 50 మందికి లోపు సిబ్బంది ఉన్న సంస్థలు కనీసం ఇద్దరిని, 50 మందికి మించిన సంస్థలు కనీసం ఐదుగురిని కొత్తగా నియమించాలి. ఈ నియామకాలు స్థిరంగా కనీసం ఆరు నెలలపాటు కొనసాగాలి. వారి జీత స్థాయిని బట్టి నెలకు సంస్థలు ఈ క్రింద పేర్కొన్న విధంగా ప్రోత్సాహాన్ని పొందగలవు జీతం రూ.10,000లోపు అయితే రూ.1,000; జీతం రూ.10,000 నుంచి 20,000 మధ్య అయితే రూ.2,000; జీతం రూ.20,000 నుంచి 1 లక్ష రూపాయల వరకు అయితే రూ.3,000. ఈ సహాయం సాధారణంగా రెండు సంవత్సరాలపాటు అందుతుంది. కానీ తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యంతో ఇది మూడవ, నాలుగవ సంవత్సరాల వరకు పొడిగించబడుతుంది.
తయారీ రంగానికి ఈ ప్రత్యేక దృష్టి అనేది ఊహాజనిత నిర్ణయం కాదు. ఇది భారతదేశ ఆర్థిక స్వావలంబనకు కీలకంగా భావించే రంగం. దీని ద్వారా స్థిర ఉద్యోగాలు, నైపుణ్యాల పెరుగుదల, ఉత్పాదకత మెరుగవుతాయి. అందుకే నాలుగు సంవత్సరాల ప్రోత్సాహం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు సరైన విధానం. ఈ పథకం ద్వారా తయారీ రంగం ద్వారా సుమారు 2.6 కోట్ల ఉద్యోగాలు, అలాగే 1.92 కోట్ల మొట్టమొదటి ఉద్యోగులకూ ప్రత్యక్ష ప్రయోజనం అందే అవకాశం ఉంది. మొత్తం 3.5 కోట్ల ఉద్యోగాల లక్ష్యం అందుబాటులో ఉందనిపించడంలో ఆశాభావం ఉంది. ఇప్పటి వరకు అమలైన పథకాలతో పోలిస్తే, ఈ పథకం వేరియే. ఉదాహరణకు, కరోనా సమయంలో అమలులో ఉన్న ‘ఆత్మనిర్భర్ భారత్ రోజ్గార్ యోజన’ తాత్కాలిక సహాయం మాత్రమే. ఈ పథకం మాత్రం సంక్షేమాన్ని దాటి దీర్ఘకాలిక భద్రతను లక్ష్యంగా పెట్టుకున్నది. ఆర్థిక విజ్ఞానం, డీబీటీ ఆధారిత పారదర్శక వ్యవస్థ, తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు దీన్ని కొత్త తరహాలో నిలబెడుతున్నాయి. అయితే, ఈ పథకాన్ని విజయవంతం చేయాలంటే అమలు కీలకం. సంస్థ లు నిజంగా కొత్త ఉద్యోగులను నియమించగలవా? ఉద్యోగులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుంటారా? కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో పర్యవేక్షణ, గణాంకాల సేకరణ, మూల్యాంకన విధానాలు సమర్థవంతంగా అమలవుతాయా? ముఖ్యంగా చిన్న పట్టణాల్లో తక్కువ సాంకేతిక వనరులు ఉన్న చోట్లనైనా డీబీటీ ఆలస్యాలు లేకుండా అమలు చేయగలమా అన్నదే అసలైన పరీక్ష.

ప్రభుత్వం ఒక శక్తివంతమైన ఐటీ మౌలిక వ్యవస్థను, జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమాలను, సేవా మద్దతు కేంద్రాలను, పబ్లిక్ డాష్‌బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక విజ్ఞాన శిక్షణను అందుబాటులో ఉండే భాషలలో అందించకపోతే అది అవరోధంగా మారే ప్రమాదమూ ఉంది. పథకం భారత యువత ముఖ్యంగా కొత్తగా ఉద్యోగం ప్రారంభించే వారికి ఒక నూతన మార్గాన్ని తెరుస్తోంది. ఉపాధి అనేది కేవలం జీవనాధారం కాదు. అది గౌరవానికీ భద్రతకూ మార్గం. సంక్షేమం గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రతి ఇంట్లో పరిమళించాలన్న లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, భారతదేశంలో ఉద్యోగాల రంగంలో ఒక నూతన అధ్యాయాన్ని తెరిచే అవకాశం ఉంది.

– జనక మోహన రావు దుంగ
8247045230

## ప్రైవేటు రంగ పరిశోధనలకు అధిక నిధులు ప్రమాదకరం

కేంద్ర క్యాబినెట్ సమావేశం గతవారం 1 లక్ష కోట్ల రూపాయలను ప్రైవేటు రంగంలో శాస్త్ర పరిశోధనల అభివృద్ధికి కేటాయించింది. దేశ అభివృద్ధికి, రక్షణకు, స్వావలంబనకు కీలకమైన కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్స్, వ్యాక్సిన్లు, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో శాస్త్రీయ పరిశోధనలకు ప్రైవేట్ రంగానికి ప్రాముఖ్యతనివ్వటం జరిగింది. అదే సమయంలో గత బడ్జెట్లో కేవలం 20 వేల కోట్ల రూపాయలను (అంటే జిడిపిలో 1.2 శాతం మాత్రమే) సిఎస్ఐఆర్, ఐసిఎఆర్, ఐఐటిలకు కేటాయించి, ప్రభుత్వ రంగ పరిశోధనలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నది. అయినా అంతరిక్ష పరిశోధనలు, ఆహారం స్వయం సమృద్ధి, ఉక్కు పరిశ్రమల అభివృద్ధికి, ఔషధ రంగ అభివృద్ధికి, వ్యాక్సిన్ల అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశోధనలు ఎనలేని కృషి చేసి దేశ స్వావలంబనకు అభివృద్ధికి కృషి చేశాయి. కాగా ప్రైవేటు రంగం వారు దేశంలో శాస్త్ర పరిశోధనల అభివృద్ధికి కృషి చేయలేదు, మొత్తంగా పశ్చిమ దేశాల నుండి మాత్రమే టెక్నాలజీని దిగుమతి చేసుకొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ సమగ్రాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ పరిశోధనలను ప్రోత్సహించకపోగా ప్రైవేటురంగ పరిశోధనలకు ఇంత అధిక మొత్తంలో నిధులు కేటాయించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. కీలకమైన రంగాల్లోని పరిశోధనలను ప్రైవేటు రంగానికి కేటాయించడం దేశ అభివృద్ధికి, స్వావలంబనకు ప్రమాదకరం. ఈ చర్య ప్రభుత్వ రంగ పరిశోధక సంస్థలను మొత్తంగా నిర్వీర్యం చేసి ప్రైవేటు రంగానికి కట్టబెట్టే దిశగా భావించాలి. ఉదారవాదం ఆర్థిక విధానాల్లో భాగమైన ఈ చర్యను శాస్త్రజ్ఞులు, ప్రజాబాహుళ్యం వ్యతిరేకించాలని కోరుతున్నాను.

– డాక్టర్.సోమ మర్ల
విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త ఐసిఎఆర్, న్యూఢిల్లీ

### పదోన్నతుల తర్వాతే డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్

# ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి


లేఖ

తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ త్వరలో డైట్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులకు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఆధ్వర్యంలో ముప్పై శాతం పోస్టులను భర్తీ చేసి డెబ్బై శాతం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో గత ఇరవై, ఇరవై ఐదు, ముప్ఫై సంవత్సరాల నుండి డిగ్రీలు, పి.జిలు, పిహెచ్‌డిలు, బి.ఎడ్ఎం. ఇడి, స్లెట్, నెట్ అర్హతలు కలిగి డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పదోన్నతుల కోసం అన్ని అర్హతలు కలిగి ఉన్న గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి పదోన్నతులు ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని పాత పది జిల్లాలలో ఉన్న డైట్, బి.ఎడ్ తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఈఆర్‌టి), ఐసిఎస్‌ఈలలో ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ సర్వీస్‌ను కామన్ సర్వీస్‌గా పరిగణించాలని 2005 నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ, రాష్ట్రపతి ఉత్తర్వులను చాలెంజ్ చేస్తూ కాలయాపన చేస్తూ ఇరవై సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు ఎలాంటి పదోన్నతులు లేకుండా పదవీవిరమణ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవిని తానే స్వయంగా పర్యవేక్షించడంతో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొని రావడానికి ఉద్యోగ పోస్టులను భర్తీ చేయడం, ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం, మూతపడిన పాఠశాలలను తెరిపించడం, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేయడం విద్యాశాఖ కమిషన్ ఏర్పాటు చేయడం విద్యాశాఖ పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులలో డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పదోన్నతులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్తగా త్వరలో డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు జూనియర్ అవుతారని ముందు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన తర్వాతనే కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భాషోపాధ్యాయులకు, పిఇటిలకు మూడు దశాబ్దాలుగా పదోన్నతులు లేక ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకొని శ్రమ దోపిడీకి, వెట్టిచాకిరికి గురయ్యేవారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోని భాషలు (తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలు) బోధించే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా? అనే సామెతగా తెలంగాణ రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ తయారు కావడం సులభమేని సర్వీస్ రూల్స్‌తో ముడిపెడుతూ గత రెండు, మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా విద్యా సంవత్సరం పూర్తి కావడం ఆందోళన కరమైన విషయంగా చెప్తున్నారు.

– డాక్టర్.ఎస్.విజయ భాస్కర్
9290826988


# యాంటీ ప్రోటాన్ ఆవిష్కర్త

యాంటీ ప్రోటాన్ అనేది ప్రోటాన్ యొక్క యాంటీపార్టికల్. యాంటీప్రోటాన్‌లు స్థిరంగా ఉంటాయి, కానీ అవి సాధారణంగా స్వల్పకాలికంగా ఉంటాయి, ఎందుకంటే ప్రోటాన్‌తో ఏదైనా ఢీకొనడం వల్ల రెండు కణాలను శక్తి విస్ఫోటనంలో నాశనం చేస్తుంది. దీనిని ఓవెన్ చాంబర్ లైన్ ఆవిష్కరణ చేశారు. ఆయన 10 జూలై 1920న జన్మించారు. ఆయన అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. అతను సబ్‌అటామిక్ యాంటీపార్టికల్ యాంటీప్రోటాన్‌ను కనుగొన్నందుకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని ఎమిలియో సెగ్రేతో కలిసి పంచుకున్నారు. చాంబర్‌లైన్ 1942లో మాన్‌హట్టన్ ప్రాజెక్ట్‌లో చేరాడు. అక్కడ ఆయన సెగ్రేతో కలిసి పనిచేశాడు. 1946లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత చాంబర్‌లైన్ చికాగో విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రవేత్త ఎన్రికో ఫెర్మీ ఆధ్వర్యంలో తన డాక్టొరల్ అధ్యయనాలను చేపట్టాడు. ఫెర్మీ ఛాంబర్‌లైన్‌కు ముఖ్యమైన మార్గదర్శిగా మరియు సలహాదారుగా వ్యవహరించాడు. ఫెర్మీ ప్రయోగాత్మక భౌతిక శాస్త్రం కోసం సైద్ధాంతిక భౌతిక శాస్త్రాన్ని విడిచిపెట్టమని అతనిని ప్రోత్సహించారు. ఛాంబర్‌లైన్ తన పిహెచ్‌డిని 1949లో చికాగో విశ్వవిద్యాలయం నుండి పొందారు. 1948లో ఆయన సెగ్రే, ఇతర భౌతిక శాస్త్రవేత్తలు ప్రోటాన్ పరిక్షేపణ (స్కాటరింగ్)ను పరిశోధించారు. 1955లో శక్తివంతమైన పార్టికల్ యాక్సిలరేటర్ బెవట్రాన్ సహాయంతో చాంబర్‌లైన్, సెగ్రేలు చేసిన ప్రోటాన్ పరిక్షేపణ ప్రయోగాల శ్రేణి యాంటీప్రోటాన్‌ను కనుగొనటానికి దారితీసింది. ఇది ప్రోటాన్ వంటి ఒక కణమే కానీ దాని వ్యతిరేక కణం. ఇది దాని చార్జ్‌కు సమానమైన వ్యతిరేక ఛార్జ్(నెగెటివ్) కలిగి ఉంటుంది. వీరి పరిశోధన మరిన్ని యాంటీ పార్టికల్స్ ఆవిష్కరణకు దారి తీసింది. తరువాత సంవత్సరాలలో చాంబర్‌లైన్ తన సహచరులతో హైడ్రోజన్, ద్యుటీరియం, ఇతర మూలకాలతో యాంటీప్రోటాన్ల సంఘర్షణను అధ్యయనం చేశారు. యాంటీన్యూట్రాన్‌లను ఉత్పత్తి చేయడానికి యాంటీప్రోటాన్‌లను ఉపయోగించారు. చాంబర్‌లైన్ 1980లలో న్యూక్లియర్ ఫ్రీజ్ ఉద్యమం స్థాపనకు సహాయం చేశారు. 2003లో హ్యూమనిస్ట్ మ్యానిఫెస్టోపై సంతకం చేసిన 22 మంది నోబెల్ గ్రహీతలలో ఆయన ఒకరు.ఆయన 2006 ఫిబ్రవరి 28న తుదిశ్వాస విడిచారు. యాంటీప్రోటాన్‌లు కొన్ని క్యాన్సర్‌లకు చికిత్స చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రయోగశాల ప్రయోగాలలో నిరూపించారు.



(జులై 10 నోబెల్ గ్రహీత ఓవెన్ చాంబర్‌లైన్ జయంతి)

– యం.రాంప్రదీప్, జెవివి సభ్యులు,
తిరువూరు, 9492712836



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉక్రేన్‌కు అమెరికా ఆయుధాలు : ట్రంప్

**వాషింగ్టన్ :** ఉక్రేన్‌కు మరిన్ని ఆయుధాలను తప్పనిసరిగా పంపుతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌కు కీలక ఆయుధాల సరఫరాను ఆపేయాలని కొద్ది రోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల తర్వాత మంగళవారంనాడు ట్రంప్ పైవిధంగా స్పందించారు. పెంటగాన్ రక్షణ వ్యవస్థ గతవారం చేసిన ప్రకటన తర్వాత ట్రంప్ వైఖరిలో ఆకస్మిక మార్పు వచ్చింది. ఉక్రేన్‌కు పంపించే కొన్ని గగనతల రక్షణ క్షిపణులు, లక్ష్యాలను గురిచూసి దెబ్బతీయగల గైడెడ్ ఆర్టిల్లరీ ఆయుధాలు, ఇతర ఆయుధాలను పంపకుండా ఆపేస్తున్నామనీ, ఎందుకంటే చాలా ఎక్కువ నిల్వలను ఉంచడంపట్ల అమెరికా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆ దేశ రక్షణ శాఖ ప్రకటించింది. ఆ తర్వాతే ట్రంప్ పైవిధంగా తాజా ప్రకటన చేశారు. ‘‘తమంతట తాముగా వారిని వారు రక్షించుకోవాలి, వారు ఇప్పుడు చాలా పెద్ద దాడులకు గురవుతున్నారు, అందువల్ల మేం కొన్ని ఆయుధాలు పంపుతున్నాం, ప్రధానంగా వారిని రక్షించుకోవడానికి ఉద్దేశించిన ఆయుధాలు పంపుతున్నాం’’ అని ట్రంప్ చెప్పారు. రష్యా వైపు నుండి చాలా ఉద్ధృతస్థాయిలో దాడులు పెరిగిపోయిన తరుణంలో అమెరికా నుండి ఆయుధాల సరఫరా ఆగిపోయింది.

# అంబేద్కర్ ఆశించింది ‘అధికార’ జోక్యం లేని న్యాయవ్యవస్థనే

### మహారాష్ట్ర చట్టసభల అభినందనసభలో సిజెఐ గవాయ్



**ముంబయి :** ‘అధికార’ జోక్యంలేని న్యాయవ్యవస్థనే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కోరుకున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. ‘భారత రాజ్యాంగం’ అనే అంశంపై ముంబయిలో మంగళవారంనాడు చేసిన ప్రసంగంలో గవాయ్ ఈ విషయం చెప్పారు. భారతదేశ అత్యున్నత నాయ్యమూర్తి పదవిస్థాయికి చేరుకున్న గవాయ్‌ను మహారాష్ట్ర శాసనవ్యవస్థ ఘనంగా సత్కరించింది. మహారాష్ట్ర ఉభయసభలూ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ ఒక ఏకగ్రీవ తీర్మానం చేసిన తర్వాత ఉభయసభల సభ్యులనూ ఉద్దేశించి మాట్లాడుతూ, న్యాయవ్యవస్థలో కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం ఉండకూడదన్నారు. దేశంలో రక్తపాత రహితంగా విప్లవాన్ని తెచ్చిన ఒక ఆయుధంగా రాజ్యాంగాన్ని ఆయన అభివర్ణించారు. గడచిన 75 సంవత్సరాలుగా దేశంలో సామాజిక–ఆర్థిక సమానత్వాన్ని సాధించడంకో సం శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడూ సరికొత్త ఉషోదయానికి ఉమ్మడి కృషి చే స్తున్నాయని గవాయ్ చెప్పారు. రాజ్యాంగం శతవార్షికాల దిశగా ప్రయాణిస్తున్న తరుణంలో న్యా యవ్యవస్థలో తానుకూడా భాగస్వామిగా ఉండ టం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు.

రాజ్యాంగ ఆధిపత్యంపై మనందరకూ విశ్వాసం ఉన్నప్పుడే యుద్ధం–శాంతి నెలకున్న సమయాలలో దేశాన్ని ఐక్యంగా ఉంచగలుగుతామని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేకుండా న్యాయవ్యవస్థ స్వేచ్ఛగా ఉండాలని, ఐతే అతిముఖ్యమైన శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడింటికీ రాజ్యాంగం హక్కులు ప్రసాదించిందని చెప్పారు. పౌరహక్కుల సంరక్షకురాలుగా, వారికి ఒక కావలివ్యవస్థగా న్యాయవ్యవస్థ పనిచేయాలని అంబేద్కర్ కోరుకున్నారని, రాజ్యాంగం ఎప్పుడూ చలనరహితంగా, ఒకేలా ఉండిపోదని, రాజ్యాంగం ప్రాణికోటికి సంబంధించినది కాబట్టి అది ఎప్పుడూ అభివృద్ధి చెందుతూ విస్తరిస్తూ ఉంటుందని కూడా అంబేద్కర్ చెప్పారన్నారు. రాబోయేతరం ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఏమిటో పూర్తిగా ఈ తరం ముందుగా ఊహించలేదు కాబట్టి రాజ్యాంగంలో సవరణలను అనుమతించారన్నారు.

రాజ్యాంగం కారణంగానే దేశంలో మహిళలు, వెనుకబడినవర్గాల వారు జాతీయ జనజీవన స్రవంతిలోకి ప్రవేశించగలిగారన్నారు.‘‘మనకు ఒక మహిళా ప్రధానమంత్రిగా పనిచేశారు, ఒక మహిళ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు, ప్రస్తుతం నిర్వహిస్తున్నారు, కె.ఆర్.నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్ వంటివారంతా వెనుకబడిన తరగతుల నుండి వచ్చి రాష్ట్రపతి పదవి స్థాయికి ఎదిగినవారే, జి.ఎం.సి.బాలయోగి, మీరా కుమార్ లాంటి వారంతా లోక్‌సభ స్పీకర్‌స్థాయి పదవులు నిర్వహించారు, ఇంకా ఎందరో వెనుకబడిన తరగతులకు చెందినవారు ప్రధాన కార్యదర్శులుగా, డి.జి.పిలుగా వివిధ రాష్ట్రాలలో, వివిధ ఉన్నతస్థాయి పదవులలో పనిచేశారు, పనిచేస్తున్నారని గవాయ్ చెప్పారు.‘‘పరిష్కారాలు లేని ప్రాథమిక హక్కులవల్ల ఎలాంటి ఉపయోగం దేని అంబ్కేదర్ అభిప్రా యం, మతవిశ్వాసాలు పట్టువిదుపులతో కూడుకున్న వేగానీ, కఠోరమైన,మొండి విశ్వాసాలు కాదు, శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడింటికీ రాజ్యాంగంలో వేరు వేరు ప్రత్యేక అధికారాలు, బాధ్యతలూ ఉన్నాయి. రాజ్యాంగ చట్రం పరిధిలో చట్టాలన్నీ ఇమిడిపోయేవిధంగా చూ డటం న్యాయవ్యవస్థ బాధ్యత, ప్రజాస్వామ్యంలో ఉన్న ఈ మూడు వ్యవస్థలూ రాజ్యాంగాధిపత్యాని కి లోబడి వ్యవహరించాలి’’ అని జస్టిస్ గవాయ్ చెప్పారు.

సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృతం మూడు చేయీ చేయీ కలిపి ముందుకు సాగాలన్నారు. ‘‘కేవలం సమానత్వం మాత్రమే ఉంటే సరిపోదు, ఎవ్వరూ ముందుకెళ్ళేందుకు ఇష్టపడరు, కేవలం స్వేచ్ఛ ఉంటే కూడా బలవంతులే బతికి బట్టకడతారు, సౌభ్రాతృత్వం అనేది ఒక కావలి వ్యవస్థగా పనచేస్తుంది, సమానత్వానికి, స్వేచ్ఛకు మధ్య ఒక కావలివ్యవస్థగా సౌభ్రాతృత్వం పనిచేస్తుంది’’ అని గవాయ్ చెప్పారు. మహారాష్ట్ర చట్టసభలు రెండూ ఘన సన్మానం చేయడం పట్ల ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి ఆర్.ఎస్.గవాయ్ 30 సంవత్సరాలపాటు ఎంతో సన్నిహితంగా మహారాష్ట్ర శాసనమండలిలో పనిచేశారని అందుకే ఈ సత్కారం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. గవాయ్ తండ్రి ఆర్.ఎస్.గవాయ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) నాయకుడుగా, మహారాష్ట్ర శాసనమండలి ఛైర్మన్‌గా పనిచేశారు. బీహార్, సిక్కిం, కేరళ రాష్ట్రాలలో గవర్నర్‌గా కూడా గవాయ్ ఆర్.ఎస్.గవాయ్ పనిచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభ్యులందరి తరపునా ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ను సత్కరించారు. సెంట్రల్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24వ తేదీన జన్మించిన ప్రధాన న్యాయమూర్తి గవాయ్ 2003 నవంబరు 14వ తేదీన బోంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తి పదవి చేపట్టారు. ఈ ఏడాది మే 14వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

### విమానాశ్రయ ప్రతినిధులతో...

# పార్లమెంటరీ కమిటీ భేటీ

### అహ్మదాబాద్ విమాన ప్రమాదం, దర్యాప్తు నివేదికపై ప్రశ్నించిన సభ్యులు
### పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత శ్రీనగర్‌లో ఆకస్మికంగా విమానచార్జీల పెరుగుదలపై అసహనం



**న్యూఢిల్లీ :** పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు, విమానయాన సంస్థ (ఎయిర్‌లైన్), విమానాశ్రయ ప్రతినిధుల మౌఖిక సాక్ష్యం తీసుకోవడానికి మంగళవారం పార్లమెంటరీ కమిటీ ఒక కీలక సమావేశం నిర్వహించింది. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా (ఎఐ) విమాన ప్రమాద ఘటన, దానికి సంబంధించిన దర్యాప్తు నివేదిక ఎప్పుడు సిద్ధం అవుతుందనే విషయమై పలువురు పార్లమెంటేరియన్లు ఈ సందర్భంగా ప్రశ్నించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఈ సమావేశంలో పార్లమెంటరీ కమిటీ ప్యానెల్ సభ్యులు పలువురు ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం శ్రీనగర్‌లో ఆకస్మికంగా విమాన చార్జీలు పెరగడంపై ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తి ఆందోళన వ్యక్తం చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కొంతమంది సభ్యులు ఇతర సమస్యలతో పాటు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) ఆడిట్‌ను డిమాండ్ చేసినట్లు కూడా వర్గాలు తెలిపాయి. కెసి.వేణుగోపాల్ నేతృత్వంలోని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) సీనియర్ అధికారులను, ఎయిర్‌లైన్ ప్రతినిధులను కలిశారు. ఎయిర్ ఇండియా సిఇఓ మరియు ఎండి కాంప్‌బెల్ విల్సన్ సహా ఎయిర్‌లైన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారని అధికార వర్గాలు తెలియజేశాయి. జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం గురించి పలువురు ప్యానెల్ సభ్యులు ఈ సందర్భంగా సమావేశంలో ప్రస్తావించారని, ఎయిర్‌క్రాఫ్ట్ బ్లాక్ బాక్సుల విశ్లేషణ నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయించాలని కోరినట్లు అధికార వర్గాలు వివరించాయి. జూన్ 12న అయిన వెంటనే అహ్మదాబాద్‌లో లండన్ గాట్విక్‌కు వెళుతున్న ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన కారణంగా దాదాపు 270మంది మృతిచెందారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన ఘటనలో 26మంది మరణించిన తర్వాత ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీసుకున్న అనేక చర్యలలో భాగంగా నిషేధం విధించింది. పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ), ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఇఆర్ఎ), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ఇ ండియా (ఎఎఐ), ఎఎఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఎఎఐసిఎల్ ఎఎస్) , బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్), సమావేశానికి హాజరైన వారిలో ఉన్నారు. ఈ సమావేశం నిర్వహించడంలోని అజెండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు, విమానయాన సంస్థ, విమానాశ్రయ ప్రతినిధుల మౌఖిక సాక్ష్యం తీసుకోవడం. లెవీ, ఫీజుల రెగ్యులేషన్, టారిఫ్స్, యూజర్ చార్జీలు మొదలైన వాటికి సంబంధించినవి ఉన్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజల అవసరాల అంశాలు కూడా ఉన్నాయని లోక్‌సభ వెబ్‌సైట్ తెలిపింది.

**భద్రతా సమస్యలపైనే కమిటీ సభ్యులందరి ఆందోళన**
**: పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కెసి.వేణుగోపాల్**

సమావేశం అనంతరం పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కెసి.వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ విమాన ప్రయాణాలలో భద్రతా సమస్యలపైనే పార్లమెంటరీ కమిటీ సభ్యులందరూ ఆందోళన వ్యక్తంచేసినట్లు తెలిపారు. ఎన్‌సిపి ఎంపి ప్రఫుల్ పటేల్ ఇటీవల జరుగుతున్న విమాన ప్రమాద ఘటనలను ప్రస్తావించారు. ప్రతీ ప్రయాణికుడూ వారి ప్రయాణంలో భద్రత గురించి ఆందోళన వ్యక్తంచేస్తూ సురక్షిత ప్రయాణాన్ని కోరుకుంటున్నారని చెప్పారు.ఈ విషయమై తమ సమావేశంలో ఎయిర్ ఇండియా సిఇఓ మరియు ఎండి కాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ సీట్లు మరియు ఇతర సౌకర్యాల గురించి తరచుగా వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడానికి రెండు సంవత్సరాలలో దాని విమానాల పునరుద్ధరణ చేపడతామని, విమాన భద్రత పట్ల నిబద్ధతకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

**విమానచార్జీల ఆకస్మిక పెరుగుదలకు అడ్డుకట్టవేస్తాం : కమిటీకి డిజిసిఎ హామీ**

ఇటీవలి మహాకుంభ్‌మేళా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారీగా విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేయడంతో స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వీటికి అడ్డుకట్ట వేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అంతేకాకుండా అహ్మదాబాద్ విమాన ప్రమాదం అనంతరం విమానప్రయాణ భద్రతపై ప్యానెల్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

# బిహార్‌లో శాంతి భద్రతలు విధ్వంసం

### రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో మార్పు ఖాయం : ఖర్గే



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను నాశనం చేస్తోందని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కచ్చితంగా ఉంటుందని జోస్యం చెప్పింది. బిహార్‌ను దేశానికి ‘నేర రాజధాని‘గా మార్చడానికి జెడి(యు)–బిజెపి కూటమి ఏ రాయినీ వదలలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. అవకాశవాద డబుల్ ఇంజిన్ సర్కార్ బిహార్‌లో శాంతిభద్రతలను విధ్వంసం చేసిందని, గత ఆరు నెలల్లో, ఎనిమిది మంది వ్యాపారవేత్తలు హత్యకు గురికాగా, ఐదు సార్లు పోలీసులను కొట్టారని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. నిన్నటికి నిన్న, మూఢనమ్మకాల కారణంగా ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యులను హత్య చేశారని మండిపడ్డారు. అమాయక పిల్లలను కూడా వదిలిపెట్టలేదని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్‌లోని పూర్ణియా జిల్లాలో మంత్రవిద్యను అభ్యసిస్తున్నారనే అనుమానంతో ముగ్గురు మహిళలు సహా ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యులను చంపి, వారి మృత దేహాలను దహనం చేశారని పోలీసులు తెలిపారు. విపక్ష పార్టీల నుండి తీవ్ర విమర్శలు రాగా, ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. బిహార్‌ను దేశానికి నేర రాజధానిగా మార్చడానికి జెడియు–బిజెపి కూటమి అవకాశాన్ని వదలడం లేదని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. బిహార్‌లో పేదరికం గరిష్ట స్థాయికి చేరుకుందని, సామాజిక, ఆర్థిక న్యాయం పరిస్థితి దారుణం నుండి అధ్వాన్నంగా మారిందని, స్తబ్దుగా ఉన్న శాంతిభద్రతల కారణంగా పెట్టుబడులు కాగితాలకే పరిమితం అయ్యాయని మోదీ ప్రభుత్వ సొంత గణాంకాలే చూపిస్తున్నాయని ఖర్గే అన్నారు.ఈసారి బిహార్ ఇకపై అనారోగ్యంతో ఉండకూడదని నిర్ణయించుకుందని, బిహార్‌లో మార్పు ఖాయమన్నారు. ఇండియా కూటమి ఈ మార్పు తీసుకువస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత వారం పాట్నాలోని తన నివాసం వెలుపల ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను కాల్చి చంపిన తర్వాత ప్రతిపక్షాలు ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. బిజెపి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కలిసి బిహార్‌ను భారతదేశానికి నేర రాజధానిగా మార్చారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో, ఓటు ప్రభుత్వాన్ని మార్చడానికే కాదు.. రాష్ట్రాన్ని కాపాడుతునేందుకు వేయాలని రాహుల్ పిలుపునిచ్చారు. హాజీపూర్‌లో ఖేమ్కా కుమారుడిని దుండగులు కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత, పాట్నాలోని ఆయన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు ఖేమ్కాను కాల్చి చంపాడు.

# మహిళలకు నితీష్ ఎన్నికల ఎర

### ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్
### యువతకు ఉపాధి కల్పనకు యూత్ కమిషన్ ఏర్పాటు



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు అప్పుడే తమ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటిస్తున్నాయి. తాజాగా బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పలు ప్రకటనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత కోసం బిహార్ యూ త్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. వీటితో సహా మరో 43 ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మంగళవారం ము ఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. బిహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగంలోని అన్ని పోస్టులకు 33 ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని సిఎం చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ సర్వీసుల్లో స్త్రీల ప్రాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే విధంగా యువత కోసం బిహార్ యూత్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. దీనికింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ‘బీహార్ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను అందించడం, వారికి శిక్షణ ఇవ్వడం, వారిని సాధికారత, సమర్థులుగా మార్చడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బిహార్ యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని కు తెలియజేయడానికి సంతోషంగా ఉందని’ సిఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. సమాజంలో యువత స్థితిని మెరుగుపరచడం, ఉద్ధరించడం వంటి అన్ని విషయాలపై ప్రభుత్వానికి సలహా ఇవ్వడంలో ఈ కమిషన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. యువతకు మెరుగైన విద్య, ఉపాధిని నిర్ధారించడానికి ఇది ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటుంది’ అని ఆయన అన్నారు. ‘బిహార్ యువజన కమిషన్‌లో ఒక చైర్పర్సన్, ఇద్దరు వైస్‌చైర్‌పర్సన్‌లు, ఏడుగురు సభ్యులు ఉంటారు. గరిష్ట వయోపరిమితి 45 సంవత్సరాలు’ అని ఆయన అన్నారు. ఈ కమిషన్ రాష్ట్రంలోని ప్రైవేట్ రంగ ఉపాధిలో రాష్ట్రంలోని యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా పర్యవేక్షిస్తుందని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రం వెలుపల చదువుతున్న, పనిచేస్తున్న యువత ప్రయోజనాలను కూడా కాపాడుతుందన్నారు. కాగా, భారత యువజన కాంగ్రెస్ (ఐవైసి) గత వారం రాష్ట్ర యువత కోసం 19న పాట్నాలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తామని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం కోటాను రాష్ట్ర శాశ్వత నివాసితులకు పరిమితం చేయడంతో సహా మొత్తం 43 ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని అదనపు ప్రధాన కార్యదర్శి (క్యాబినెట్ సెక్రటేరియట్) ఎస్ సిద్ధార్థ సమావేశం తర్వాత తెలిపారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న వికలాంగులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలనే సాంఘిక సంక్షేమ శాఖ ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. నితీష్ కుమార్ ప్రభుత్వం తన సంక్షేమ అజెండాలను కాపీ చేస్తోందని ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ పేర్కొన్నారు.

# నేపాల్–చైనా సరిహద్దుల్లో వరదలు

**కఠ్మండు :** రుతుపవనాలు ప్రారంభమైన తర్వాత కేవలం భారత్‌లోనే కాకుండా ఇతర ఆసియా దేశాలను కూడా భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. నేపాల్–చైనా సరిహద్దుల్లో భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తాయి. జనావాసాల ప్రాంతాల్లో ప్రకృతి విలయం సృష్టించడంతో హిమాలయ పర్వతలోయలో, నేపాల్‌లో ఒకరు మరణించారు. మరో 17 మంది గల్లంతయ్యారు. 11 మంది చైనా ప్రజలు వరదల్లో గల్లంతయ్యారు. చైనాలో పనిచేస్తున్న నిర్మాణ కార్మికులు ఆరుగురు నేపాల్ వైపు వరదల్లో కొట్టుకుపోయారు. మొత్తంగా చూస్తే ఆ పరిహద్దు ప్రాంతంలో 28 మంది గల్లంతయ్యారు. వారి కోసం గాలిస్తున్నారు. మరోవైపు సహాయ కార్యక్రమాలు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. చైనా–నేపాల్‌ను కలుపుతూ భోటేకోషి ప్రాంతంలో నిర్మించిన ప్రధాన వంతెన, నదీ వరద ముంచెత్తకుండా అడ్డంగా కట్టిన గోడ కూడా వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. వాతావరణ మార్పుల కారణంగా జూన్ నుండి సెప్టెంబరు వరకూ భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటివన్నీ ఆసియాదేశాలలో సాధారణంగా మారుతున్నాయి. ఈ జూలై నెలలో ప్రకృతి విలయాలపట్ల అప్రమత్తంగా ఉండాలని నేపాల్ ప్రభుత్వ వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరిక చేసింది.

**100 దాటేసిన టెక్సాస్ వరద మృతులు**

టెక్సాస్‌లోని కెర్ కౌంటీలో సంభవించిన వరద విలయంలో మృతులసంఖ్య 100దాటినట్లు అధికారులు ధృవీకరించారు. వందలమంది సహాయ బృందాలు ఐదోరోజు మంగళవారంనాడు కూడా ముమ్మర గాలింపు చర్యలు కొనసాగించాయి. మృతుల్లో 27 మంది సమ్మర్ క్యాంప్‌కు వచ్చిన 12 ఏళ్ళలోపు బాలికలు ఉన్నారు. దెబ్బతిన్న ప్రకృతి సమతౌల్యానికి చిహ్నంగా గురువారంనాడు రాత్రి ప్రారంభమైన ఆకస్మిక భారీ వర్షాలు, నదీ వరద ముప్పు నుండి ప్రజలను అప్రమత్తం చేయడంలో స్థానిక ప్రభుత్వం విఫలమైంది. గ్వాడలుపే నది ఒడ్డున ఏటా నిర్వహించే ప్రఖ్యాత మైస్టిక్ సమ్మర్ క్యాంప్‌లో 750మందికిపైగా 14 ఏళ్ళలోపు బాలికలు పాల్గొంటున్న సమయంలో తెల్లవారుజామున భారీ వర్షాలవల్ల 45 నిమిషాల వ్యవధిలోనే గ్వాడాలుపే నది నీటి మట్టం26 అడుగులు ఎత్తు పెరిగింది. నది గట్టు తెంచుకుని ప్రవహించడంతో వరద బీభత్సమై నివాసాలను ముంచేసింది. ఈస్ట్‌ల్యాండ్‌కు చెందిన క్యాంప్ డైరెక్టర్ రిచర్డ్ డిక్‌సహా అనేకమంది యువ క్యాంపర్లు, ఫుట్‌బాల్ కోచ్‌లు, ఉపాధ్యాయులు మరణించినవారిలో ఉన్నారు.

# మరాఠీ ‘అస్మిత’ కోసం ర్యాలీ



**థానె :** థానే జిల్లాలోని మీరా భయాందర్ ప్రాంతంలో మరాఠీ ‘అస్మిత’ (గర్వం)ను సమర్థించడానికి ఎంఎంఎన్, కొన్ని సామాజిక సంఘాలు మంగళవారం నిర్వహించిన మోర్చాలో వందలాది మంది పాల్గొన్నారు. మరాఠీ మాట్లాడనందుకు ఒక దుకాణదారుడిపై దాడి తర్వాత రాజకీయ వేడి రగులుకుంది. వీధుల్లో తీవ్ర నాటకీయ పరిణామాల చోటు చేసుకోగా నిరసనలో శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయితే అనేక మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం నిరసన స్థలాన్ని శివసేన మంత్రి ప్రతాప్ సర్నాయక్ సందర్శించగా, అప్పటికే ఆగ్రహంతో ఉన్న ప్రదర్శనకారులు మంత్రిని అడ్డుకుని అక్కడి నుంచి తరిమికొట్టారు. శాంతిభద్రతలకు ముప్పు ఉందని పేర్కొంటూ పోలీసులు నిరసన ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. అయితే, వీధుల్లో తీవ్ర నాటకీయత, స్పష్టమైన రాజకీయ జోక్యం తర్వాత, నిర్వాహకులు ప్రతిపాదించిన అసలు మార్గం గుండా మోర్చ వెళ్ళింది. మరాఠీ మాట్లాడనందుకు ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు ఫుడ్ స్టాల్ యజమానిని చెంపదెబ్బ కొట్టడాన్ని నిరసిస్తూ వ్యాపారులు ఇటీవల నిర్వహించిన నిరసనను ఎదుర్కోవడానికి ఎంఎన్‌ఎస్, ఇతర మరాఠీ అనుకూల గ్రూపు ఈ ర్యాలీ నిర్వహించాయని అధికారులు తెలిపారు. ‘మరాఠీ అస్మిత’ (గర్వం)ను కాపాడాలని నినాదాలు చేస్తున్న నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మీడియాతో మాట్లాడుతుండగా వారిలో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని అర్ధరాత్రి నుండే అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీవ్ర చర్యకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలను పోలీసు వ్యాన్లలోకి లాక్కెళ్లిన చిత్రాలను టెలివిజన్ ఛానెల్‌లు ప్రసారం చేశాయి. నిరసన వేదిక వద్దకు చేరుకోకుండా నిరోధించడానికి అనేక మంది కార్యకర్తలను విందు హాలులో అదుపులోకి తీసుకున్నారు. వీధుల్లో హై డ్రామా జరుగుతుండగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాజకీయ నష్టాన్ని అరికట్టడానికి చర్యలకు ఉపక్రమించారు. ర్యాలీకి అనుమతి మంజూరు చేశామని, అయితే శాంతిభద్రతలకు సవాళ్లను కలిగించే నిర్దిష్ట మార్గంలో ఎంఎన్‌ఎస్ పట్టుబట్టిందని ఆయన చెప్పారు. తన మార్గం కోసం అనుమతి కోరితే తాము తప్పకుండా అనుమతి ఇచ్చేవారిమన్నారు. పోలీసులు ఆమోదించిన మార్గంలో మరొక సంస్థ ర్యాలీ నిర్వహించిందన్నారు. అయితే వీరు కూడా అదే మార్గంలో ర్యాలీ చేస్తామని పట్టుబట్టినట్లు సిఎం పేర్కొన్నారు. మరాఠీ ఉద్యమానికి మద్దతు వెల్లువెత్తడంతో శివసేన మంత్రి ప్రతాప్ సర్నాయక్ పోలీసులను అనధికారిక చర్యల కోసం ఉపయోగించారు, ఇది ఏ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లేకపోవడం గమనార్హం. ‘పోలీసుల చర్య పూర్తిగా తప్పు. మరాఠీ ప్రయోజనాలకు మద్దతుగా శాంతియుత మోర్చాను అణచివేయడానికి ప్రభుత్వం అలాంటి సూచనలను జారీ చేయలేదు’ అని సర్నాయక్ విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రితో ఈ విషయాన్ని చర్చిస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా, నిరసనకారులు బాలాజీ స్క్వేర్ నుండి మీరా రోడ్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న మేజర్ కౌస్తుభ్ రాణే స్మారక చిహ్నం వరకు ప్రజలు ప్రధాన వీధుల గుండా శాంతియుతంగా ర్యాలీ చేశారు. మరాఠీ మాట్లాడనందుకు భయాందర్ ప్రాంతంలోని ఫుడ్ స్టాల్ యజమానిని ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు చెంపదెబ్బ కొట్టిన తర్వాత, మహారాష్ట్రలోని ప్రాథమిక పాఠశాలల్లో భాష ‘విధించడం‘పై వివాదం పురపాలక ఎన్నికలకు ముందు ఒక ప్రధాన రాజకీయ ఉద్రిక్తతగా మారింది.

### భారత ప్రధాని మోదీ

# మౌనం వీడేది ఇంకెప్పుడు ?

### కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** భారతదేశం, పాకిస్థాన్ మధ్య ‘కాల్పుల విరమణ’ ప్రస్తావనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కనీసం 21వ సారి పునరావృతం చేశారని, ఈ అంశంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మౌనాన్ని ఇంకెప్పుడు వీడతారని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. డోనాల్డ్ ట్రంప్ సోమవారం తన వ్యాఖ్యలలో, ఒకవేళ రెండు పొరుగు దేశాలు ఇంకా యుద్ధం కొనసాగిస్తామంటే వాషింగ్టన్ వారితో వ్యాపారం చేయదని చెప్పడం ద్వారా భారతదేశంపాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపాననే వాదనను పునరావృతం చేశారని కాంగ్రెస్ గుర్తుచేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ గత 59 రోజుల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలలో ‘కనీసం భారత్ పాక్ మధ్య మేలో నాలుగు రోజులపాటు జరిగిన యుద్ధం అణుసంఘర్షణగామారబోతున్న సమయంలో నేనే ఆపానని ఆయన కనీసం 21సార్లు ఆ వ్యాఖ్యలను పునరావృతం చేశారు’ అని చెప్పారు. భారత్‌పాక్ మధ్య అణు సంఘర్షణకు దారితీస్తున్న సమయంలో అమెరికా ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు బుజ్జగించో, బెదిరించో అంగీకరింపజేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా చెప్పారని జైరామ్ రమేశ్ వివరించారు. ‘వేరే మాటల్లో చెప్పాలి అంటే ఆయన సందేశం...వెంటనే ఈ యుద్ధాన్ని ఆపండి లేదా అమెరికన్ మార్కెట్లు ( మరియు బహుశా పెట్టుబడులను) కోల్పోయే నిజమైన అవకాశాలను ఎదుర్కోండి’ అని ఆయన చెప్పారు. ఇండియాపాకిస్థాన్‌లతో అమెరికా ఒప్పందం అతి త్వరలో ప్రకటించబడుతుందని అధ్యక్షుడు ట్రంప్ ఊదరగొట్టారని జైరామ్ రమేశ్ తెలిపారు. ఒకప్పుడు తన సీనియర్ కొలీగ్ ఘన్‌శ్యామ్ తివారీ దీనిని ‘బిజెపి ట్రంప్ కార్డు’ అని అభివర్ణించినప్పటికీ నరేంద్రమోదీ ఈ అంశంపై ఎప్పుడు మౌనం వీడతారని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రశ్నించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి అమెరికా దగ్గర అవుతోందని సోమవారం డోనాల్డ్ ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. ‘ఇప్పుడు మేం యునైటెడ్ కింగ్‌డంతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. చైనాతో కూడా ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకునేందుకు దగ్గరగా ఉన్నాం. ఇతరులను కూడా మేం కలిసినా వారితో మేం ఒక ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం అని మేం అనుకోవడం లేదు. మేం కేవలం వారికి ఒక లేఖను మాత్రమే పంపించాం. మీరు ఒక వేళ బంతితో ఆట ఆడాలనుకుంటే మీరు చేయాల్సింది ఇదే’ అని ట్రంప్ సోమవారం చెప్పారు. మే 10నుంచి ట్రంప్ అనేక సార్లు భారతదేశంపాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు వారికి తానే సహాయపడ్డానని పదేపదే చెబుతూ వచ్చారని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు.

## ఆగస్టు 15లోపు ఆన్‌లైన్ దరఖాస్తు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోని వికలాంగులు, వితంతువులు ఆగస్టు 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల ఎంపీడీవీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని వితంతువులు, వికలాంగులు ఆగస్టు 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినందున ఆయా మండలాల్లో ప్రజలందరికి అవగాహన కలిగేలా మండల అధికారులు విస్తృత ప్రచారం చేయాలని, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని వితంతువులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవీలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఈనెల 14న నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరుమలగిరికి వస్తున్న సందర్భంగా సభ స్థలాన్ని, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌పి కె.నర్సింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.



## అర్హులైన వారిని ఓటరుగా నమోదు

### సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ, మండల పరిధిలో అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీఎల్‌వో యాప్ తదితర అంశాలపై బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ప్రతి బీఎల్‌వో తమ ప్రాంతంలోని అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండి ఫామ్ 6,7,8లకు సంబందించిన ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరుచుకోని క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శర్మ, ఎన్నికల డీటీ ప్రవీణ్, మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య, పోలెబోయిన జనార్ధన్, అంబటి శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, సైదిరెడ్డి, ఉస్మాన్, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు



**ప్రజాపక్షం/చిట్యాల :** సికింద్రాబాద్ నుండి విశాఖ మీదుగా భువనేశ్వర్‌కు వెలుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం పెనుప్రమాదం తప్పింది. సికింద్రాబాద్ నుండి సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరిన రైలు చిట్యాల రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకునే సమయంలో రైలు ఇంజన్ వెనుక బోగి క్రింది భాగంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన లోకో పైలట్ రైలును వెంటనే నిలిపివేసి అందుబాటులో ఉన్న టెక్నిషియన్‌ల సహాయంతో మంటలు వచ్చిన ప్రదేశాన్ని తనిఖీ చేశారు. రైలులో ఉన్న మంటలను ఆర్పే సిలిండర్‌లను ఉపయోగించి మంటలను ఆర్పేశారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. రైలును పూర్తిగా తనిఖీ చేశాక స్థానిక రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకుంది. అనంతరం మరో మారు రైలును తనిఖీ చేసి ఎలాంటి ప్రమాదం లేదని టెక్నీషియన్లు నిర్ధారించుకున్న తరువాత రైలుకు పచ్చ జెండాను ఊపారు. సుమారు గంట సేపు రైలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు.

## ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలి

### మావోయిస్టు మాజీ నేత కావలి యాదయ్య

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బిజెపి నాయకులు గుండగోని మైసయ్యగౌడ్ హత్యకేసులో హత్య నేరం మోపబడిన తనపై భౌతిక దాడి చేసేందుకు బిజెపి,ఏబీవీపీ కి చెందిన కొంతమంది ప్రయత్నాలు చేస్తూ భయాందోళనకు గురి చేశారని వారి నుండి ప్రాణహాని ఉన్నందున తనకు ప్రాణ రక్షణ కల్పించాలని మావోయిస్టు మాజీ నేత కావలి యాదయ్య జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్‌కు ఫిర్యాదు చేశారు. మైసయ్య గౌడ్ హత్య కేసులో తన ప్రమేయం లేకున ఆనాడు పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి జైల్లో పెట్టడం జరిగిందని అటి కేసులో జిల్లా కోర్టు నుండి బెయిల్ తీసుకొని కోర్టు ఇచ్చిన వాయిదాల ప్రకారం కొర్టుకు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. కేసు విచారణ సమయంలో సాక్షాలను ప్రవేశపెట్టే క్రమంలో సోమవారం రోజు కోర్టుకు హాజరు కావడం జరిగింది అన్నారు. అయితే కోర్టుకు హాజరైన సమయంలో బిజెపి,ఏబీవీపీకి చెందిన నాయకులు కోర్టు ఆవరణలోనే తనపై భౌతిక దాడి చేయాలని ప్రయత్నం చేస్తూ వారి వారి సెల్‌ఫోన్‌ల ద్వారా తన ఫోటోలు,వీడియోలు తీయడం జరిగిందని ఆరోపించారు. మైసయ్య హత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని వారి కుటుంబ సభ్యులు గ్రహించాలని కోరారు. అదేవిధంగా తనకు సంబంధం లేని కేసు వారి కుటుంబ సభ్యుల నుండి ప్రాణహాని ఉన్నందున తనకు రక్షణ రక్షణ కల్పించాలని కోరారు

## రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తుండడం పట్ల నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవానిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. అంతేకాక రోగులకు వారి సహాయకులకు, బంధువులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తుండడం పట్ల కూడా ఆమె అభినందించారు.మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవాని తో ఆమె మాట్లాడి గత నెల ఎన్ని కాన్పులు చేశారని అడితెలుసుకున్నారు. ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు అందించాలని గ్రామాల్లో ఎక్కువగా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడతారని దానిని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రికి సిబ్బంది అంతా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, తదితర సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కాగా టాయిలెట్ సమస్యను, ఇతర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిపై నివేదిక పంపించాలని ఎంపీడీవో రామకృష్ణ శర్మను ఆదేశించారు.తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తులన్నింటిని ఆగస్ 14 లోగా పరిష్కరించాలని తహసిల్దార్ జి. దేవ సింగ్ ను ఆదేశించారు. చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి, ఎం పి ఓ ఝాన్సీ, ఆర్ఐ



# 4లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

### నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** తెలంగాణ రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 గంటల నుండి 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జిఓ 282 ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఎఐటియుసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఇమ్రాన్ పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలం నాటి నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి 4న లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని. కార్మికుల శ్రమను కారుచౌకగా మరింత దోపిడీ చేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 8 నుండి 10 పని గంటలను పెంచి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. నేటి సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికవర్గం పెద్దఎత్తున కదిలి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, మండల అధ్యక్షులు టంగుటూరి రాములు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షులు పాపగళ్ల శంకరయ్య, ఆటో ట్రాలీ యూనియన్ అధ్యక్షులు బెండద రమేష్, శ్యామల రమేష్, సంగేం సురేష్, పరమేష్, లింగస్వామి, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



### భువనగిరిలో సిపిఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జూలై 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై గంజు పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ బైక్ ర్యాలీలో సిపిఐ భువనగిరి మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, సిపిఐ నాయకులు చింతల పెంటయ్య, కోట శంకర్, బద్దం వెంకటరెడ్డి చొప్పరి సత్తయ్య, అబ్బులు, సత్యనారాయణ, రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

### కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మారుస్తూ జీవో నెంబర్ 282ను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని, వాటిని కార్మికులు ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, జక్కు దయాకర్ రెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, యాస బుచ్చి రెడ్డి, జల్ది రాములు, కసరబోయిన సత్తయ్య, బొబ్బల లాల్ రెడ్డి, మజ్జిగ నర్సయ్య, గుర్రం రాజమణి పాల్గొన్నారు.







## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** పేదవాడి ఇంటి కల నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో రూ. 22,500కోట్లు కేటాయించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం తెలుగుపల్లి గ్రామంలో నూతనగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ గత పాలకులు పేదల ఇంటి కలను నిర్లక్ష్యం చేసినప్పటికి ప్రజల ఆకాంక్షలను గుర్తించి, ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఆకలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి పది లక్షల కుటుంబాలలో 93 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించగలగడం గర్వకారణం అని, ఇందిరమ్మ ఇళ్ల కోసం కేవలం మొదటి ఏడాదిలోనే రూ. 22,500కోట్లు ఖర్చు చేయడం దేశంలోనే ఓ రికార్డు సృష్టించామని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఇంటి కల నెరవేర్చేలా మొదటి దశలోనే నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంద సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ జెడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు అన్నారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా అదనపు కలెక్టర్ హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళ సమాఖ్య సభ్యులందరు ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను, విద్యా బోధన గురించి తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చూడాలన్నారు. అలాగే అంగన్వాడీ సెంటర్‌లలో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం , ఎగ్ బిర్యానీ ఇస్తున్నారా లేదా చూడాలని తెలిపారు. స్కూల్ యూనిఫామ్స్ కుట్టడం పూర్తి అయిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని పీహెచ్‌సిని స్థానిక సంస్థల అదనప కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయానికి వైద్యం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అందరు ఖచ్చితంగా సమయానికి విధులకు హాజరై ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్ పరిశీలించి సమయానికి రాని వారికి సాధారణ సెలవు (సిఎల్) వేయాలని సంబంధిత డాక్టర్‌కు చెప్పారు. పిహెచ్‌సిలో మెడిసిన్ సరిగా సరిపడా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైస్ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి మౌనిక, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రజావాణి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ నాయకుల బిహార్ రౌడీయిజం



### టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెచ్చే విధంగా కృషి చేస్తే, బిఆర్‌ఎస్ నాయకులు మాత్రం తెలంగాణ రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకొని సంవత్సరం పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు బిహర్ రౌడియిజాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నారని, త్వరలో జైలుకు వెళ్లేందుకు సిద్దంగా ఉండాలని అన్నారు. ఎందుకంటే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ఫోన్ ట్యాపింగ్, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులని టివిలలో ఐదు నిమిషాలు కూడా వార్తలు రానిచ్చేవారు కాదని అన్నారు. కెటిఆర్ ఇటీవల కాలంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు పోయి చర్చకు రా అంటున్నాడు. ముఖ్యమంత్రి స్థాయి కెటిఆర్‌తో చర్చించే స్థాయి కాదని దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, పిసిసి అధికార ప్రతినిధి ధారావత్ వెంకన్ననాయక్, ముదిరెడ్డి రమణారెడ్డి, పిల్లల రమేష్‌నాయుడు, కుంచం అంజయ్య, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.



## శ్రీశైలం నుండి సాగర్ కు భారీ వరద

### పెరుగుతున్న సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం

**ప్రజాపక్షం/నందికొండ:** జూరాల, సుంకిసాల నుంచి శ్రీశైలం కు భారీగా వరద వచ్చి చేరుతూ ఉండటంతో శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తూ గరిష్టమటానికి చేరుకుంది దీనితోమంగళవారం మధ్యాహ్నం శ్రీశైలం ప్రాజెక్టు నాలుగేట్లను పైకి లేపి 114146 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయటంతో సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. 25 సంవత్సరాల తర్వాత జూలై నెలలో శ్రీశైలం రిజర్వాయర్ గేట్లను ఎత్తడం ఇదే తొలిసారి కావడం దీనితో నాగర్జున సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగసాగింది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే మరో వారం రోజుల్లో సాగర్ ప్రాజెక్టు కూడా నిండుకుండలా మారి జల కలను సంతరించుకొనుంది. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు గాను మంగళవారం సాయంత్రానికి 531.90 అడుగులకు 171.8788 టిఎంసిల నీటి నిల్వ తో ఉంది. అయితే శ్రీశైలం ప్రాజెక్ట్నుంచి నాగార్జునసాగర్ కు ఇన్ ఫ్లోగా 114146 కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉండగా, ఎడమ కాలువ ద్వారా 3090 ఎస్ ఎల్ బి సి ఏ ఎన్ ఆర్ పి ద్వారా 1500క్యూసెక్కుల నీటిని అవుట్ ఫ్లోగా విడుదల చేస్తున్నారు.

## సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ ను మంగళవారం ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాలలోని 24 దేశాలకు చెందిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూ ట్ లో రెండు వారాలపాటు అంతర్జాతీయ శిక్షణ నిమిత్తం వచ్చిన వీరు అత్యాధునికపర్యావరణ పరిశోధన కన్సల్టెన్సీ సేవలపై స్థిరత్వం, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ పద్ధతులపై అవగాహనను పెంచుకోవడంలో శిక్షణ పొందుతున్నారు. అందుకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీరు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ను సందర్శించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు, పవర్ హౌస్ విశేషాలను తెలుసుకున్నారు వీరికి ప్రాజెక్టు ఏఈ కృష్ణయ్య వాటి విశేషాలను తెలియజేశారు. ప్రాజెక్టు సందర్శనతో తాము ఎన్నో అంశాలు నేర్చుకున్నామని 24దేశాలకు చెందిన ప్రతినిధులు తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామపంచాయతీల అభివృద్ధి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో పూర్తిగా అమలు చేసి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్సు హాల్ నందు భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వశాఖ సహకారంతో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం, గ్రామసభలపై ప్రతి మండల నుంచి ఇద్దరు చొప్పున పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయితీ కార్యదర్శుల పాత్ర అత్యంత ముఖ్యమైందని తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే కార్యదర్శి ప్రజలతో బలమైన అనుబంధాన్ని నెలకొల్పి, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామ స్థాయిలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి పనులు గ్రామసభల ద్వారానే చర్చించబడాలని అవి పారదర్శకంగా జరగాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హుల వరకు చేరేలా చూడాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ముఖ్యమైన సాధనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ నాగేంద్రం, మాస్టర్ ట్రైనర్ రిటైర్డ్ డీపీఓ కృష్ణ, శిక్షణ రీజినల్ మేనేజర్ డా.హన్మంతు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు వారి సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవిలత గూడూరులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టాలు, ఫోక్సో చట్టాలు, విద్యా హక్కు చట్టం, మాదకద్రవ్య నిషేధ చట్టము దాని వలన కలిగే దుష్ఫలితాలు, సైబర్ నేరాలు శిక్షలు మరియు పర్యావరణ పరిరక్షణ చట్టం, న్యాయ సేవ అధికార సంస్థ చట్టం, న్యాయ సహాయము, కావాల్సిన అర్హతలు, టోల్ ఫ్రీ నెంబర్ 1098, 15100 అంశాలపై అవగాహన కల్పించారు. బాల సంరక్షణ సమితి అధ్యక్షురాలు బండారు జయశ్రీ జువెనైల్ జస్టిస్ చట్టం, బాలల సంరక్షణకై సమితి అందిస్తున్న సేవలు అంశాలపై వివరించారు.

## మూలన పడ్డ వ్యాక్సిన్ వ్యాన్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:లక్షలాది రూపాయల వ్యయంతో జిల్లాలో ఏర్పాటు చేసిన వ్యాక్సిన్ వ్యాన్ మూలపడింది. దీనిపై కనీసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సైతం పట్టించుకోవడం లేదనే వాదన బలంగా ఉంది. గత మూడేళ్ల క్రితం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు సకాలంలో వ్యాక్సిన్లు సరఫరా చేయాలని సదుద్ధేశ్యంతో అప్పటి ప్రభుత్వం జిల్లాలో సుమారు రూ.25లక్షలు వేచ్చించి వ్యాక్సిన్ సరఫరా కోసం వ్యాన్‌ను కేటాయించారు. ఇప్పటికైన వైద్యఆరోగ్యశాక చొరవచూపి వ్యాక్సిన్ వ్యాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపయోగపడేలా చర్యల తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దన బలంగా ఉంది. గత మూడేళ్ల క్రితం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు సకాలంలో వ్యాక్సిన్లు సరఫరా చేయాలని సదుద్ధేశ్యంతో అప్పటి ప్రభుత్వం జిల్లాలో సుమారు రూ.25లక్షలు వేచ్చించి వ్యాక్సిన్ సరఫరా కోసం వ్యాన్‌ను కేటాయించారు. ఇప్పటికైన వైద్యఆరోగ్యశాక చొరవచూపి వ్యాక్సిన్ వ్యాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపయోగపడేలా చర్యల తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అటవీ అధికారులు తీరు మార్చుకోవాలి



ప్రజాపక్షం/పాల్వంచ : పోడుసాగు రైతులపై అటవీశాఖ అధికారుల తీరు మార్చుకోవాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. మండల పరిధి దంతెలబోర బీట్ అధికారి గత కొద్ది రోజులుగా ఏక పక్షంగా వ్యవహరిస్తూ కక్ష్య సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. పేద రైతులకు చెందిన పత్తి పంటను ధ్వంసం చేస్తూ, పీకి వేస్తుందన్నారు. ఇదేమిటని అడిగిన రైతులపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగుతూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. చంద్రుగొండకు చెందిన నిరుపేద రైతుల సాగు చేసుకొంటున్న భూముల్లోని పూత, కాత దశకు వచ్చిన పత్తి పంటను ధ్వంసం చేసిందని ఆరోపించారు. రైతులకు చెందిన పంటను గత వారం రోజుల కిందట ధ్వంసం చేసి నష్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారులు స్పంధించి బాత రైతులకు నష్ట పరిహారం చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు తెలిపారు. ప్రమాదాల నివారణపై విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టిజిఎస్ ఆర్‌టిసి ఖమ్మం రీజియన్ పరిధిలోని డ్రైవర్లకు శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ముఖ్య అతిథిగా ఖమ్మం ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రహ్మకుమారీస్ సిస్టర్ గీత మానసిక ఒత్తిడిలను ఎలా అధిగమించాలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్, పిజే డిఐ వినాయకరావు, డిఐ సురేష్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి అడ్లూరిని కలిసిన పిసిసి సభ్యుడు జావిద్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పిసిసి సభ్యులు, ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుమహ్మద్ జావిద్ కోరారు. మహ్మద్ జావిద్ ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ 2024 డిఎస్సి ద్వారా 1183 పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌ను జారీ చేశారన్నారు. అందులో 523 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. అదే విధంగా ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలన్నారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ లోన్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరి వెదజల్లే పద్ధతిలో పెట్టుబడి తక్కువ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ఖమ్మం అర్బన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో వరి వెదజల్లే పద్ధతి గురించి రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనం సిద్ది అనే వరి రకాన్ని పొడి దుక్కులో వెదజల్లే పద్ధతి ద్వారా పండించే విధానం గురించి రైతులకు తగు సూచనలు,మెలకువలను అందించారు. ఈ సందర్భంగా ఎడిఎ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో వరి సాగుకు ఎకరానికి 10 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు.వెదజల్లే పద్ధతిలో కలుపు నివారణకు బిస్ పైరి బ్యాక్ సోడియం నామిని గోల్డ్ అనే కలుపు మందును విత్తనం మొలిచిన 20 రోజుల లోపల పిచికారి చేసినట్లయితే సమర్థవంతంగా కలుపు నివారణ జరుగుతుందన్నారు. వెదజల్లే పద్ధతిలో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి కూడా బాగానే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఎఇఒప్రతిభ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బెండలపాడు గ్రామ శివారులో దుప్పిమృతి



ప్రజాపక్షం/చంద్రుగొండ:బెండలపాడు గ్రామ శివారులో దుప్పి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మ oడల పరిధిలోని బెండలపాడు గ్రామ శివారులోని కనిగిర గుట్టల అటవీప్రాంతం నుండి దుప్పి దారి తప్పి పంట చేనులోకి వచ్చిందని, పంట చేనులో తిరుగుతున్న దుప్పిని చూసిన రైతులు అరవడంతో కంగారుపడిన దుప్పి వేగంగా పరుగెత్తి పంటచేనులో గల ఫెన్సింగ్ తీగలలో చిక్కుకొని భయంతో చనిపోయిందన్నారు. వెంటనే గ్రామస్తులు, రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ స్ట్రైకింగ్ ఫోర్స్ వచ్చి దుప్పిని స్వాధీనం పరుచుకున్నారని చంద్రుగొండ అటవీ శాఖ రేంజర్ ఎల్లయ్య అన్నారు. ఎల్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చనిపోయిన దుప్పిని స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అడవి నుండి వచ్చే జంతువుల సమాచారం ఫారెస్ట్ అధికారులకు ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

## జర పట్టించుకోండి సారూ...



ప్రజాపక్షం/కారేపల్లి:కారేపల్లి, ఇల్లందు ప్రధాన రహదారిపై అప్పాయిగూడెం గ్రామ సమీపంలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీనితో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు గురయ్యే అవకాశం ఉంది. అలాగే ఈ రహదారిలో అక్కడక్కడ కూడా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి ఈ గుంతల వద్ద తారు వేసి మరమ్మతులు చేపట్టాలని, పట్టించుకోండి కాస్తంత అని ప్రజలు కోరుతున్నారు.

## ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్‌ల దరఖాస్తులు

ప్రజాపక్షం/పాల్వంచ : రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 202526 సం.కి ఓపెన్ టెన్త్, ఇంటర్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ ఏఐ కో ఆర్డినేటర్ జి. భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వరకు అపరాధరుసుము లేకుండా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9866806532 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

# ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

సకాలంలో పనులు పూర్తి చేయాలి *రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి, చేనేతల శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 23.75 లక్షలతో కాకతీయ హిల్స్ నుండి వైరా మెయిన్ రోడ్డు వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 24.05 లక్షలతో జిఆర్‌ఆర్ శ్రీనివాసం నుంచి పుట్టకోట రోడ్డు వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పచ్చదనం పెంపొందించుకునేందుకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో నీటి సరఫరా సమస్యకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, ఖమ్మం ఆర్‌డిఒ జి. నర్సింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు పిలుపు




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను హమాలీలు, కార్మికులు జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో గల ఎస్‌డబ్ల్యూసి గోదాంలో కార్మికులతో సమ్మె జయప్రదంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఎమ్ఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటుండగా...వామపక్ష పార్టీలు, ఇండియా కూటమిలోని పార్టీలు బలపరుస్తున్నట్లు తెలిపారు. అలాగే హమాలీలు, కార్మికులకు కల్పించాల్సిన హక్కులపై వివవరించారు. ఈ కార్యక్రమంలోఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వెంకటేశ్వర్లు, నాయకులు వై. ఉపేందర్, సిహెచ్ కుమార్, కె.రవి, కె.నరేష్, యం లింగయ్య, బి. రాజయ్య, వి. వెంకటేశ్వర్లు, యన్ వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగి రావాలి

సమ్మెకు సంపూర్ణ మద్దతు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టు పెడుతున్న కేంద్రం తీరుకు నిరసనగా బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెతో కేంద్ర దిగి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులపై దాడికి పాల్పడుతోందన్నారు. కేంద్ర తీసుకున్న సంస్కరణలు, చట్టాలు దోపిడీ వర్గాలకు మేలు చేసేవిగా ఉన్నాయన్నారు. కార్మికులు,ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ సంస్థల కోసమే పనిచేస్తున్నారని మండిపడ్డారు. ధరల నియంత్రణలోకేంద్రం పూర్తిగా విఫలమైందని, పేదలు, సామాన్య ప్రజలు రెండుపూటల తినలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సమ్మె విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు, అనుబంధ కార్మిక ప్రజాసంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్న కేంద్రానికి సార్వత్రిక సమ్మె గుణపాఠం కావాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొ ని జయప్రదం చేయాలని, ప్రజలు,వ్యాపారవర్గాలు సమ్మెకు సహకరించాలని పాషా కోరారు.

## సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు



ప్రజాపక్షం/కారేపల్లి:ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రైవేటీకరణ వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయపద్రం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కారేపల్లి మండలం మాదారం డోలమైట్ మైన్స్ గేటు ముందు ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసి, సింగరేణి, రైల్వే, బ్యాంకింగ్, తపాలా, బిఎస్ఎన్ఎల్ లాంటి సంస్థలను ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయించటం దానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధంగా ఉన్న మాదారం డోలమైడ్ మైండ్స్ కూడా అభివృద్ధి పరచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధంగా ఉన్న డోలమైట్ మైన్స్ నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకునే బాధ్యత ప్రజలు కార్మిక వర్గంపై ఉందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ప్రతి పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైందని, కార్మిక వర్గం నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని, దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలతో పాటు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎర్రబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామాలక్ష్మి, సమితి సభ్యుడు ఉంగరాల సుధాకర్, ఎఐటియుసి డోలమైడ్ మైన్స్ ప్రధాన కార్యదర్శి ఈరు నాయక్, గౌరవ అధ్యక్షుడు కొల్లి వీరయ్య, సిపిఐ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## కరకట్ట పనులు వేగవంతం

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు



ప్రజాపక్షం/భద్రాచలం:గోదావరి వరదల వల్ల ప్రజలకు, రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్తగాచేపడుతున్న కరకట్ట పనులను సంబంధిత అధికారులు వేగవంతం చేయాలని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్, కూనవరం రోడ్‌లో నిర్మాణం జరుగుతున్న కరకట్ట స్లూయుస్ పనులను, విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్యూయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం గోదావరి వరదలు క్రమేపీ హెచ్చుతగ్గులతో ప్రవహిస్తుంటుందని, ముందుగానే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక వర్షాల వల్ల భద్రాచలంలోని రామాలయం పరిసరాలు, అన్నదాన సత్రం నీట మునుగుతోందని, డ్రైనేజీలు నిండిపోయి వర్షపునీరు పొంగిపొర్లుతుందని అన్నారు. ఇందులో భాగంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. స్లూయిస్‌ల వద్ద మోటార్లు సరిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో మిగు లు పనులు చేయాలని, ఆదివాసీ గ్రామాల్లో గోదావరి వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీసీతారామ క్లబ్‌లో రూ.5లక్షలతో నిర్మాణం చేపట్టి పూర్తి చేసిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దామోదర్ రావు, ఇరిగేషన్ ఇఇ జానీ, డిఇ ముధకర్, ఎఇ వెంకటేశ్వర్లు, జిపి ఇఒ శ్రీనివాస్ తో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల రక్షణ మనందరి బాధ్యత



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:పిల్లల రక్షణ మనందరి బాధ్యత అని, జిల్లా బాలకార్మిక రహిత జిల్లాగా ఉండాలని, దీనిపై మారుమూల ప్రాంతాల్లో సైతం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడిఒసిలో మంగళవారం జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కోళ్లఫాములు, ఇటుకబట్టీలు, షాపింగ్ మాల్స్ తో పాటు తదితర అన్ని చోట్ల తనిఖీలు చేపట్టాలన్నారు. మణుగూరులో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ గృహం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటం వల్ల అనువుగా లేదని, కొత్తగూడెంలో బాలల సంరక్షణ గృహం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు మణుగూరులో ఉన్నదానిని సిడిపిఒ కార్యాలయంగా మార్చాలన్నారు. బాలల సంరక్షణ గృహంలో పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, సమస్యలేమైనా ఉంటే వాటి పరిష్కారానికి వారం లోగా సమగ్ర నివేదికలు అందించాలన్నారు. సంరక్షణ గృహంలో పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలకు నెలకొకసారి వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు.అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పిల్ల సంరక్షణ చేపట్టాలని, పిల్లల సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నమోదైన కేసుల పూర్తి వివరాలను వారం రోజుల్లోగా నివేదించాలని చెప్పారు. హెల్ప్ లైన్‌కు వచ్చే ఫిర్యాదులను క్రమపద్ధతిలో నమోదు చేయాలన్నారు. హెల్ప్ లైన్ అధికారులు జిలాల్లోని అన్ని పాఠశాలలకు ఫోన్ చేసి ఎవరైనా లైంగిక వేదింపులకు గురవుతున్నారా అనే విషయాన్ని అ డిగి తెలుసుకోవాలని, ఉపాధ్యాయులు పిల్లలను కొట్టరాదని, అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ నెం 1098 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి జయలక్ష్మి, సిపిఒ సంజీవరావు, మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమాధికారి, బిసి సంక్షేమాధికారి ఇందిరా, ఐటి కోర్‌సిఐ రాముతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారి చేతుల్లో కీలుబొమ్మగా మహిళలు

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన






ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: మహిళల శక్తి..సామర్థ్యాలను పెట్టుబడిదారీ వ్యవస్థ తన చేతుల్లో కీలుబొమ్మగా మార్చుకుందని, తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో 5వ ఖమ్మంరూరల్ మండల మహిళా సమాఖ్య మహాసభను నిర్వహించారు. తొలుత ఊరు ముందు నుంచి ర్యాలీగా మహిళలు డీజే, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహభరితంగా పురవీధుల్లో తిరిగారు. అలాగే ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సంఘం జెండాను సిపిఐ సీనియర్‌నాయకురాలు దండి నారాయణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓరుగంటి ప్రమీల, కొమరబత్తిని వెంకటరత్నమ్మ, మారుతి రుక్మిణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సృజన మాట్లాడారు..బిజెపి పార్టీ కుల, మతాల మధ్య చిచ్చు రాజేస్తూ అంటకాగుతూ ప్రజల మధ్య వైశామ్యాలు రెచ్చగొడుతుందని ధ్వజమెత్తారు. మహిళలను వంటగదికే పరిమితం చేసేలా తమ పెట్టుబడిదారి వ్యవస్థ ద్వారా టీవీ సీరియల్స్, ఫోన్లు వంటి వాటిని ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఇటువంటి శక్తులపై మహిళలు గల మెత్తాలన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రంగాల్లో నారీమణులు అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. పురుషులకంటే మహిళలు ఎందులో తక్కువ కాదని, అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. ఇంటిని చక్కదిద్దడమే కాకుండా సమసమాజ స్థాపనలోను భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం 61మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురంమున్సిపాలిటీ అధ్యక్షురాలిగా పోటు శ్రావణి, కార్యదర్శిగా మేళ్లచెర్వు లలితతో పాటు 21మంది ఆఫీస్‌బ్యారర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, లాయర్ కత్తి శివకుమారి, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, మహిళ సంఘం జిల్లా ఇన్చార్జ్ జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, వున్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగీళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో .. ఉద్యోగం ఒకరిది.. పనిచేసేది ఎవరో?

బయోమెట్రిక్ వేలిముద్ర ఎక్కడ?

ఎవరు ఎక్కడ పనిచేసేది తెలియని అయోమయం?




ప్రజాపక్షం/వైరా:వైరా మున్సిపాలిటీలో సుమా రు 114 మంది వర్కర్లు పనిచేస్తున్నారు. 14 జిఒలో 64మంది స్పెషల్ డ్రైవ్‌లో 50 మంది ము న్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొంతమంది సిబ్బంది విధులకు రాకుండా వారి వారికి బదులు మరొకరిని మున్సిపాలిటీలో విధులకు పంపించడం ఇక్కడ ఇష్టారాజ్యం అయిపోయింది. అంటే వైరా మున్సిపాలిటీలో ఏదైనా సా ధ్యమే అనేది వారి అభిప్రాయం, అసలు ఎవరు ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు. ఎవరికి బదులు ఎవరు విధులకు వస్తున్నారు. జీతాలు ఎవరు అకౌంటులో పడుతున్నాయి అనేది ఒక్కసారి ఆలోచించాలి. ఎందుకు అంటే ఇప్పటికే మున్సిపాలిటీ లో పనిచేసే కొంతమంది వారు విధులకు రా కుండా బయట పనులు చేసుకుంటూ వారికి సం బంధించిన వ్యక్తులను విధులకు పంపిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వైరా మున్సిపాలిటీలో గతంలో బయోమెట్రిక్ విధానం అమలు లో ఉంది. కాని ఇప్పుడు ఆ విధానం అమలులోనే లేదు బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నప్పుడు కూడా బయోమెట్రిక్ సమయానికి వచ్చి వేలిముద్ర వేసి పోతున్నారే తప్ప విధులు ఎక్కడ నిర్వహిస్తున్నారు అనేది ,ఎవరు ఎక్కడ తెలియని పరిస్థితి. మున్సిపాలిటీ నుంచి జీతాలు తీసుకునేటప్పుడు ఖచ్చితమైన నిబంధనలో పాటించాల్సిన బాధ్యత వారిపై లేదా, పనిచేసినోడు ఒకడు అ యితే జీతం పడేది వేరే వాళ్ల అకౌంట్లో. ఇది ఒక్కసారి అధికారులు గమనించాలి. అదేవిధంగా సుమారు 114 మంది వర్కర్లు ఉంటే మున్సిపాలిటీలో ఎక్కడ ఎవరు ఏ రోజు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారనేది పూర్తి డేటాను అమలు చేయలేకపోతున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీలో ఎవరు పేరు మీద ఎవరు ఉద్యోగానికి వస్తున్నారు అనే దానిని ఒక్కసారి రిజిస్టర్ తీసుకొని పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి.

## యువత చదువుతో పాటు క్రీడలల్లో రాణించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**యువత చదువుతో పాటు క్రీడలల్లోనూ రాణించలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి కృష్ణకాలనీలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాస్కెట్బాల్ టీం కు ఎమ్మెల్యే జీఎస్సార్ టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుండి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. చదువుతో పాటు యువత క్రీడలపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. త్వరలో గద్వాల లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా బాస్కెట్ బాల్ టీం ప్రతిభ కనబరిచి ప్రథమ స్థాయిలో నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తిప్పాల రాజేందర్ చల్లూరి మధు, ఇస్లావత్ దేవన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


## మరణించిన పోలీస్ కుటుంబాల భద్రతకు చెక్ అందజేత



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ పలు కారణాలతో గత సంవత్సరం మరణించిన, ఎస్. ఐ నర్సింహా రావు కుటుంబానికి 15లక్షల 92వేల, 134రూపాయలు, మరో హెడ్ కానిస్టేబుల్ శ్రీరామ్ రాజు కుటుంబానికి 15లక్షల 22 వేల 983 రూపాయలు భద్రత విభాగం మంజూరు చేసిన చెక్కులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా చెక్కును మరణించిన పోలీస్ అధికారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మరణించి పోలీస్ సిబ్బంది కుటుంబ స్థితిగతులపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు.

## పక్కాగా ఫీవర్ సర్వే

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం నుండి ప్రారంభమైన ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీబీ భారిన పడిన వారిని, వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. పరీక్షలను చేయాలన్నారు. వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. మలేరియా, డెంగ్యూ, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి తేజ, సూపర్వైజర్ రమేష్, ఇతర మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణగిరి వాసి వెంకటస్వామికి డాక్టరేట్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లాలోని నారాయణగిరి గ్రామానికి చెందిన వక్కల వెంకటస్వామికి విశిష్ట గౌరవంగా డాక్టరేట్ అవార్డు లభించింది. గత రెండు దశాబ్దాలకు పైగా ప్రజల సమస్యలను సమర్థవంతంగా వెలికి తీసే నిబద్ధతతో జర్నలిస్టుగా, సంపాదకునిగా పనిచేస్తూ సామాజిక హితాన్ని లక్ష్యంగా చేసుకొని సేవలందిస్తున్నారు. వెంకటస్వామి అనేక సంవత్సరాలుగా తనకు అందిన సమాచారాన్ని, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, అవినీతి, అక్రమాలపై స్పష్టమైన వైఖరితో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఆయన నిర్వహిస్తున్న పత్రిక, వార్తా వ్యవస్థలు నిస్వార్థంగా ప్రజల తరపున నిలబడి ధైర్యంగా సమస్యలను వెలికి తీయడంలో ముందుండుతున్నాయి.కేవలం జర్నలిజంతోనే కాక, "నా వివేకం" అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి అనాథలు, వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు తనవంతుగా సేవలందిస్తూ, తన సామర్థ్యాన్ని మానవత్వ సేవకే అంకితం చేశారు. విద్యా సామగ్రి, దుస్తులు, ఆహార సరఫరా సహా ఇతర అవసరాల విషయాల్లో సహకారం అందిస్తూ నిస్వార్థ సేవా మార్గంలో పయనిస్తున్నారు.ఒక పక్షపాత రహిత ప్రజాప్రతినిధిగా, సామాజిక సేవా పథంలో అగ్రగామిగా ఆయన చేసిన కృషికి గౌరవంగా లభించిన ఈ పురస్కారం ఆయన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని పలువురు అభినందించారు.

## కేయూ దూరవిద్య డిగ్రీ, పిజి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** 2025–26 విద్యా సంవత్సరానికి గాను కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యలో డిగ్రీ, పీజీ చేయటానికి నోటిఫికేషన్ జారీ చేసిందని ధర్మారంలోని ఎస్ ఎస్ డిగ్రీ కళాశాల దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చేయటానికి ఇంటర్ పాస్ అయిన వారు బీఏ, బీకాం,బీఎస్సీ,బిబిఏ, అర్హులు అని తెలిపారు. డిగ్రీ పాసైన వారు ఎంఏ, ఎం కామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్డబ్ల్యూ, ఎంపీఏ, బిఎల్ఐసి,ఎం ఎల్ ఐయస్సిలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే సంవత్సరం కాలంలో పూర్తిచేసే డిప్లమా కోర్సులకు డిగ్రీ పాసైన వారు కంప్యూటర్ అప్లికేషన్స్,గైడెన్స్ కౌన్సిలింగ్, యోగ,ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్, ఎన్విరానెంటల్ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్, రూరల్ డెవలప్మెంట్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్,డెవలప్మెంట్, కమ్యూనికేషన్ కోర్సులు, ఇంటర్ అర్హతతో ఆరు నెలలో పూర్తిచేసే సర్టిఫికెట్ కోర్సులు సిఎల్ ఐసి, లైఫ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, యోగ, కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్, ట్రైబల్ స్టడీస్,పీస్ స్టడీస్ అండ్ కాన్ఫ్లిక్ట్ మేనేజ్మెంట్,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్. పదవ తరగతి అర్హతతో మూడు నెలల్లో పూర్తిచేసే ఓరియంటేషన ప్రోగ్రామ్స్ లో మిమిక్రీ,కార్డియో పలమనరీ రి సస్ స్టేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, డాటా సైన్స్,బ్యూటీషియన్, మెహేంది డిజైన్, పేర్ని నాట్యంలలో దరఖాస్తు చేసికోవాలన్నారు వివరాలకు 99635 91463 నెంబర్ లో సంప్రదించాలన్నారు.

## ఉత్కృష్ట సేవా పథకానికి ఎంపికైన జనగామ డిసిపి రాజ మహేంద్రనాయక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:**2025 సం వత్సరానికి గాను ఉత్కృష్ట సేవా పథకానికి జనగామ డిసిపి రాజమహేంద్రనాయన్ ఎం పికయ్యారు. వివిధ సేవా రంగాల్లో ఇచ్చే ఈ సేవా పథకానికి రాజ మహేంద్రనాయక్ ఎం పిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిఐ దామోదర్రెడ్డిలో పాలు పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతు తాను ఉత్కృష్ట సేవా పథకానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా ప్రజలు, పోలీసులకు అభినందనలు తెలిపారు.

## డిప్యూటీ సిఎం, మంత్రులకు స్వాగతం పలికిన ఝాన్సీరెడ్డి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటిరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, సీతక్క, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిలు పర్యటించారు. హెలిప్యాడ్ వద్ద వారికి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి శాలువాతో ఆత్మీయంగా ఆహ్వానించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై నాయకులను ఘనంగా స్వాగతించారు.

## విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలి

జిల్లాలోని 118 ప్రభుత్వ విద్యా సంస్థల్లో 'స్ఫూర్తి కార్యక్రమం'

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** విద్యార్థుల్లో మానసిక దృక్పథాన్ని పెంపొందించడానికి స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆలోచనల మేరకు విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు గత విద్యా సంవత్సరం నుండి నిర్వహించడం జరుగుతున్నది. యూనిసెఫ్, యునెస్కో, డబ్ల్యూహెచ్ఓ, ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్న అంశాల ఆధారంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదచే ప్రత్యేకంగా స్ఫూర్తి కార్యక్రమం రూపొందించారి. స్ఫూర్తి కార్యక్రమాల్లో భాగంగా ఈ విద్యా సంవత్సరం విద్యార్థులలో జీవిత నైపుణ్యాలు, విద్యతో పాటు ఈవారం స్ఫూర్తి కార్యక్రమంలో ప్రత్యేకంగా ఆర్థిక అక్షరాస్యపై విద్యార్థుల్లో కల్పించేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 118 ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్యక్రమం నిర్వహించారు. జిల్లాస్థాయి, మండల ప్రత్యేక అధికారుల, సంబంధిత విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో అనుభవం కలిగిన విశ్రాంత అధ్యాపకులు, బ్యాంక్ అధికారులు, జర్నలిస్టులు స్ఫూర్తి కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థుల్లో ఎదురయ్యే సమస్యలు, పోటీ తత్వం, ఒత్తిడిలో సమయం స్ఫూర్తి తదితర అంశాలపై ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంచుకోవడంతో పాటు విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యత పై డబ్బులు ఎలా నిర్వహించాలో, బ్యాంకింగ్ వ్యవస్థ నిర్వహణ, బడ్జెట్ ఎలా వేయాలో, పొదుపు ఎలా చేయాలి, అప్పులు ఎలా తీర్చాలి, తెలివైన పెట్టుబడులు ఎలా పెట్టాలి, ఆర్థికంగా సురక్షితంగా ఉం డటానికి ఆర్థిక అక్షరాసత్య యొక్క ప్రాముఖ్యత ను వివరించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమాలో దుగ్గొండి మండలం నాచినపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొనగా, శంభునిపేట తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రాయపర్తి లోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, 13 మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాలలో పూర్తి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆర్థిక, అక్షరాస్యతతో పాటు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డి ఆర్ డిఓ కౌసల్యాదేవి, జడ్పిసిఇఒ రామిరెడ్డి, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ దాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, బరిగెల శివ, మండల ప్రత్యేక అధికారులు, ప్రాధానోపాధ్యాయులు, విశ్రాంత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు

సమ్మెలో సిపిఐ శ్రేణులు పాల్గొనాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, స్వతంత్ర సెక్టోరల్ ఫెడరేషన్లు, అసోసియేష న్ల వేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న బుధవా రం జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజాసేవల ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్ విధానాలు, కాంట్రాక్టరైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. కార్మిక వ్యతిరేకులకు వ్యతిరేకంగా శ్రామిక శక్తిని క్యాజువలైజేషన్ చేయడం, కార్మిక సంఘాల ఉద్యమా న్ని అణచివేయడం, నిర్వీర్యం చేయడం, పనిగంటలను పెంచడం, సామూహి క బేరసారాల హక్కు, సమ్మె హక్కు, యజమానులు కార్మిక చట్టాలను ఉల్లంఘించడాన్ని నేరంగా పరిగణించకపోవడం మొదలైన వాటి కోసం ఉద్దేశించిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, మంజూరైన పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని, మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలని, ఉపాధిహామీ కూలీలకు రోజులు, వేతనం పెంచాలని, పట్టణ ప్రాంతాలకు ఇదే తరహా చట్టం చేయాలని కార్మిక సం ఘాలు డి మాండ్ చేస్తున్నాయని, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల జాయింట్ ఫ్రంట్ ఈ సమ్మె చర్యకు మద్దతు తెలిపాయని తెలిపారు. తమ డిమాండ్ల కోసం, ట్రేడ్ యూనియన్ డిమాండ్లకు మద్దతుగా గ్రామీణ భారతదేశంలో భారీ ఉద్యమాలు చేయాలని నిర్ణయించినట్లు సిపిఐజాతీయ కౌన్సిల్ పేర్కొందని,కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లకు సిపిఐ కట్టుబడి ఉందని, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జూలై 9 న దేశవ్యాప్త సమ్మె చర్యను విజయవంతం చేసే కార్యక్రమాలలో పాల్గొనాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## సిపిఐ ఆధ్వర్యంలో వంటా వార్పు

వెంటనే గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మించాలని నిరసన



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ నుండి హుస్నాబాద్ వెళ్లె రోడ్డులోని గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ సిహెచ్ రాజారెడ్డి డిమాండ్ చేశారు. వాగుపై నిర్మాణం చేస్తున్న బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ నాయులు పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్ నాయకత్వంలో మంగళవారం నిరసన చేపట్టారు. ధర్నాతో పాటు వంటా వార్పు నిర్వయించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ నుండి నర్మెట మీదుగా హుస్నాబాద్ వెళెల ముఖ్యమైన ఆర్అండ్‌బి రోడ్డు నాగునుపహాడ్ వద్ద తెలిపోయి నిర్మాణానికి నోచుకోక నాలులైదు ఏండ్లు అవుతుందన్నారు. బ్రిడ్జీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లె పరిస్థితి లేదన్నారు. గతేడాది వర్షాల మూలంగా భారీ వరద రావడంతో హుస్నాబాద్ వెళ్లె వాహనాలకు గానుగుపహాడ్ గ్రామం నుండి మళ్లించారన్నారు. ఇటీవల కారు బోల్తా పడడంతో పాటు పలు ప్రమాదాలు జరిగాయన్నారు. కాంట్రాక్టన్ నిర్లక్ష్యం మూలంగా పనులు జరగడం లేదని, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వేసిన తరువాత విదిలేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి పనులు జరగడంలో నిర్లక్ష్యం జరుగుతుందని, ఇటీవల సిపిఐ బృందం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి సమస్యలే తక్షణమే పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జనగామ సిపిఐ మండల కార్యదర్శి చెల్లూరి మల్లేశం, నాయకులు తేజావత్ విజయ, పండుగ నిర్మల, యాదలక్ష్మి, పులి కృష్ణ, ఏఊదర వెంకటాద్రి, ఎం సుదర్శనం, గుగులోతు రాఘవులు, గొలనుకొండ నాగరాజు, కళ్యాణ లక్ష్మ య్య, సిద్దిరాములు, రెడ్డబోయిన వెంకటయ్యతో పాలు పలువురు పాల్గొన్నారు.

## కార్మిక వర్గ హక్కుల రక్షణ కోసమే సమ్మె

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోకపోతే మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదని, కేంద్రంలోని బిజెపి కూటమిమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్యలు కోరారు. మంగళవారం వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి దేశ కార్మిక వర్గాన్ని, పెట్టుబడిదారీ వర్గాలకు కట్టుబానిసలుగా మార్చేస్తుందని ఆరోపించారు. భారత ప్రభుత్వ సంస్థలను బడా కార్పొరేట్ దోపిడిదారులైన అంబానీ, ఆదానీలకు ఒక్కొక్కటి కట్టబెడుతున్నదని, మొత్తం ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న పరిశ్రమలలో 51 శాతానికంటే ఎక్కువ వాటా ఈ కార్పొరేట్ దోపిడిదారులకు అప్పచెప్పుతున్నదని వారు ధ్వజమెత్తారు. ఇదే కాక గ్రామీణ ప్రాంతాల్లో 60శాతం పైగా ప్రజలు ఆధారపడుతున్న వ్యవసాయరంగం కూడా ప్రైవేట్ దోపిడిదారులకు బహుళజాతి సంస్థలకు మోడీ ప్రభుత్వం అప్పజెప్పుతున్నదన్నారు. ఈ మధ్య కాలంలోనే నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చి గ్రామీణ ప్రజలను కూడా తమ భూముల్లోనే కట్టు బానిసలుగా చేయడమే మోడీ ప్రభుత్వ లక్ష్యమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటికార్యదర్శి రాచర్ల బాలరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి బా షుమియా, సిపిఎం జిల్లా నాయకులు సింగారపు బాబు, ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, ఆర్ఎస్‌పి పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా నాయకులు ఆరూరి కుమార్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ దండు లక్ష్మ ణ్, వల్లదాసు దుర్గయ్య, ఎండి బషీర్, మైదం పాణి, దడిగల సాంబయ్యలతోపాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి: సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:**కార్మికుల హక్కుల్ని హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుక వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, ఎఐటియుసి జనగామ జిల్లా గౌవర అధ్యక్షులు సిహెచ్ రాజారెడ్డి కోరారు. మంగళవారం ఆయనొక ప్రకటన చేస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా ప్రభుత్వం విభజించిందని, ఇది కార్మికుల హక్కుల్ని కాలరాయడమే అన్నారు. శాంతియుతంగా ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోకపోవడంతో సార్వత్రిక సమ్మెకు పిలుపును ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు నాలుగు కోడ్‌లను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కార్మికులపై ఆగడాలను అరికట్టడానికే సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఏటూరునాగారం సిపిఐ పార్టీ మండల మహాసభలు మంగళవారం గ్యాస్ గోడౌన్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, వ్యక్తులపై జిల్లా కార్యదర్శి పాల్గొని చర్చించారు. ఇట్టి సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని వారి సమస్యలపై మల్లికార్జునరావు చెప్పినటువంటి విషయాన్ని పూర్తిగా ఏకీభవించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి కమిటీలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా ఎండి నాసర్, కందగట్ల సత్యనారాయణ తదితరులని తొమ్మిది మందితో కార్యవర్గం, కౌన్సిలింగ్ ఎన్నుకున్నారు. ఈ సమావేవంలో సివిల్ సప్లయి కార్మికులు, గ్యాస్ గోడౌన్ కార్మికులు, ఏటూరునాగారంకు సంబంధించిన రైతు సంఘం నాయకులు తదితర గ్రామాల నుండి హాజరై ప్రస్తుతం జరుగుతున్నటువంటి కార్మికులపై ఆగడాలను అరికట్టాలని, ప్రస్తుతం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్నటువంటి 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే నెల ఆగష్టు 5వ తేదీన జరగబోయే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా మల్లికార్జునరావు కోరారు. అదే సందర్భంలో ప్రస్తుతం జరుగుతున్నటువంటి కగార్ ఏదైతే ఉందో దానిని నిలుపుదల చేసి మావోయిస్టులతో చర్చలు జరిపి, సమస్యలపై సానుకూలంగా స్పందించి వారికి విముక్తి కలిగించాలని కోరారు. . ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, కొమురయ్య, రాములు, ఎండినాస్కర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఆయిల్ ఫామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ఆయిల్ ఫామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ(ఫ్యాక్టరీ) నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ పంట సాగుపై, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్స్, పర్మిషన్స్, మౌలిక వసతుల కల్పన, కావాల్సిన ఏర్పాట్లపై వివరంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేపెడుతుందని తెలిపారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్ ఫామ్ పంట సాగుపై రైతులకు, అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఫామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంకు మించి సాధించానలి, లబ్దిదారుల ఎన్నిక, రైతుల నుండి దరఖాస్తాలను, రైతు వాటా సేకరణ, ప్లాంటేషన్ పూర్తి, మొదలగు పనులను, ఆయిల్ ఫామ్ కంపెనీ యుద్ద ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం లక్ష్యం 3వేల ఎకరాలు సాధించడానికి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేసి ఈ మొదటి సీజన్ లోనే 75 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారంలో బుధవారం, శనివారం గూగుల్ మీట్ ఏర్పాటు చేసి తద్వారా ప్రగతిని వివరించాలని, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయింపు, సంబంధిత అనుమతులు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు త్వరగా చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సిద్దార్థ రెడ్డి, డిఈఆర్‌డబ్ల్యూఎస్ వెంకట సతీష్, విద్యుత్ వాఖ డిఈ నాగేశ్వరరావు, కేవన్ బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ భవనం వేగవంతంగా పూర్తి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:**నిర్మాణంలో ఉన్న వసతి గృహాల ను నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సుభాష్ కాలనీలో నిర్మాణంలో ఉన్న బీసీ బాలురు, బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహ నిర్మాణ పనుల పురోగతిని పంచాయతి రాజ్ ఈఈని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఆలస్యానికి కారణాలు ఏమిటని కలెక్టర్ ప్రశ్నించగా మొత్తం 8 గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కలెక్టర్ గదులను ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల నాణ్యత, వేగంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా, వేగంగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ : కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు నమోదును ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) విధానంలో తప్పనిసరిగా చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ లోని బాసిత్ నగర్ ఉన్నత పాఠశాల, వడ్డేపల్లి లోని మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్సి), భవిత కేంద్రం(ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం)ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. బాసిత్ నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఎఫ్ఆర్ఎస్ విధానంలో విద్యార్థుల ముఖ గుర్తిం పు నమోదు, పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫాంల గురించిన వివరాలను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. మెనూ గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంట చేసేందుకు గ్యాస్ కనెక్షన్ తీసుకున్నారా అని నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తరగతులను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు తప్పనిసరిగా విద్యార్థుల నమోదు ఎఫ్ఆర్ఎస్ విధానంలో చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. వడ్డేపల్లి లోని మండల విద్యా వనరుల కేంద్రం( ఎంఆర్సి), ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం.. భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఎమ్మార్సీలో పనిచేస్తున్న సీఆర్పీల గురించిన వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు, కావాల్సిన వనరులు, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ వివరాలను ఎంఈవో నెహ్రూ, సీఆర్పీలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# క్రీడ



## వన్డే స్క్వాడ్‌లో నంబర్ 1 బౌలర్

### కెప్టెన్ బ్రంట్ ఫిట్..

స్వదేశంలో భారత మహిళల జట్టుతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వెనకబడిన ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. గాయంతో పొట్టి సిరీస్ చివరి మూడు మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా కోలుకోవడంతో వన్డే ఫైట్‌కు సిద్ధమవుతోంది ఆతిథ్య జట్టు. భారత జట్టుతో జరుగబోయే మూడు వన్డేల కోసం సెలెక్టర్లు మంగళవారం బలమైన స్క్వాడ్‌ను ప్రకటించారు. 15మందితో కూడిన బృందంలో నంబర్ 1 బౌలర్ ఎకిల్‌స్టోన్, బౌచర్ చోటు దక్కించుకున్నారు. పొట్టి సిరీస్ తదుపరి మ్యాచ్‌లకు దూరమైన నాట్ సీవర్ బ్రంట్ కోలుకొని ఫిట్‌నెస్ సాధించింది. ఆమె వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని ఆశిస్తున్నాం. టీ20లో భారత జట్టు అద్భుతంగా ఆడి మమ్మల్ని ఓడించింది. ఈ సిరీస్‌లో జట్టుగా మేము చాలా విషయాలు నేర్చుకున్నాం. వన్డే సిరీస్‌లో నిలకడగా ఆడడంపై మేము దృష్టి సారిస్తున్నాం అని ఇంగ్లాండ్ కోచ్ చార్లొట్టె ఎడ్వర్డ్స్ వెల్లడించింది.

టీమిండియా, ఇంగ్లాండ్‌ల మధ్య మూడు వన్డేల సిరీస్ సౌంథాంప్టన్ వేదికగా జులై 16న మొదలవ్వనుంది. 19న లార్డ్స్, 22న చెస్టర్ లీ స్ట్రీట్‌లో తదుపరి రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ రెండు మ్యాచుల్లో జయభేరి మోగించింది. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 5 వికెట్లతో గెలుపొంది సిరీస్‌లో నిలిచింది. నాలుగో టీ20 మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్‌లో జులై 9న, ఐదోది బర్మింగ్‌హామ్‌లో జులై 12న జరుగనుంది.

**ఇంగ్లాండ్ వన్డే స్క్వాడ్ :** నాట్ సీవర్ బ్రంట్(కెప్టెన్), ఎమ్ అర్లాట్ సోఫియా డంక్లే, ఎమ్మా లాంబ్, టమ్మీ బ్యూమంట్(వికెట్ కీపర్), అమీ జోన్స్(వికెట్ కీపర్), ఎమ్మా క్రాస్, అలిసే దేవిడ్‌సన్ రిచర్డ్స్, చార్లీ డీన్ సోఫీ ఎకిల్‌స్టన్ లారెన్ ఫైలెర్ మియా బౌచియర్, అలిసే క్యాప్సే, కేట్ లిన్సే స్మిత్, లారెన్ బెల్.

## వింబుల్డన్‌లో ఒత్తిడి.. భారత్–పాక్ మ్యాచ్ లాంటిది



### విరాట్ కోహ్లీ

క్రికెట్‌తో పోలిస్తే వింబుల్డన్ సెంటర్ కోర్టులోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అన్నారు. వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో భాగంగా జరిగిన జకోవిచ్ వర్సెస్ అలెక్స్ డీ మినార్ మ్యాచ్‌ను కోహ్లీ తిలకించాడు. అయితే ఆ సమయంలో మాజీ టెన్నిస్ ప్లేయర్, కామెంటేటర్ విజయ్ అమృత్‌రాజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ మాట్లాడారు. కిక్కిరిసిన స్టేడియంలో క్రికెట్ ఆడడం కన్నా.. వింబుల్డన్‌లోని సెంటర్ కోర్టులో టెన్నిస్ మ్యాచ్ ఆడడమే తీవ్ర వత్తిడిని కలిగిస్తుందని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. కేవలం ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లో ఉండే వత్తిడి మాత్రమే వింబుల్డన్ మ్యాచ్‌లతో పోల్చవచ్చు అన్నారు. ప్రేక్షులతో నిండిపోయిన స్టేడియంలో ఆడడం వత్తిడితో కూడుకున్నదే అని, కానీ వింబుల్డన్ సెంటర్ కోర్టులో ఆడితే ఆ వత్తిడి మరోలా ఉంటుందని కోహ్లీ చెప్పాడు. ఎందుకంటే టెన్నిస్ కోర్టులో ప్రేక్షకులు మరీ దగ్గరగా కూర్చుకుంటారని చెప్పారు. క్రికెట్‌లో మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ప్రేక్షకులు చాలా దూరంగా ఉంటారని, వాళ్ల కామెంట్లు మనకు వినబడవు. కేవలం బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు మాత్రమే ప్రేక్షకుల అరుపులు వినిపిస్తాయన్నారు. అక్కడ వ్యక్తిగత స్కిల్‌తో పెద్ద ఆటపై ప్రభావం ఏమీ ఉండదన్నారు. కానీ టెన్నిస్‌లో మాత్రం టెన్షన్ అంతా లైన్ మీదే ఆధారపడి ఉంటుందని కోహ్లీ అన్నాడు. బేస్ లైన్‌కు కాస్త అటు ఇటు పడినా ఫలితం మరోలా ఉంటుందన్నారు. టెన్నిస్‌లో ఆటగాళ్లకు వత్తిడి ఎక్కువగా ఉంటుందన్నాడు. ఇక సెంటర్ కోర్టులో ఆడే మ్యాచ్‌లకు ఆ ప్రెజర్ మరీ అధికంగా ఉంటుందన్నారు. ఆ అంశంలో టెన్నిస్ ఆటగాళ్ల పట్ల అమితమైన గౌరవం ఉందన్నాడు. వరల్డ్‌ప్‌లోని ఇండోపాక్ మ్యాచ్‌లు, లేదా సెమీస్, ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే తీవ్ర వత్తిడి ఉంటుందని, కానీ టెన్నిస్‌లో క్వార్టర్స్ నుంచే ఆ ఫీల్ ఉంటుందన్నారు.

## ‘రూట్’ వికెట్‌పై వివాదం.. నో బాల్ ప్రచారాన్ని తిప్పికొట్టిన ఎంసిసి



బర్మింగ్‌హామ్ టెస్టులో టీమిండియా చిరస్మరణీయ విజయంతో సిరీస్ సమం చేసింది. ఆద్యంతం ఇంగ్లాండ్‌పై పైచేయి సాధిస్తూ వచ్చిన టీమిండియాకు ఆకాశ్ దీప్ గెలుపు గుర్రమయ్యాడు. ఇన్‌స్వింగర్‌తో డేంజరస్ జో రూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్. అతడి వికెట్‌తో ఇంగ్లాండ్ కోలుకోలేకపోయింది. అయితే.. రూట్ వికెట్‌పై మీడియాలో రాద్ధాంతం మొదలైంది. ఆకాశ్ నో బాల్ వేశాడని, అసలు రూట్ ఔటే కాదనే చర్చ ఊపందుకుంది. ఇంగ్లాండ్ మాజీ ఆటగాళ్లు కూడా అవునంటూ గొంతుకలిపారు. సోషల్ మీడియాలో ముదురుతున్న ఈ వివాదంలో అర్థం లేదని పేర్కొన్న మెరిలెబోనే క్రికెట్ క్లబ్.. ఆకాశ్ వేసిన బంతి సరైనదేనని స్పష్టం చేసింది.

అసలేం జరిగిందంటే.. ఐదో రోజు తొలి సెషన్ పదో ఓవర్లో ఆకాశ్ సంధించిన రెండో బంతిని అడ్డుకోలేక రూట్ క్లీన్ బౌల్డయ్యాడు. ఇన్‌స్వింగ్ అయిన బాల్ వికెట్లను గిరాటేయడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. కానీ, ఆ తర్వాత ఫుటేజ్‌లో ఆకాశ్ కాలు క్రీజులోని వెనక గీతకు అవతల ఉన్నట్టు కనిపించింది. దాంతో, అది బ్యాక్ ఫుట్ నో బాల్ అని, అంపైర్ గుర్తించకపోవడం వల్ల రూట్ బలయ్యాడని వార్తలు వైరలయ్యాయి. ఈ విషయంపై ఎంసీసీ స్పందిస్తూ ఆకాశ్ సరైన బంతినే వేశాడని అంది.

# ఫోకస్ మహిళ



## ఆరోగ్య సమస్యలు ఎన్నో!

మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ఎన్నో... వీటిలో కొన్ని స్వయంకృతాలు కూడా. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం... బాధ్యతల పేరుతో పట్టించుకోకపోవడం... వైద్య నిపుణులను సంప్రదించకపోవడం.... తాత్కాలిక ఉపశమనం కోసం సొంత వైద్యం.. ఇలా ఎన్నో కారణాలు మహిళల ఆరోగ్యాన్ని మరింత దిగజారుస్తున్నాయి. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నా, వారి ఆరోగ్యం మాత్రం చాలాసార్లు నిర్లక్ష్యం చేయబడుతోంది. కుటుంబ బాధ్యతలు, సామాజిక ఆంక్షలు, ఆర్థిక పరిమితులు, శారీరకమానసిక ఒత్తిళ్లు, ఆరోగ్యంపై అవగాహన లోపం వంటి అనేక కారణాల వల్ల మహిళలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అమ్మాయి రజస్వల అయింది మొదలు సమస్యలు పెరగడం తరచు చూస్తునే ఉన్నాం. మెనోపాజ్ వరకు అనేక గైనకాలజికల్ సమస్యలు తప్పడం లేదు. వీటిలో డిస్మెనోరియా (తీవ్రమైన బలహీనత, పొట్ట నొప్పి, వాంతులు), మెనోరేజియా (ఎక్కువగా, ఎక్కువ రోజులు రక్త స్రావం) వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. ఎక్కువగా యువతుల్లో కనిపించే సమస్య పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒ). ఇందులో హార్మోన్ల అసమతుల్యత, మెన్స్ తారుమారవడం, మొటిమలు, శరీరబరువు పెరగడం మొదలైనవన్నీ ఉంటాయి. వీటికితోడు గర్భధారణ సంబంధిత సమస్యలు కూడా వెంటాడుతుంటాయి. గర్భధారణ జరగకపోవడం, ఆలస్యం కావడం తదితర సమస్యలు చుట్టుముడతాయి. గర్భధారణ సమయంలో రక్తపోటు, డయబెటిస్, టైఫాయిడ్, న్యూట్రీషన్ లోపం వంటివి తల్లికి, శిశువుకి హానికరమవుతాయి. ప్రసవానంతర కాలంలో శరీర బలహీనత, నిద్రలేమి, డిప్రెషన్ మొదలైనవన్నీ అత్యంత ముఖ్యమైన సమస్యలు. రుతుస్రావం పూర్తిగా ఆగిపోయే దశ (మెనోపాజ్)లో హార్మోనల్ మార్పులు, ఎముకల బలహీనత, మానసిక అస్థిరత, యూరినరీ ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇంతేకాదు, మహిళలు తరచూ మానసిక ఒత్తిడికి గురవుతారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పిల్లల భవిష్యత్తుపై భయాలు, ఉద్యోగ ఒత్తిడి లాంటివి కారణాలుగా ఉంటాయి. పుట్టిన పిల్లవాడిని చూసుకోవడంలో వచ్చే ఒత్తిడి, నిద్రలేమి, హార్మోనల్ మార్పులు వల్ల తల్లులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటారు. తల్లి, భార్య, ఉద్యోగి, కుమార్తె వంటి అన్ని పాత్రలనూ సమతుల్యత నెరపాలని ప్రయత్నిస్తూ శారీరకమానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, అమ్మాయిగా పుట్టింది మొదలు, చివరి శ్వాస విడిచేవరకూ ఏదో ఒకరమైన ఆరోగ్య సమస్య వెంటాడుతునే ఉంటుంది. అనేకానేక కారణాలతో చాలా మంది తమ ఆరోగ్య సమస్యలను వెల్లడించకపోవడం కష్టాలను పెంచుతున్నది. సిగ్గు, మొహమాటం, సామాజిక కట్టుబాట్లు, స్వయం ప్రకటిత నియమాలు.. ఇలా లెక్కలేనని సంకెళ్లు తగిలించుకున్న మహిళ స్వేచ్ఛగా ముందుకొచ్చి, సమస్యలను వివరించి, చర్చించి, తగిన వైద్య సేవలు పొందడం ఒక్కటే ఏకైక పరిష్కారం.

## జస్టిస్ అమరేశ్వరి



(జులై 10న జయంతి)

భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ కోనమనేని అమరేశ్వరి (జులై 10, 1928–జులై 25, 2009) యావత్ మహిళాలోకానికి మార్గదర్శకురాలు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది మహిళల న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా ఎదుగుతున్నారు. సుప్రీం కోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా 2027లో జస్టిస్ బివి నాగరత్న పదవీ స్వీకారం చేయనున్నారంటే, అందుకు మార్గాన్ని నిర్దేశించిన ఘనత జస్టిస్ అమరేశ్వరికే దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10వ తేదీన జన్మించిన అమరేశ్వరికి 14వ ఏటనే వివాహం జరిగింది. అయినప్పటికీ, చదువుకోవాలన్న ఆమె పట్టుదలకు, భర్త ప్రోత్సాహం కూడా లభించడంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు నుండి రాజకీయ శాస్త్రం, చరిత్రలో 1948 సంవత్సరములో ఎంఎ పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్రంలోనూ పట్టా తీసుకొని, మద్రాసు ఉన్నత న్యాయస్థానములో న్యాయవాదిగా పనిచేశారు. 1960–1961లో బార్ కౌన్సిల్ సభ్యురాలిగా వ్యవహరించారు. 1978, ఏప్రిల్ 29వ ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా నియమితులై, దేశంలోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990లో పదవీ విరమణ చేశారు. భారత మహిళా న్యాయవాదుల సంఘానికి ఉపాధ్యక్షురాలిగా, ఆంధ్ర ఉన్నత న్యాయస్థానంలోని న్యాయవాదుల సంఘానికి ఉపాధ్యక్షురాలిగా సేవలు అందించారు. ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకం.

## సామాన్య లక్షణం ‘అనీమియా’



మహిళల్లో చాలా ఎక్కువగా కనిపించే లక్ష్యణం రక్తహీనత లేదా అనీమియా. ఇనుము, విటమిన్ బి12 లోపంతో ఈ సమస్య ఎదురవుతుంది. ఇది ముఖ్యంగా పేద మహిళలలో ఎక్కువగా ఉంటుంది. అలసట, శ్వాసకోశ సమస్యలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే అనీమియాగా అనుమానించి, తగిన వైద్య సేవలు పొందాలి. కాగా, మహిళల శరీరం గర్భధారణ, బాల్యం పోషణలో కాల్షియాన్ని ఎక్కువగా వినియోగిస్తుంది. ఫలితంగా కల్షియం శరీరంలో తగు పాళ్లలో లేకపోవడం వల్ల ఎముకల బలహీనత, కీళ్ల నొప్పులు వస్తాయి. ప్రోటీన్, మైక్రోన్యూట్రియంట్ల లోపం కూడా మహిళల్లో ఎక్కువ. విటమిన్ ‘డి’, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాల లోపం వల్ల శరీరం బలహీనపడుతుంది. కాగా, మారుతున్న జీవన శైలిలో భాగంగా ఊబకాయం సాధారణ సమస్యగా మారింది. హార్మోనల్ అసమతుల్యత, అధిక ఫాస్ట్ ఫుడ్ వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం కారణంగా ఊబకాయం పెరుగుతోంది. ఇది ఇతర అనారోగ్యాలకు ద్వారమవుతోంది. టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు సమస్యలు 35 ఏళ్ల తరువాత బాగా కనిపిస్తాయి. హైపోథైరాయిడిజమ్, హైపెర్‌థైరాయిడిజమ్ అనే రెండు రకాల థైరాయిడ్ సమస్యల వల్ల మహిళల్లో బరువు పెరగడం, చర్మం పొడిబారడం, మానసిక ఒత్తిడి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అవగాహన లోపం వల్ల గర్భస్రావం, గర్భాశయ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక రీతిలో ఎదురవుతున్న లైంగిక హింస మహిళల మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు చూపుతున్నది. అనధికార గర్భస్రావాల వల్ల ఎంతో మంది మహిళలు ప్రాణాలను కోల్పోతున్నారు. పేద మహిళలకు సురక్షితమైన ప్రసవ, గర్భనిరోధక పద్ధతులపై అవగాహన లేదు. మహిళలలో గుండె పోటు లక్షణాలు పురుషులకంటే భిన్నంగా ఉంటాయి. ఈ లక్షణాలను గుర్తిండం కష్టం. శరీరంలో నీరసం, శ్వాసతీవ్రత, ఛాతీ గడ్డలు ఉంటే, ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. కాగా, బ్రెస్ట్ కేన్సర్ ఎక్కువగా మధ్యవయసు దాటిన వారిలో కనిపిస్తుంది. రెగ్యులర్ స్క్రీనింగ్, సెల్ఫ్ ఎగ్జామినేషన్ ద్వారా ముందుగా గుర్తించడం ముఖ్యం.

# పేదల సమస్యలే ఎజెండా

### ఎర్ర జెండా స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కారేపల్లి :** పేద ప్రజల సమస్యలే కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ఎజెండా అని, శత వసంతాల జరుపుకుంటున్న ఎర్రజెండా స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ కారేపల్లి మండల 17వ మహాసభ మంగళవారం మాదారం గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పాపినేని వెంకయ్య కప్పెర వేదాద్రి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. మహాసభ సందర్భంగా సిపిఐ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల పోరాటాలకు నాయకత్వం వహించేదే కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. అటువంటి కమ్యూనిస్టు పార్టీలను లేకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. అమాయక ఆదివాసీలను ఆపరేషన్ కాగార్ పేరుతో ఎన్‌కౌంటర్‌లు చేయడం దారుణమన్నారు. తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీలను లేకుండా చేయటం ఎవరి తరం కాదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు ఐక్యంగా ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా కనుసైగల్లో మోదీ తన ప్రభుత్వం నడిపే విధానాన్ని వ్యతిరేకించాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు మాట్లాడతూ హిందుత్వ ముసుగులో దేశం అభివృద్ధికి దూరమవుతుందన్నారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి ఆ వర్గాలను విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఇప్పటికే దేశంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి వాటిని అమలు చేసే ప్రయత్నం జరుగుతుందని, దీంతో కార్మిక వర్గం వారి కనీస హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, అందుకు వ్యతిరేకంగా జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం 47 మందితో సిపిఐ కారేపల్లి మండల నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. 17మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది. సిపిఐ మండల అధ్యక్షుడిగా పాపినేని సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా బానోత్ దళ్‌సింగ్, చెన్నంశెట్టి బూసయ్య ఎన్నికయ్యారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామాలక్ష్మి, సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, ఏఐటియుసి డోలమైన్స్ ప్రధాన కార్యదర్శి ఈరు నాయక్, గౌరవ అధ్యక్షుడు కొల్లి వీరయ్య, పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాపినేని సత్యనారాయణ, చెన్నంశెట్టి భూషయ్య, బట్టు సంగయ్య, తాత వెంకటేశ్వర్లు, బొమ్మల కృష్ణ, మేదరమట్ల ప్రేమ్‌చంద్, పోతనబోయిన రవి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

### 15న దేవరకొండలో సిపిఐ జిల్లా మహాసభ : జిల్లా కార్యదర్శి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** కేంద్రంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న పది కేంద్ర కార్మిక సంఘాలు 17డిమాండ్స్‌తో చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందన్నారు. సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక మగ్దూమ్ భవనంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పల్లా వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులపైన దాడి తీవ్రతరం చేసిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తుందని ఆరోపించారు. కార్మికులు చేపట్టిన సార్వత్రిక సమ్మెతోనైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో సిపిఐ గ్రామ, మండల మహాసభలు విజయవంతంగా పూర్తి చేసుకొని ఈనెల 15వ తేదీన దేవరకొండ పట్టణంలో నల్లగొండ 23వ జిల్లా మహాసభ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధి, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రజా ఉద్యమాలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఐ అనేక దఫాలుగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత పాలకులు చేసిన నిర్లక్ష్యం వల్లనే జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయడం కోసం పనులు ప్రారంభించిందని, అట్టి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు అధిక స్థానాలు గెలుపొందేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడింగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు, బొల్గురి నరసింహ, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, ఉజ్జిని యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల డిక్లరేషన్ అమలెప్పుడు?



### అంబేద్కర్ అభయహస్తం కోసం విధి విధానాలు విడుదల చేయాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు పూర్తవుతున్న చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ఎందుకు అమలుకు నోచుకోవడం లేదని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంబేద్కర్ అభయ హస్తం కోసం విధివిధానాలు తక్షణమే రూపొందించాలని. ఆయన డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ 3వ మహాసభలు శివనగర్‌లో సంఘీ ఎలేందర్, తాళ్లపల్లి జాన్ పాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దళితల కోసం చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ హామీ ఇచ్చారని హామీ అమలులో నిర్లక్ష్యం చేస్తురన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం కోసం రూ.2000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రకటించారని, కానీ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులలో బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఎస్‌సి కార్పోరేషన్ రుణాలు తక్షణమే వాటిని విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషి మియా, పనస ప్రసాద్, డిహెచ్‌పి ఎస్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూములు కాపాడండి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అన్యాక్రాంతమైన భూదాన్, అసైన్డ్ భూములను కబ్జా కోరుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్‌లో సిపిఐ ఫరూఖ్‌నగర్ మండల 6వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో భూదాన్, అసైన్డ్, గైరాన్ వంటి ప్రభుత్వ భూములు వేల ఎకరాలు ఉన్నాయని, వాటిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ వంద ఏళ్ల శత జయంతి ఉత్సవాలను రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా, గ్రామ, పట్టణ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లా వ్యాప్తంగా భూ పోరాటాలు నిర్వహించి ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలకు గుడిసెలు వేయించి భూ పోరాటం చేస్తామన్నారు. సభలో ఫరూఖ్‌నగర్ మండల సిపిఐ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా లింగం నాయక్, సహాయ కార్యదర్శిగా పవన్ చౌహాన్, రమేష్‌తోపాటు 9మంది కార్యవర్గ సభ్యులుగా, 21మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్టు జంగయ్య తెలిపారు. మహాసభలో మండల నిర్మాణ బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, ప్రజాసంఘాల నాయకులు చంద్రబాబు, గోవింద్ నాయక్, రమేష్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులే





### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కరకగూడెం :** ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. కరకగూడెం మండలం కేంద్రంలో మంగళవారం సిపిఐ మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య హాజరయ్యారు. ఈసందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో మన ప్రాతినిధ్యం ఉండే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని పార్టీ నాయకులను కోరారు. కేంద్ర ప్రభుత్వం 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరుస్తుందని, దానికి వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. గిరిజన నాయకులు గిరిజనులను నిర్ల క్ష్యం చేస్తూ వారికి అభివృద్ధి ఫలాలు అందకుండా చేస్తున్నారన్నారు. ఆదివాసి గ్రామాలలో అభివృద్ధికి ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. అనంతరం మహాసభలో 12 మందితో సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కరకగూడెం మండల కార్యదర్శిగా వంగరి సతీష్, సహాయ కార్యదర్శులుగా బోడ ముత్తయ్య, బుడుగం సతీష్, కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. మూడోసారి మండల కార్యదర్శి ఎన్నికైన వంగరి సతీష్ ను జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు అభినందించారు. సమావేశంలో ఉన్న లక్ష్మీ కుమారి, సరేందర్‌రెడ్డి పుల్లారెడ్డి, మండలంలోని వలస ఆదివాసీలు నాయకులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన



ప్రజాపక్షం/నిజాంసాగర్ : నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామం లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ రోహిత్ గ్రామస్థులకు అవగాహ న కల్పించారు. వారు గ్రామంలో అన్ని కాలనీలను తిరిగి ప్రజలకు డెంగ్యూ వ్యాధి రావడానికి గల కారణాలు, వ్యాధి లక్షణాలు, వ్యాధి వస్తే పాటించవలసిన ఆరోగ్య సూత్రాలు తదితర విషయాలను గ్రామస్థులకు తెలియజేయడమే కాకుండా ఇంటి పరిసరాలు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధి వ్యాపించకుండా తగు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
జెఎసి నాయకుల డిమాండ్



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జెఎసి నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి 1, వర్క్‌షాప్, ఉపరితల గనుల్లో నిర్వహించిన ద్వార సమావేశాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాల పేరుతో కొట్టివేస్తోందని, లేబర్ కోడ్‌లు అమలయ్యే పరిస్థితిలో పని గంటలు 8 నుండి 12కు పెరిగే ప్రమాదం ఉందని, ఇది కార్మికులపై తీవ్రమైన పని భారాన్ని మోపుతుందని మండిపడ్డారు. కనీస సౌకర్యాలు, సమ్మె హక్కు, సంఘాల ద్వారా సమస్యల పరిష్కారానికి అవకాశం లేకుండా చేసే విధంగా ఈ చట్టాలు రూపొందించబడ్డాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కార్మికులు ప్రాణాలు అర్పించి సాధించిన హక్కులను కేంద్రం విచక్షణ లేకుండా తాకట్టు పెడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని, ఈ చట్టాలు రద్దయ్యేంత వరకు పోరాటాలు కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, గరిగే స్వామి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, గుల్ల బాలాజీ, చంద్రశేఖర్, టిబిజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెతో కేంద్రానికి గుణపాఠం



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నందున, దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని కేంద్రానికి గుణపాఠం చెప్పాలన్నారు ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం గోలేటి బ్రాంచ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిల్లా నర్సయ్య, బ్రాంచ్ సహాయ కార్యదర్శి సాగర్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందని విమర్శించారు. సింగరేణికి బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కనీస పెన్షన్ రూ.10,000గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సిఎంపిఎఫ్ వివరాలను వెంటనే వెల్లడించాలన్నారు. 2022లో జరిగిన సమ్మె సమయంలో కుదిరిన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని, లాభాల్లో భాగస్వామ్యం కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ కార్మికులతో సమానంగా చెల్లించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయకపోతే, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గుగులోత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


## నేటి సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్ టౌన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం రోజు దేశవ్యాప్తంగా జరుగనున్నసార్వత్రిక సమ్మెకు ఆదిలాబాద్ జిల్లాలో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ రోజు సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,కార్మికుల హక్కులను కాలరాస్తున్న జీవో 282 ను తక్షణమే రద్దు చేసిఇ,యథావిధిగా 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా నాలుగు కోట్ల మంది కార్మికులను విభజించిన చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ సమ్మెలో దేశావ్యాప్తంగా దాదాపు 40 నుండి 50 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని ఆయన అంచనా వేశారు.ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాలో సిపిఐ పార్టీ ఈ సమ్మెకు మద్దతు పలుకుతుందని,ఆదిలాబాద్ పట్టణంలో కూడా రేపు ఉదయం 10 గంటలకు సిపిఐ జిల్లా కార్యాలయానికి మద్దతుగా సిపిఐ శ్రేణులు హాజరు కావాలని ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి జిల్లా ఎస్ఆర్ఎన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

ప్రజాపక్షం/అల్లాదుర్గం : ఆయిల్ పామ్ పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారని, లీవ్ ఫామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైజర్ వైఎస్ రంగనాయకులు అన్నారు.. అల్లాదుర్గం రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ, ఈ పంట సాగు చేసి నాలుగు సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు ఆదాయం వస్తూ ఉంటుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సాగుకు సబ్సిడీలు ప్రకటించారని, అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 100 బిసి రైతులకు 90, ఇతరులకు 80 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఈ పంటకు చిడ పీడ పురుగుల బాధ తక్కువని, ఈ పంట సాగు వల్ల అధిక దిగుబడి పొంది రైతులు లాభాలు వచ్చేఆస్కారం ఎక్కువగా ఉంటుందని ఇప్పటివరకు జిల్లాలో వేయి ఎకరాలలో ఈ పంట సాగు చేయడం జరిగిందని ఆయా మండలాల రైతులు ఆయిల్ పంటపై నమ్మకంగా ఉన్నారని వచ్చే కొన్ని ఏళ్లలో ఈ పంట సాగు విస్తీర్ణం పెరిగే ఆస్కారం ఉందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, విస్తీర్ణ అధికారాలు నవీన్, అమృత్, రాజు, లీవ్ ఫామ్ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, తదితరులు ఉన్నారు.



# ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యం
సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్



ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : జిల్లాలోని ప్రజాసంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, సంఘంలో సభ్యత్వ నమోదు, మండల కమిటీలు, జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా సిపిఐ పార్టీ కార్యాలయంలో పార్టీకి అనుబంధంగా ఉన్న ప్రజాసంఘాల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజాసంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి సంఘంలో సభ్యత్వ నమోదు, మండల కమిటీలు, జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం కావాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమ కార్యాచరణ చేపట్టి స్పష్టమైన పోరాటాలను నిర్వహించాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రజాసంఘాలు సిద్ధంగా ఉండాలనిని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాస్, దాగం మల్లేష్, ప్రజాసంఘాల నాయకులు ఎఐటియుసి, డిహెచ్‌పిఎస్, బికెఎంయూ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, ఎఐకెఎస్, పిఎన్ఎం, బిసి సాధన సమితి, గిరిజన సమాఖ్య సంఘాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు.



## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు
నిజామాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం సుధాకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అడవులలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తుందని వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మే, జూన్ నెలలో సిపిఐ గ్రామ, మండల మహాసభలు జయప్రదం చేసుకుని ఈనెల 19న సిపిఐ జిల్లా మహాసభ ప్రగతి మున్నూరుకాపు సంఘం మీటింగ్ హాల్‌లో జరుగుతుందని ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి కా॥అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ హాజరవుతారన్నారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించబడం జరుగుతుందన్నారు. ఈ మహాసభకు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శులు, మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు సురేష్, అలీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకు 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట
నూతన ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటు :ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలతో పాటు పలు గ్రామాలలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనీ ప్రజ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పట్టణంతో పాటు భాదన్ కుర్తి గ్రామంలో నూతన ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రలను ప్రారంభించారు. అనారోగ్యంతో వచ్చే బాధితులకు ఎప్పటికప్పుడ చికిత్స చేయాలని ఉప కేంద్రంలో ఉన్నటువంటి సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, అనారోగ్యం భారిన పడిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ హాస్పిటల్ లలోనే వైద్యం చేయించుకోవాలన్నారు.అదే విధంగా ఎంపిడిఒ కార్యాలయంలో షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎంపిడిఒ, ఎమ్మార్వోతో కలిసి నూతనంగా పెళ్లి అయిన వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆడపిల్లల పెళ్ళికి అవసరమైనటువంటి డబ్బులు షాదిముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా మస్కాపూర్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు.మనిషి మనుగడకి చట్లు ఎంతో ఉపయోగపడతాయని, స్వచ్ఛమైన గాలిని, మనుషుల కోసమే ఆహారాన్ని అందించే మొక్కలేని, అటువంటి మొక్కల్ని ప్రతి ఒక్కరు విధిగా తమ ఇళ్లలో నాటుకోవాలని,ప్రాణావాయువు అందించే మొక్కలకు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి నిర్వహించి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిని నిర్మించిన మహోన్నత వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ఎంతగానో పాటుపడిన వ్యక్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్,వైస్ చైర్మన్ మజీద్, ఎమ్మార్వో సుజాత, ఎంపిడిఒ, సునీత, స్పెషలా ఫీసర్ జీవరత్నం, ఎంపిఒ రత్నాకర్ రావు,టెక్నికల అసిస్టెంట్ రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్,పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్,మాజీ మున్సిపల చైర్మన్ రాజురా సత్యం, మాజీ ఎంపిటిసి శంకర్,నాయకులు గంగా నరసయ్య, తోట సత్యం, షౌకత్ పాషా,అమనులా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ గంజ్ రిటైల్ కూరగాయల వర్తకుల సమస్యలు పరిష్కరించాలి
ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : గాంధీ గంజ్‌లో రిటైల్ కూరగాయ ల వర్తకులకు క్రయ, విక్రయాలకు అనుగుణంగా నూతన షెడ్డు నిర్మించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్టెక్ యార్డు ఆధీనంలోని గాంధీ గంజ్‌లో ఉన్న సమస్యలు పరిస్కరించాలని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ముప్ప గంగారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ యార్డు రికార్డులో కూరగాయవర్తకుల పేర్లు నమోదు చేసి అద్దె వసూలు చేయాలని, వర్షాకాలంలో మార్కెట్ యార్డులో మురుగునీరు సమస్యను పరిస్కరించాలని, ప్రైవేటు వ్యాపారస్తులు కూరగాయల వర్తకుల దగ్గర వసూలు చేస్తున్న అక్ర మ డబ్బుల వసూళ్లను ఆపాలని, గాంధీ గంజ్ లోపల మార్కెట్ యార్డు పరిసరాలు చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని తదితర డిమాండ్లపై వినతి పత్రం అందజేశారు. పైసమస్యలపై సానుకూలంగా స్పందించిన ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ రిటైల్ వర్తకుల సంఘం అధ్యక్షులు బి.లింగం, ప్రధాన కార్యదర్శి కండ్లకోయ ప్రసాద్, నాయకులు సత్యనారాయణ, సలీం, గోవర్ధన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల లక్ష్యా సాధన కోసం
# నిరంతర పర్యవేక్షణ జరపాలి
జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/బోధన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యా సాధ న కోసం నిరంతర పర్యవేక్షణ జరపాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం బో ధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోధన్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బోధన్ మున్సిపల్ కార్యాలయంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో లక్ష్యాల సాధన కోసం నిరంతర పర్యవేక్ష ణ జరపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్‌ల జారీ తదితర అంశాలపై సమీక్షించారు. వార్డు వారీగా ఆయా కార్యక్రమాల అమలు తీరును, సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. పేదలకు సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ఉదాత్తమైన ఆశయంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అలసత్వానికి తావు లేకుండా లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఇళ్లను నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టే విషయంలో లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లబ్ధిదారులకు అవసరమైన తోడ్పాటును అందించాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఆర్థిక స్థోమత లేని వారికి మెప్మా ద్వారా రుణాలు ఇప్పించాలని, వాటిని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం వినియోగించేలా పకడ్బంది పర్యవేక్షణ జరపాలన్నారు. మరల జరిపే సమీక్ష సమావేశం కల్లా ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. ఆయా వార్డులలో నెలకొని ఉన్న పరిస్థితులపై వార్డు ఆఫీసర్లకు పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలుగుతారని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. వర్షకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన ప్రొసిడింగ్‌లు అందించాలని, అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు.

## కార్మిక సంక్షేమం, వైద్య, విద్యా రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలి
డైరెక్టర్ (పా)ను కలిసిన ఐఎన్‌టియుసి నాయకులు

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కార్మిక సంక్షేమం, వైద్య, విద్యా రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని, సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును ఐఎన్‌టియుసి నాయకులు కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటనలో భాగంగా ఆర్‌కె న్యూటెక్ గనిని తొలిసారిగా సందర్శించిన సింగరేణి డైరెక్టర్ (పా)గౌతమ్ పోట్రును ఐఎన్‌టియుసి కేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు నేతృత్వంలోని ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, నస్పూర్ కాలనీలోని 3662 క్వార్టర్స్ సముదాయంలోని డిస్పెన్సరీని అన్ని ఆధునిక వసతులతో కూడిన 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, తద్వారా కార్మికులకు తక్షణ వైద్యం అందుబాటులోకి రానుందని తెలిపారు. అలాగే, సింగరేణిలోని పాఠశాలలు ఆదరణ కోల్పోవడం వల్ల కార్మికుల పిల్లలు ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆధారపడాల్సి వస్తోందని, ఇది వారి కుటుంబాలకు ఆర్థిక భారం అవుతోందని వివరించారు. అందుకే పాఠశాలల ఆధునీకరణ, తగిన ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు, కాలనీల నుండి బస్సు రవాణా సౌకర్యం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్‌కె న్యూటెక్, ఉపరితల బొగ్గు గనులను సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు ఏరియా జిఎం ఎం. శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్‌కె న్యూటెక్ గనిలో మొక్కలు నాటి, అనంతరం భూగర్భ గనిలో బొగ్గు ఉత్పత్తి పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పని స్థలాల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై అధికారులను, ఉద్యోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (పా) మాట్లాడు తూ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్. సత్యనారాయణ, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు కె. వెంకటేశ్వర రెడ్డి, గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, మేనేజర్ ఐ. శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, రక్షణాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
విద్యా బోధన, వసతి,పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : కంది మండలంలోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ విద్యార్థుల వసతులు ,ఆహార నాణ్యత, పరిశుభ్రత ,విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ హాస్టల్ గదులను పరిశీలించారు. మెనూ బోర్డు ప్రదర్శనను తిలకించారు. అనంతరం కిచెన్ షెడ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆ సమయంలో వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి ముచ్చటించారు. డైనింగ్ టేబుల్ వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులను ఆప్యాయంగా పలకరించిన కలక్టర్ ఆహారం రుచి ఏలా ఉందని ప్రశ్నించారు. సమయానికి భోజనం అందుతుందాఅని తెలుసుకున్నా. మేను ప్రకారం భోజనం అందిస్తున్నారా వంటి ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నా. తరువాత తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. గురుకుల పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలు అవసరాలపై కూడా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు అవసరమైన భోదన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్యపరంగా విద్యార్థులపై తగిన శ్రద్ద తీసుకోవాలని కలెక్టర్ ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమేనని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజ, గురుకుల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అధికారులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అవసరాలకు
# సరిపడినంత ఇసుక అందుబాటులో
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అవసరాలకు సరిపడినంత ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇసుక లభ్యత, వివిధ నిర్మాణాలకు ఇసుక సేకరణ,ఇసుక అక్రమ రవాణా నియంత్రణ,భూ భారతి చట్టం,సిఎంఆర్ డెలివరీ,రేషన్ కార్డులు,తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ, వచ్చే సంవత్సరం మార్చి నెల వరకు వివిధ ప్రభుత్వ నిర్మాణాలకు అవసరమగు ఇసుక అంచనా అవసరాల నివేదికలను పంపాలన్నారు.త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక బజార్‌లను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ విధానంలో విక్రయాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ఇసుక విక్రయాల విధానం అమలుతో ఇసుక సేకరణలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించి ఇసుక నిల్వ ఉంచుటకు తహసిల్దార్లు స్థలాలను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ నిర్మాణాలలో వినియోగించే గ్రానైట్,ఇతర మెటీరియల్ సేకరణకు జీరో పర్మిట్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.జీరో పర్మిట్ అర్హత పొందేందుకు సంబంధిత గుత్తేదార్లు తప్పనిసరిగా ఎండిఎల్ లైసన్సు పొందాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కొరకు అవసరమగు ఇసుకను లభ్యంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భూభారతి చట్టం అమలుపై తహసీల్దారులతో సమీక్షించారు.మండలాల వారిగా భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు,పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ,జారీ చేసిన నోటీసులు,పరిష్కరించిన భూ సమస్యల వివరాలను తహసిల్దార్లును అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల ఆమోదం ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఏడి మైన్స్,జియాలజి రవీందర్,పిడి హౌసింగ్ రాజేశ్వర్,భూగర్భజలాల శాఖ అధికారి శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నష్టపరిహారం ఎప్పుడిస్తారు?

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని కేశపట్నం గ్రామ పరిధిలోని రహదారి విస్తరణలో 28 గుంటల భూమి కోల్పోయి రెండేళ్ల గడిచినా నష్ట పరిహారం రాలేదని మంగళవారం కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన రైతులు కొమురయ్య, చంద్రయ్య అనే రైతులకు చెందిన 28 గుంటల భూమిని ఎన్‌హెచ్ 563 నిర్మాణం కింద భూమిని కోల్పోయారు. రహదారికి అడ్డుగా బైఠాయించి తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేఖ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



## వారంలోగా ఆయుష్మాన్ ఆరోగ్య భవన్ పనులు పూర్తి : కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం భవన నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారంజగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లి, కిషన్‌రావుపేట్ లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం పనలును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ 20 లక్షల నిధులతొ ఆయుస్మాన్ ఆరోగ్యం మందిరం భవన నిర్మాణ పనులలో చిన్న చిన్న ఫెండింగ్ పనులు ఉన్నట్లయితే వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్లంబింగ్, వాటర్ ట్యాబ్, డోర్స్, వాష్‌రూమ్స్ ఫెండింగ్ ఉన్నట్లయితే పూర్తి చేసుకోవాలని వారం రోజు లోపు ఓపెనింగ్ చేయుట కొరకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూధన్, ఈపిఆర్‌వో లక్ష్మణ్‌రావు, డిప్యూటీ డిఎంహెచ్‌వో శ్రీనివాస్, పిడి హౌసింగ్ ప్రసాద్, తహాసీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

### బుగ్గారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సతీష్

**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం పాటుపడతానని , అసాంఘిక కార్యకలాపాలను అందరి సహకారంతో అరికడుతానని జగిత్యాల జిల్లా బుగ్గారం నూతన ఎస్సై గొంగటి సతీష్ అన్నారు.బుగ్గారం ఎస్సైగా ట్రైనీ పూర్తి చేసుకున్న సతీష్ బదిలీ కాగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మాడ శ్రీధర్‌రెడ్డి మేడిపల్లికి బదిలీ అయ్యారు. ఎస్సై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తు పాడుచేసుకోవద్దన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దని చెబుతూ మైనరులకు వాహనాలు ఇవ్వవద్దని పేరెంట్స్‌కు సూచించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.6.40 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మంగళవారం గంగాధర మండలంలోని ప్రజా కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్‌తో తమను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ఏఎంసి వైస్ చైర్మన్ తోట కరుణాకర్, దుబ్బాసి బుచ్చయ్య, సత్తు కనుకయ్య, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ రుద్ర మల్లేశం, గుజ్జుల బాపురెడ్డి, ముద్దం నగేష్, దోమకొండ మహేష్, కోలపురం లక్ష్మణ్, అశోక్, మంత్రి మహేందర్, మ్యాక వినోద్, నారాయణ, వంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలు తొలగింపు షురూ..

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని చల్గల్ గ్రామంలో రైలు వే బ్రిడ్జి కింద నుంచి జగిత్యాల నిజామాబాద్ జాతీయ రహదారి జగిత్యాలకు వచ్చే వైపు రహదారికి అడ్డు గా చాలా రోజుల నుంచి చెట్ల కొమ్మలు ఉండడంతో జగిత్యాల వైపు వచ్చే వాహన్దాలకు సమస్యగా మారిందని ఈ నెల 7 వ తేదీన ప్రజాపక్షం దినపత్రికలో రహదారి అడ్డుగా చెట్ల కొమ్మలు పట్టింపు లేని అధికారులు అని కథనం రాగా ఎట్టకేలకు అధికారులు దిగివచ్చి రహదారి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం పై వాహనదారులకు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాపక్షం దినపత్రిక జగిత్యాల రూరల్ రిపోర్టర్ కి ధన్యవాదాలు తెలిపారు.

## చెట్లను పెంచండి..పరిరక్షించండి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** చెట్లను నాటి వాతావరణ సమతుల్యతను కాపాడాలని ఎంపిడిఒ రాంరెడ్డి పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం జగదేవ్‌పూర్‌లో చెట్లను నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యంను అరికట్టాలంటే చెట్లను నాటి వాటిని సంరక్షించడమే మనముందున్న ఏకైక మార్గమని అన్నారు. వానాకాలం ప్రారంభమైనందున ప్రతి గామ పంచాయతీ పరిధిలో చెట్లను నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాలలోని నర్సరీలలో మొక్కలు అందుబాటులో ఉన్నందున విరివిగా చెట్లను నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు.

# ఐకెపి ద్వారా ఆర్థిక సహకారం

### సిద్దిపేట కలెక్టర్ హైమావతి

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చేయూత

### రంగనాయక్‌సాగర్ పరిశీలన



**ప్రజాపక్షం/ సిద్దిపేటప్రతినిధి :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో ఇందరమ్మ గృహాలు కార్యక్రమం ద్వారా లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణానికి ముగ్గుపోసి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.గంగాపూర్ గ్రామంలో 18 ఇండ్లు మంజూరు కాగా. ఇప్పటివరకు 12 ఇండ్లకు ముగ్గువేశారు. మరో లబ్ధిదారులకు ఎల్లవ్వ ఇంటి నిర్మాణానికి డబ్బులు లేవని ఆర్థిక సహాయం అందించాలని కోరగా ఐకెపి ద్వార ఇంటి నిర్మాణానికి అడ్వాన్ డబ్బులు ఇప్పిస్తానని, తిరిగి ఐకెపి విఓ సంఘానికి అందచేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవటానికి ముందుగా డబ్బులు లేని నిరుపేదలకు ఐకెపి ద్వారా అందించాలని డిఆర్‌డిఓ పిడి జైదేవ్ ఆర్యను ఆదేశించారు. ఇండ్లు వేగంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండ టోకన్లు అందించాలని తహశీల్దార్, ఎంపిడిఓలకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### చంద్లాపూర్ రంగనాయక్ సాగర్ పంప్‌హౌజ్ పరిశీలన

చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామంలో రంగనాయక్ సాగర్ పంప్‌హౌజ్‌ను జిల్లా కలెక్టర్ హైమావతిమంగళవారం పరిశీలించారు. అండర్ టన్నెల్ ద్వారా ప్రయాణించి పంప్‌హౌజ్‌ను చేరుకొగా రంగనాయక్‌సాగర్ డిఈ చంద్రశేఖర్ పంపుహౌజ్‌లోని అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్‌కు చూపించి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించినరంగనాయక్‌సాగర్ రిజర్వాయర్, పంపు హౌజ్ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. రిజర్వాయర్‌లోని వాటర్‌పంపింగ్ స్థలాన్ని చూపించారు. ఆనంతరం జిల్లా కలెక్టర్ రంగనాయక్ సాగర్ గెస్టుహౌజ్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. తహశీల్దార్, ఎంపిడిఓ తదితరుల ఉన్నారు.

### నవోదయకు దరఖాస్తు

నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో అడ్మిషన్ పత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మాస్టర్‌ప్లాన్‌తో రైతుల భూములకు నష్టం ఉండదు

### ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ భరోసా



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో రూ.35 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం రూ. 13 లక్షలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.గ్రామంలో పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్‌తో రైతుల భూములకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం కానివ్వమన్నారు. కొందరు స్వలాభం కోసం రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తారు వారి మాటలు నమ్మవద్దనన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని అన్నారు. జగిత్యాల పట్టణం అభివృద్ధి 50 కోట్ల మంజూరు, అర్బన్ హౌసింగ్ కాలనికి 20 కోట్ల నిధులు, 5 కోట్లతో టిఆర్ నగర్ వద్ద ఎటీసీ కేంద్రం నిర్మాణం దాదాపు పూర్తి అయిందన్నారు. జగిత్యాల రూరల్ ఎంపీడీఓ రమాదేవి, రూరల్ ఎమ్మెర్వో శ్రీనివాస్,ఎఈ రాజ మల్లయ్య,సీనియర్ నాయకులు ముసుకు ఎల్లారెడ్డి, పాలేపు రాజేంద్ర ప్రసాద్, బాల ముకుందం, నారాయణ రెడ్డి,మాజీ సర్పంచులు రాజేశ్వర్ రెడ్డి ,ప్రకాష్, అంకం సతీష్, నాయకులు తిరుపతి, కూడుకల లక్ష్మణ్ ఉన్నారు.

## కొత్తపల్లి రైల్వే సమస్యలపై వినతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కొత్తపల్లి గ్రామంలో గత కరోనా కాలం నుండి గ్రామంలోని రైల్వే స్టేషన్లో ఏలాంటి ట్రైన్లు ఆపడం లేదని ఎస్‌సి కాలనీ, తెనుగుపల్లి విద్యార్థులు రైల్వే జిఎంకు వినతిపత్రం అందజేశారు. భాగ్యనగర్‌తో పాటు పలు ప్యాసింజర్ రైళ్లు నిలపాలని కోరారు. అదేవిదంగా 36 వ గేటు మూసి వేయడం వలన ఎస్‌సి కాలనీ, తెనుగుపల్లి విద్యార్థులు సుమారు 3కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్ పరిశీలనకు వచ్చిన రైల్వే జిఎంని కలిసి కొత్తపల్లి గ్రామ యువకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలసాని క్రాంతి లేనిన్, పెరక రాజేందర్, బొబ్బిలి రాకేష్ పాల్గొన్నారు.

# కార్మికులను బానిసలుగా మార్చడానికే మోదీ కుట్ర

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసలు గా మార్చడానికే నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశ పెట్టిందని, నియంత మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే జూలై 9 న దేశ వ్యాప్త సమ్మె కు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయని, సింగరేణి లో సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్‌వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అద్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులకు పిలుపు నిచ్చారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2ఏ ఇంక్లైన్ మరియు ఏరియా వర్క్ షాప్ లలో వేర్వేరుగా జరిగిన గేట్ మీటింగ్ లలో ఆయన జేఏసీ సంఘాల నాయకులు కచ్చకాయల సదానందం, తుమ్మల రాజిరెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, కట్ట విశ్వనాథం లతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బిజేపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం బ్రిటిష్ ప్రభుత్వం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన లేబర్ కోడ్స్ వల్ల జరిగే నష్టాలు కార్మికులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశంలోని కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులకు బానిసలుగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. జెఎసి సంఘాల నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, కారంపూరి వెంకన్న, దొంత సాయన్న, బి.శ్రీరాములు, సి.హెచ్.చంద్రమోహన్, ఎల్ .రాజకిషోర్, రఘుపతి, రాజేందర్, మెండె శ్రీనివాస్, వడ్డెపెల్లి శంకర్, నూనె కొమరయ్య, పర్లపెల్లి రవి, డి.లచ్చన్న, బి.రాంచందర్, సి.హెచ్. ఐలయ్య తో పాటు జేఏసీ సంఘాల కార్యకర్తలు, కార్మికులున్నారు.

# నేడు 20వేల సైకిళ్ల పంపిణీ

### కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన పుట్టిన రోజు పురస్కరించుకుని భిన్నంగా పేద వర్గాలకు విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కరీంనగర్ వేదికగాతన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విధ్యార్థులందరికీ బుధవారం నుంచి ఉచితంగా సైకిళ్లను అందించనున్నారు. మొత్తం 20 వేల సైకిళ్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీఎస్సార్(కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను చెల్లించిఈమొత్తం సైకిళ్లను కొనుగోలు చేశారు. కరీంనగర్‌అంబేద్కర్ స్టేడియం వేదికగా ఏర్పాట్లు చేశారు. తొలుత కరీంనగర్ టౌన్‌లో టెన్త్ చదువుతున్న విధ్యార్థులకు బండి సంజయ్ బుధవారంఉదయం 11గంటలకు సైకిళ్లను అందజేయనున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, నగర పోలీసు కమిషనర్ గౌష్ ఆలం సహా పలువురు ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరు కానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కానుక పేరుతో ప్రతి ఒక్కరికీ సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.

## లాప్రోస్కోపిక్ సర్జరీ వైద్య బృందానికి అభినందన

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతంగా లాప్రోస్కోపిక్ సర్జరీ నిర్వహించిన వైద్య బృం దాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన 30 సంవత్సరాల ఒక మహిళ గత కొంత కాలంగా గ్లాడ్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉండడము వల్ల కరీంనగర్ లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిటై ఇ.ఆర్.సి.పి, స్టేటింగ్ చేయించుకుంది. ఈమె తీవ్రమైన గ్లాడ్ బ్లాడర్ ఇన్ఫెక్షన్ పాక్రియస్ ఇన్ఫెక్షన్ లతో బాధపడుతూ మూడు రోజుల క్రితం డా. కె. శ్రీధర్ ని సంప్రదించగా, వెంటనే స్పందించి అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్, 2డి ఎకో లాంటి పరీక్షలు నిర్వహించి పేషెంట్ ను అడ్మిట్ చేసుకున్నారు.నేడు సదరు మహిళకు జిల్లా ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో లాప్ సర్జన్ డా. శ్రీకాంత్, జనరల్ సర్జరీ డా .సాయి ప్రసాద్, మత్తు వైద్యులు డా. కృష్ణవేణి, డా. స్వాతి విజయవంతంగా లాప్రో స్కోపిక్ సర్జరీ నిర్వహించారు.అదేవిధంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన 35 సంవత్సరాల ఒక మహిళ ఉదయంఓపిలో తీవ్రమైన కడుపు నొప్పితో రాగా వెంటనే స్కానింగ్ చేస్తే గర్భసంచి పక్కకు వున్నా అండాశయము మెలిక పడి గ్యాగ్రినుగా మారడం జరిగింది.ఇదే మహిళకు కడుపులో ఒక్క లీటర్ వరకు రక్త స్రావము జరిగినది. వెంటనే స్పందిచిన వైద్యులు డా. స్రవంతి, గైనకలజిస్ట్, డా. సౌరయ్య, మత్తు వైద్యులు మరియు డా. కె. శ్రీధర్, మెడికల్ సూపరింటెండెంట్ సర్జరీ నిర్వహించి చెడిపోయున భాగాన్ని తొలగించడము జరిగింది. ఎమర్జెన్సీ లో స్పందించి ఈ సర్జరీ చేయడం వల్ల ఆ మహిళకు ప్రాణాపాయ ముప్పు తప్పింది.జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ప్రజలు ఉపయోగించు కోగలరని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## శాంతిభద్రతల రక్షణలో నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** శాంతిభద్రతల రక్షణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సిద్దిపేట జిల్లా కమిషనర్ బి. అనురాధ సూచించారు. జగదేవ్‌పూర్ ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డి సిపి కార్యలయాంలో మంగళవారం పూలమొక్కను అందజేశారు.ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

# వేముల వెంకట్రాజం మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/చిగురుమామిడిః**సమ సమాజ స్థాపన కోసం, తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిషలు కష్టపడుతూ తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టుపార్టీలోకొనసాగినవేముల వెంకట్రాజం మరణం సిపిఐకి, వారి కుటుంబానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం చిగురుమామిడి మండలం ఇందుర్తిలో ఉదయం తుది శ్వాస విడిచిన వేముల వెంకట్రాజం మృతదేహంపై వెంకటస్వామి నివాళులర్పించారు. సిపిఐ జిలా కార్యవర్గ సభ్యులు,మాజీ జడ్పిటిసి అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిలతో పాటు



జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు వెంకట్రాజం మృతదేహంపై రెడ్ క్లాత్, సిపిఐ జెండా కప్పి నివాళులర్పించారు. మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ ఇందుర్తిప్రాంతంలోసిపిఐ బలోపేతం కోసం నాడు గునుకుల జనార్ధన్‌రెడ్డి, ముస్కు రాజిరెడ్డి, కూన ముత్యాలు, గునుకుల రాంరెడ్డిలతో కలిసి పనిచేశారని, 1980 ప్రాంతంలో సిపిఐ నాయకులపై అనేక దాడులు, హత్యలు జరిగాయని తెలిపారు. అంత్యక్రియల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బూడిద సదాశివ, కంది రవీందర్ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జయపాల్‌రెడ్డి, సిపిఐ శాఖ కార్యదర్శులు ఎం.డి ఉస్మాన్ పాషా, ఇల్లందుల రాజయ్య, మాజీ సర్పంచ్ బోయిని మొండయ్య తదితరులున్నారు.

# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### రూ.76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి

### మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



**ప్రజాపక్షం/వేములవాడ:** మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అగ్రహారం వద్ద గల శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇల్లు కట్టుకొని ఖాళీ ఫ్లాట్స్ ఉన్నవారికి స్పెషల్ కోటా కింద 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటిలో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోట కింద మిడ్ మానేరు నిర్వాసిత గ్రామాల ప్రజలకు నేడు 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, మరో 3 వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పెండింగ్ విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పనిసరిగా ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. 76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్టేట్ రిజర్వు నుంచి మొట్టమొదటి సారిగా 5వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ప్రత్యేక చోరువతో మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ రాము, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఇతర ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నాయకులు లబ్ధిదారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్లకు గ్యాస్ కనెక్షన్లు

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### మధ్యాహ్న భోజనం కోసం మంజూరు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జెడ్పి.హెచ్.ఎస్ లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. విద్యార్థులకు కట్టెల పొయ్యి పై ఆహార పదార్థాలు సిద్ధం చేయవద్దని సూచించారు. దీంతో వాతావరణ కాలుష్యం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జిల్లాలోని 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ పై సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధముగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ లపై సిద్ధం చేయనున్నారు. ఇందులో భాగంగా ముందుగా సిరిసిల్ల లోని గీతా నగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రారంభించారు.





## కీరవాణికి పితృవియోగం



ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రఖ్యాత గేయ రచయిత, చిత్రకారుడు శివశక్తి దత్త కన్నుమూశారు. 92 ఏళ్ల వయసులో వయోభారంతో మణికొండ పంచవటి కాలనీలోని నివాసంలో తుది శ్వాస విడిచారు. 1988లో రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన జానకి రాముడు చిత్రానికి సోదరుడు విజయేంద్రప్రసాద్‌తో కలిసి పని చేశారు. ఆ చిత్రానికి స్క్రీన్ రైటర్‌గా శివశక్తి దత్త పని చేశారు. బాహుబలి 1లో మమతల తల్లి, బాహుబలి 2లో సాహోరే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ రామం రాఘవం, హనుమాన్‌లో థీమ్ సాంగ్ సహా పలు చిత్రాలకు పాటలు రచించారు. శివశక్తి దత్త అసలు పేరు కోడూరి సుబ్బారావు. రాజమహేంద్రవరం సమీపంలోని కొవ్వూరులో జన్మించిన శివశక్తి దత్త... చిన్నప్పుడే కళలపై మక్కువతో ఇంట్లో నుంచి పారిపోయి మద్రాస్ చేరుకున్నారు. అక్కడి ఓ కళాశాలలో సంగీత విద్యను అభ్యసించి గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. కమలేష్ అనే కలం పేరుతో చిత్రాలు గీసేవారు. సినీ రంగంలో అడుగుపెట్టిన తర్వాత సోదరులు విజయేంద్రప్రసాద్ తోపాటు.. కీరవాణి, రాజమౌళి, ఎంఎం శ్రీలేఖ చిత్రాలకు సాహిత్య సంగీత సహకారాన్ని అందిస్తూ వారి విజయాల్లో ముఖ్యపాత్ర పోషించేవారు. శివశక్తి దత్త మరణం ఆ కుటుంబానికి తీరనిలోటని సినిమా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. శివశక్తి దత్త మరణం పట్ల పవన్ కళ్యాణ్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి సంతాపంప్రకటించారు.

## హరిహర వీరమల్లు తెలంగాణ కథ కాదు

### చిత్ర నిర్మాతల స్పష్టీకరణ




పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' తెలంగాణకు చెందిన ఓ వీరుడి కథ ఆధారంగా రూపొందించబడిందని వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తల్లో వాస్తవం లేదు. ఈ చిత్రం నిజ జీవితంలోని ఏ ఒక్క నాయకుడి కథ ఆధారంగానూ తెరకెక్కలేదు. సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి ప్రయాణాన్ని తెలిపే కల్పిత కథగా ఇది తెరకెక్కింది అని చిత్ర సమర్పకులు ఏ ఎం రత్నం అన్నారు. జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత 'హరి హర వీరమల్లు' కథ పూర్తిగా మారిపోయింది. దర్శకుడు కథలోని స్ఫూర్తిని, సారాన్ని అలాగే ఉంచుతూ.. సరికొత్త కథగా దీనిని మలిచారు. పురాణాల ప్రకారం, అయ్యప్ప స్వామిని శివుడుమోహినిల కుమారుడిగా, శైవం , వైష్ణవం మధ్య వారధిగా ఎలా వర్ణిస్తారో.. అలాగే 'హరి హర వీరమల్లు'ను శివుడు , విష్ణువుల అవతారంగా చూడబోతున్నాం. సరిగ్గా గమనిస్తే, హరి(విష్ణు) హర(శివుడు) అనే టైటిల్ ఈ చిత్ర సారాంశాన్ని తెలియజేస్తుంది. శివుడు, విష్ణువుల అవతారం 'వీరమల్లు' అని తెలిపేలా ఈ చిత్రంలో పలు అంశాలను గమనించవచ్చు. విష్ణువు వాహనం గరుడ పక్షిని సూచించే డేగను ఈ చిత్రంలో ఉపయోగించారు. అలాగే, కథానాయకుడు తన చేతుల్లో శివుడిని సూచించే డమరుకం పట్టుకున్నాడు. ఈ చిత్రంలో కథానాయకుడు ధర్మాన్ని రక్షించడానికి మరియు ధర్మం కోసం పోరాడటానికి శివుడు, విష్ణువుల రూపంగా కనిపిస్తాడు.'హరి హర వీరమల్లు' చిత్రం జూలై 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

## 3బిహెచ్‌కె సక్సెస్ మీట్



హీరో సిద్ధార్థ్ లేటెస్ట్ ఫ్యామిలీ బ్లాక్ బస్టర్ '3 బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. శరత్ కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన చిత్రం జూలై 4న విడుదలై ఘన విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ఈ సినిమాలో ప్రతి కొడుకు థియేటర్ కి వెళ్లి తండ్రిని చూడగలుగుతున్నాడు. ప్రతి తండ్రి కొడుకుని చూడగలుగుతున్నాడు. ఒక కామన్ మ్యాన్ కథ చెప్పడం నాకు. గెలుపు మన దగ్గరికి వచ్చేటప్పుడు ఆ సంతృప్తి వేరు. అలాంటి ఆనందాన్ని డైరెక్టర్ శ్రీ గణేష్ ఈ సినిమాలో చూపించాడు. ఈ సినిమాలో ప్రభు క్యారెక్టర్ లాగే నేను కూడా లైఫ్ ని రెండుసార్లు రీసెట్ చేశాను. ప్రభు పాత్ర చాలా విషయాలు నాకు చాలా విషయాలు నేర్పింది. ఓడిపోవడం పర్మినెంట్ కాదని డైరెక్టర్ ఈ సినిమాతో చాలా అద్భుతంగా చూపించాడు. అరుణ్ విశ్వా మంచి కంటెంట్‌ని సపోర్ట్ చేసే ప్రొడ్యూసర్. వారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. శ్రీ గణేష్ రైటింగ్ అద్భుతంగా ఉంటుంది అని అన్నారు.

## ఈనెల 31న 'కింగ్‌డమ్' విడుదల



తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో 'కింగ్‌డమ్' ఒకటి. విజయ్ దేవరకొండ, సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.'కింగ్‌డమ్' చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఒక ప్రోమోను విడుదల చేసింది.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)



లేవని తేలడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అయితే అగంతకుడు తాను పంపిన ఇమెయిల్‌లో జడ్జి వేడుకుంటూ తన బాధను వెల్లడించాడు. దానిలోని అంశాలు ఈ విధంగా ఉన్నాయి. ''ప్రశాంత్‌కిషోర్, సునీల్ లు ఇచ్చిన సలహా మేరకు 2021లో తమిళనాడు డిఎంకె ప్రభుత్వం రాష్ట్రంలోని మీడియాను అదుపు చేసేందుకు ప్రయత్నించింది. జర్నలిస్టులను మచ్చిక చేసుకునేందుకు ఒక ఏజెన్సీకి అప్పగించారు. ఈ జర్నలిస్టులను ఆకర్షించడానికి డబ్బుతో పాటు వారి లైంగిక కోరికలు తీర్చేందుకు.. అన్నా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ చిత్రకళ ఎస్. గోపాలన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులోని అనాథాశ్రమాలకు నుంచి 12 నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన బాలికలను సరఫరా చేశారు. ఇదే విధంగా చెన్నైలోని అయ్యకుడి అనాథాశ్రమాల నుంచి కూడా బాలికలను తరలించి లైంగికంగా వేధించారు. ఏఏ జర్నలిస్టు వద్దకు ఏఏ బాలికలను పంపించారో వారి పేర్లను కూడా పంపిస్తున్నాను. ఈ స్కామ్ గురించి డిఎంకెకు తెలిసోతెలియదో నాకు తెలియదు. అయితే ఈ స్కామ్‌పై కెరళ పోలీసులు తమిళనాడు ప్రభుత్వానికి సమాచారం అందించింది. నా లక్ష్యం పెద్ద నష్టం కలిగించడం కాదు, కానీ వ్యవస్థలను అప్రమత్తం చేయడమే లక్ష్యం. తమిళనాడులోని మహిళా రక్షణ విభాగాలు (ఎడబ్ల్యూపిఎస్) స్పందించకపోవడం, అలాగే కేరళ పోలీసులు ఈ విషయంపై తమిళనాడు డిజిపి కార్యాలయానికి మెయిల్ పంపినా చర్యలు తీసుకోకపోవడం వల్ల తాను ఈ కార్యచరణకు పాల్పడాల్సి వచ్చింది'' అందుకే ఈ మెయిల్ కాపీ పంపిస్తున్నాను. ఈ ఇమెయిల్ అబ్దియా అబ్దుల్లా హాట్‌మెయిల్ పేరుతో వచ్చిందని పోలీసులు నిర్ధారించారు.







## యూరియా కొరతతో ఆందోళనలో రైతులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఏర్పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తీవ్ర ఆందోళన చెందుతున్నారనీ, తక్షణమే యూరియా కొరత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కోటా నిర్దేశించినప్పటికీ అందులో ఇప్పటివరకు 3.06 లక్షల టన్నుల యూరియా మాత్రమే రాష్ట్రానికి సరఫరా అయిందని తెలిపారు. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపుగా 1.94లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనీ, రాష్ట్రంలో రైతులకు తీవ్రమైన ఎరువుల కొరత నెలకోన్నప్పటికీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా వేయకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా కొరత లేకుండా తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.







## స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి



ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్రం కార్యాలయంలో మంగళవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల ఫించన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, అందుకే తాము ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైనట్లు చెప్పారు. ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతున్నట్టు మంద కృష్ణ మాదిగ తెలిపారు. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుండి దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశాలు జిల్లాల్లో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com